
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'





భారత దేశ చరిత్రలో రికార్డ్.. 11 విడతలలో రైతు బంధు పథకం క్రింద నేరుగా రైతుల ఖాతాల్లోకి

రూ. 72,815.09 కోట్లు

- ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పాలన రైతు నవ్వుకు భరోసా
- ఏడాదికి రెండు సార్లు రైతుబంధు, పదేళ్లలో రెండు సార్లు రూ.లక్ష చొప్పున రుణమాఫీ
- రైతుభీమా
- ఉచితంగా 24 గంటల కరెంటు
- సాగునీళ్లు
- వంద శాతం పంటల కొనుగోళ్లు
- తెలంగాణ కల్లాల్లో ధాన్యం రాశులు
- తెలంగాణ రైతన్నల మోముల్లో చిరునవ్వులు
- భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ రెండు సార్లు రుణమాఫీ చేసింది లేదు
- మట్టిని నమ్ముకున్న రైతును గట్టిగా నిలబెట్టాలన్నదే సర్కారు సదాశయం

రైతు బంధు-2018 నుండి 2023 ఆగస్టు నాటికి

క్రసం.	సంవత్సరం	సీజన్: వానాకాలం			సీజన్: యాసంగి			సంవత్సర మొత్తం
		రైతుల సంఖ్య లక్షల్లో	విస్తీర్ణం కోట్ల ఎకరాలలో	మొత్తం రూ. కోట్లలో	రైతుల సంఖ్య లక్షల్లో	విస్తీర్ణం కోట్ల ఎకరాలలో	మొత్తం రూ. కోట్లలో	రూ. కోట్లలో
1	2018-19	50.23	1.30	5237.56	49.12	1.31	5248.80	10486.36
2	2019-20	51.61	1.22	6125.54	42.41	0.88	4406.48	10532.02
3	2020-21	58.01	1.45	7288.70	59.32	1.47	7367.32	14656.01
4	2021-22	60.83	1.47	7360.41	63.00	1.48	7412.53	14772.94
5	2022-23	65.00	1.48	7434.67	64.03	1.46	7308.35	14743.02
6	2023-24	68.99	1.52	7624.74	మొత్తం ఇప్పటి వరకు			72815.09

రాష్ట్రంలో ప్రస్తుతం రైతుబంధు కింద లబ్ధిపొందుతున్న మొత్తం రైతుల సంఖ్య 68,99,076

- ఎస్సీ రైతులు 8,88,926 మంది 12.88%
- ఎస్టీ రైతులు 9,72,972 మంది 14.10%
- బీసీ రైతులు 36,46,804 మంది 52.86%
- మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు 79.85%
- ఇతరులు 13,90,374 మంది 20.15%
- రాష్ట్రంలో 5 ఎకరాలలోపు 92.51 శాతం సన్న, చిన్న కారు రైతులు
- 5 నుండి 10 ఎకరాల వరకు 6.27 శాతం రైతులు
- 10 ఎకరాల పైన ఉన్న రైతులు 1.22 శాతం

5.90 లక్షల ఎకరాల విస్తీర్ణం

గల పోడు రైతులకు రూ. 294.80 కోట్ల రైతుబంధు.



సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి





భారత దేశ చరిత్రలో రికార్డ్..
11 విడతలలో రైతు బంధు పథకం
క్రింద నేరుగా రైతుల ఖాతాల్లోకి
రూ. **72,815.09** కోట్లు

- మట్టిని నమ్ముకున్న రైతన్నకు
మలీద ముద్దలా ఏడాదికి రెండుసార్లు రైతుబంధు
- అన్నం పెట్టే అన్నదాతకు
అండగా రెండుసార్లు రూ.లక్ష చొప్పున రుణమాఫీ
- రైతేరాజు ఎన్నికల నినాదం కాదు
కేసీఆర్ ప్రభుత్వ విధానం

రైతు బంధు-2018 నుండి 2023 ఆగస్టు నాటికి


క్రసం.	సంవత్సరం	సీజన్: వానాకాలం			సీజన్: యాసంగి			సంవత్సర మొత్తం
		రైతుల సంఖ్య లక్షల్లో	విస్తీర్ణం కోట్ల ఎకరాలలో	మొత్తం రూ. కోట్లలో	రైతుల సంఖ్య లక్షల్లో	విస్తీర్ణం కోట్ల ఎకరాలలో	మొత్తం రూ. కోట్లలో	రూ. కోట్లలో
1	2018-19	50.23	1.30	5237.56	49.12	1.31	5248.80	10486.36
2	2019-20	51.61	1.22	6125.54	42.41	0.88	4406.48	10532.02
3	2020-21	58.01	1.45	7288.70	59.32	1.47	7367.32	14656.01
4	2021-22	60.83	1.47	7360.41	63.00	1.48	7412.53	14772.94
5	2022-23	65.00	1.48	7434.67	64.03	1.46	7308.35	14743.02
6	2023-24	68.99	1.52	7624.74	మొత్తం ఇప్పటి వరకు			72815.09

రాష్ట్రంలో ప్రస్తుతం రైతుబంధు కింద లబ్ధిపొందుతున్న మొత్తం రైతుల సంఖ్య 68,99,076

- ఎస్సీ రైతులు 8,88,926 మంది 12.88%
- ఎస్టీ రైతులు 9,72,972 మంది 14.10%
- బీసీ రైతులు 36,46,804 మంది 52.86%
- మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు 79.85%
- ఇతరులు 13,90,374 మంది 20.15%
- రాష్ట్రంలో 5 ఎకరాలలోపు 92.51 శాతం సన్న, చిన్నకారు రైతులు
- 5 నుండి 10 ఎకరాల వరకు 6.27 శాతం రైతులు
- 10 ఎకరాల పైన ఉన్న రైతులు 1.22 శాతం

5.90 లక్షల ఎకరాల విస్తీర్ణం
గల పోడు రైతులకు రూ. 294.80 కోట్ల రైతుబంధు.





సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 159

మంగళవారం 29-8-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నా లక్ష్యానికి పరిమితి లేదు

ఇంకా మెరుగైన ప్రదర్శన ఇవ్వగలనన్న ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా -12లో



జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేస్తోంది

వినాయక చవితికి షురూ.. బోర్డులోకి వారసుల ఎంట్రీ -13లో



ల్యాండర్ ప్రయోగం వాయిదా

జపాన్ మూన్ ల్యాండర్ రాకెట్ ప్రయోగం ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సోమవారం వాయిదాపడింది.

- వివరాలు 6లో



బీజేపీ మళ్లీ గెలిస్తే నియంత పాలనే

బీజేపీ మళ్లీ గెలిస్తే అరాచకమేనని మమత అన్నారు. ఎన్నికల ప్రచారానికి బీజేపీ దేశంలోని అన్ని హెలికాప్టర్లను బుక్ చేసుకుందన్నారు.

- వివరాలు 6లో



నూహ్‌లో ప్రశాంతంగా పూజలు

సర్వజాతీయ హిందూ మహాపంచాయత్ సంస్థ సోమవారం నూహ్‌లో తలపెట్టిన శోభాయాత్రను అధికారులు అడ్డుకున్నారు.

- వివరాలు 6లో



వృద్ధి బాటలో మన ఆర్థికం

భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి బాటలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

గ్యాదరి కిశోర్ మధ్యంతర అప్లికేషన్ కొట్టివేత



తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌కు హైకోర్టు షాకిచ్చింది. తన ఎన్నిక చెల్లదంటూ ఇదే నియోజకవర్గ కాంగ్రెస్‌నేత అద్దంకి దయాకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ఎమ్మెల్యే దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను ఉన్నత న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది.

- వివరాలు 3లో

ఎవరెన్ని ట్రిక్కులు చేసినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం



రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని, ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ విజయం సాధించి తీరుతుందని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కొందరు నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మంత్రి మాట్లాడారు.

- వివరాలు 3లో

ఏపీలో 597 గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీ



గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభ వార్త అందించింది. వివిధ శాఖల్లో 89 గ్రూప్-1, 508 గ్రూప్-2 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీపీఎస్సీ ద్వారా ఈ పోస్టులను నేరుగా భర్తీ చేయనున్నారు.

- వివరాలు 14లో

'పామ్' తోటల ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏటా పెరుగుతున్న పామాయిల్ సాగు

రాయితీలతో రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

5 లో





మరి మనకు కనబడవేం!

కాంగ్రెస్‌కు 'స్క్రీనింగ్' టెస్ట్

అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికపై కీలక కసరత్తు

నేడు భేటీ కానున్న ఎన్నికల కమిటీ.. ఒక్కో సెగ్మెంట్‌లో ముగ్గురు ఆశావహుల ఎంపిక

- సుమారు 70 నియోజకవర్గాల పరిధిలో భారీగా దరఖాస్తులు
- దీనికి ఆయా చోట్ల నాయకత్వ లోపమే కారణమనే అభిప్రాయాలు
- అలాంటి చోట ఎంపిక, తిరస్కరణలకు ప్రాతిపదిక ఏమిటనే ప్రశ్నలు
- గెలవగలిగే వారిని గుర్తించడంపై కీలక నేతల మల్లగుల్లాలు
- త్వరలోనే స్క్రీనింగ్ కమిటీ భేటీ కూడా.. ఆపై సీఈసీ పరిశీలనకు జాబితాలు
- సీడబ్ల్యూసీ ఆమోదం తర్వాత అధికారికంగా అభ్యర్థుల ప్రకటన
- సెప్టెంబర్ మూడో వారానికల్లా తొలి జాబితా.. ఆలోపే మేనిఫెస్టో విడుదలకు చాన్స్



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించాలని, ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి 'స్క్రీనింగ్' పరీక్ష మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేయడం కత్తి మీద సాములా మారిందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. సుమారు 70 నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఆశావహులు పోటీ

మిగతా 2వ పేజీలో ▶

అసలు టాస్క్ మొదలు

కాంగ్రెస్ అభ్యర్థుల కోసం దరఖాస్తుల స్వీకరణ సాగిన తీరును పరిశీలిస్తే.. మంగళవారం జరిగే పీఈసీ సమావేశంలో దరఖాస్తుల షార్ట్‌లిస్ట్ ప్రక్రియ పెద్ద టాస్క్ కానుందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఈ నెల 18 నుంచి 25 వరకు జరిగిన దరఖాస్తుల స్వీకరణలో మొత్తం 119 నియోజకవర్గాలకు గాను 1,016 దరఖాస్తులు వచ్చాయి. వీటిని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విభజించి చూస్తే.. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల నుంచి, నియోజకవర్గ స్థాయిలో స్పష్టతలేని చోట్ల నుంచి, సరైన నాయకత్వం లేనిచోట్ల నుంచి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్టు తేలింది. కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గానికి ఏకంగా 38 దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. గోషామహల్‌లో 19 రాగా.. అశ్వారావుపేట, సనత్‌నగర్, మిర్యాలగూడ, సికింద్రాబాద్ వంటి చోట్ల కూడా ఎక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. ఇలా ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన నియోజకవర్గాలు 70 వరకు ఉన్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

గ్యారంటీ కార్డుతో ప్రజల్లోకి వెళతాం

- అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తాం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే
- లెఫ్ట్ పార్టీలతో ప్రస్తుత చర్చలు అనధికారికమే..
- వచ్చే నెల 17కు కాస్త అటూఇటుగా మేనిఫెస్టో విడుదల ఉంటుందని వెల్లడి

3 లో



గాంధీభవన్‌లో 'రైతు గోస'

- రాష్ట్రంలో భూమి హక్కులు, దళితుల భూముల వేలం, ఇటీవలి పంట నష్టంపై చర్చ
- తమ సమస్యలను, ఆవేదనను వివరించిన రైతులు
- ఠాక్రే, కోదండరెడ్డి, కిసాన్ సెల్ నేతలు హాజరు

వివరాలు 3లో

కేంద్ర నిధులపై ప్రజలకు నివేదికలు



జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో విడుదల.. రాష్ట్ర బీజేపీ నిర్ణయం

- గత తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం చేసిన సాయాన్ని వెల్లడించనున్న నేతలు
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ
- బుక్‌లెట్లు, కరపత్రాల పంపిణీకి నిర్ణయం
- కేంద్రంపై బీఆర్ఎస్ ప్రభుత్వ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కింద తెలంగాణకు కేటాయించిన, విడుదల చేసిన నిధుల వివరాలతో నివేదికలు విడుదల చేయాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో వీటిని వెలువరించనున్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక రూపాల్లో పెద్దెత్తున నిధులు కేటాయిస్తూ విడుదల చేస్తున్నా.. తెలంగాణను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందంటూ కేసీఆర్ ప్రభుత్వం, అధికార బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఇది దోహదపడుతుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ రెండో వారం లోగా అన్ని జిల్లా, అసెంబ్లీ కేంద్రాల్లో 'పవర్‌పాయింట్ ప్రజెంటేషన్' ద్వారా మోదీ ప్రభుత్వం వివిధ శాఖలు, రంగాలకు కేటాయించిన నిధులకు సంబంధించిన గణాంకాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ఆయా వివరాలతో బుక్‌లెట్లు, కరపత్రాలు కూడా పంపిణీ చేయాలని తీర్మానించారు.

గతంలోనే కిషన్‌రెడ్డి రిపోర్ట్ కార్డ్

హైదరాబాద్‌లో గత జూన్ 17న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి 'ప్రజలకు మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల రిపోర్ట్ కార్డ్–తెలంగాణ అభివృద్ధికి అందించిన సహకారం' పేరిట పవర్‌పాయింట్, డిజిటల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్రం నుంచి అందిన సాయానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, రంగాల వారీగా తెలంగాణకు అందిన నిధులు, గ్రాంట్లకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పార్టీ సీనియర్ నేత డా.ఎస్.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిషన్‌రెడ్డి, పార్టీ నేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చంద్రవదన్, తొమ్మిదేళ్ల అభివృద్ధిపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు

మిగతా 3వ పేజీలో ▶

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-4 జవాబు పత్రాలు



అందుబాటులోకి ప్రశ్నపత్రాల ప్రాథమిక 'కీ'లు • ఈనెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–4 పరీక్షల ప్రాథమిక 'కీ'లను తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా గ్రూప్–4 పరీక్షలకు హాజరైన అభ్యర్థుల జవాబుపత్రాల స్కానింగ్ కాపీలను సైతం అభ్యర్థుల కోసం వెబ్‌సైట్‌లో ఉంచింది. వీటిని వచ్చే నెల 27వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చు. ఈ జవాబు పత్రాలు నిర్ణీత గడువు తర్వాత వెబ్‌సైట్‌లో తెరుచుకోవని కమిషన్ స్పష్టం చేసింది. దాదాపు 9 వేల గ్రూప్–4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి టీఎస్‌పీఎస్సీ జూలై 1న ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లలో పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఓఎంఆర్ పద్ధతిలో గ్రూప్–4 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో పేపర్–1కు 7,63,835 మంది

మిగతా 2వ పేజీలో ▶

విమానంలో రెండేళ్ల చిన్నారికి ఎయిమ్స్ వైద్యుల ప్రాణదానం

పుట్టుకతో గుండె సంబంధిత సమస్య ఉన్న రెండేళ్ల పాప విమానంలో ప్రయాణిస్తుండగా హఠాత్తుగా శ్వాస పీల్చడం కష్టమైంది. శరీరం చల్లబడటంతోపాటు పెదవులు, వేళ్ల రంగుమారింది. అంతలోనే గుండెపోటుకు కూడా గురైంది. విషయం తెలిసి.. అదే విమానంలో ప్రయాణిస్తున్న ఎయిమ్స్ వైద్యులు పాపకు చికిత్స అందించి, ప్రాణదానం చేశారు.

- వివరాలు 6లో



పురందేశ్వరి టీడీపీ ఏజెంట్



చంద్రబాబు స్క్రిప్టును బీజేపీ అధ్యక్షురాలిగా ఆమె చదువుతున్నారు

ఎన్నికల కోసం వదిన, మరిది ఒక్కటయ్యారు

సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌పై విష ప్రచారం

- ఎన్నికల కోసం ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణేల పేరిట నాటకం
- ఇది ఎటువంటి కార్యక్రమమైనా ఎన్టీఆర్ భార్యగా నాకు ఆహ్వానం అందాలి.. ఎన్టీఆర్‌కు వెన్నుపోటులో పురందేశ్వరి ప్రధాన కుట్రదారు
- ఎన్టీఆర్ నన్ను పెళ్లి చేసుకున్నారో లేదో కుటుంబ సభ్యులే చెప్పాలి.. ఇల్లీగల్‌గా జీవించి ఉంటే ఎన్టీఆర్ యుగపురుషుడు ఎలా అవుతారు?
- ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి

10 లో


చిరస్మరణీయుడు ఎన్టీఆర్

స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో రాష్ట్రపతి

10 లో

సెప్టెంబర్ 2న ఆదిత్య-ఎల్1 ప్రయోగం

శ్రీహరికోట నుంచి ఉదయం **11.50** గంటలకు..



భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యవలయం లాంగ్రేజ్ పాయింట్–1 (ఎల్1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు. అక్కడకు చేరడానికి 175 రోజులు పడుతుంది. సౌర వాతావరణంతోపాటు అంతరిక్ష వాతావరణం, భూ వాతావరణంపై దాని ప్రభావాన్ని ఇది అధ్యయనం చేస్తుందని ఇస్రో సోమవారం వెల్లడించింది.

రోవర్‌కు తప్పిన ప్రమాదం

- ప్రజ్ఞాన్ ప్రయాణించే మార్గంలో భారీ బిలం
- ప్రత్యేక సూచనలతో మరో దారిలో రోవర్

వివరాలు 6లో

15 తర్వాతే సమగ్ర నోటిఫికేషన్!

టీచర్ నియామక పరీక్షపై విద్యాశాఖ ముమ్మర కసరత్తు

- విధివిధానాలపై రెండు రోజుల్లో ఉత్తర్వులు
- డీఎస్సీల ఏర్పాటు, తదితర అంశాలపై అధికారుల చర్చలు
- రాష్ట్రస్థాయిలో కేంద్రీకృత పరీక్ష విధానానికే మొగ్గు!



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) విధివిధానాల రూపకల్పనపై ముమ్మర కసరత్తు జరుగుతోంది. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సమక్షంలో ఉన్నతాధికారులు సోమవారం ఈ అంశంపై చర్చించారు. ఒకటీ రెండు రోజుల్లో వీటిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే వీలుంది. ప్రతి జిల్లాలోనూ డిపార్ట్‌మెంట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ఏర్పాటు, వాటికి ఇవ్వాల్సిన అధికారాలపై అధికారులు చర్చించినప్పటికీ ఇంకా

మిగతా 2వ పేజీలో ▶

ప్రశ్నపత్రాల కూర్పు ఎవరికి?

టీఆర్టీ పరీక్ష నిర్వహణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఇవ్వడమా? ఎస్‌సీఈఆర్టీకి ఇవ్వడమా? అనే అంశంపై అధికారులు చర్చించారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తే పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధిలోకి తెచ్చే వీలుందని, ఆఫ్‌లైన్ విధానమైతే ఎస్‌సీఈఆర్టీకి అప్పగించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మొత్తం మీద ఎస్‌సీఈఆర్టీకి ఇవ్వడమే సరైన నిర్ణయమని పాఠశాల విద్యాశాఖ భావిస్తున్నట్టు తెలిసింది.

క్లుప్తంగా...

నూహ్‌లో ముస్లింలే లక్ష్యంగా విధ్వంసం: అసదుద్దీన్



సాక్షి, హైదరాబాద్: హరియాణాలోని నూహ్‌లో ఏ ముస్లిం ఇల్లు కూడా మిగల్లేదని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ముస్లింల ఇళ్లే లక్ష్యంగా విధ్వంసం జరిగిందని ఆరోపించారు. ఆయన సోమ వారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో విలేకరులతో మాట్లాడారు. హరియాణా బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా శోభాయాత్ర చేపడతామని వీహెచ్‌పీ బెదిరింపులకు పాల్పడుతోందని, యాత్ర ముసుగులో ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. నూహ్ హింసకు ముందే బీజేపీ ప్రభుత్వానికి వారి లక్ష్యం తెలుసని, అసలు దోషులపై చర్యలు తీసుకొనిఉంటే మరోసారి దాడులకు సాహసం చేసేవారా? అని ప్రశ్నించారు.

నిమ్స్‌కు రూ.1,800 కోట్ల రుణం మంజూరు

లక్డీకాపూల్ (హైదరాబాద్): నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) విస్తరణ పనులకు రూ. 1,800 కోట్లు రుణాన్ని మహారాష్ట్ర బ్యాంక్ మంజూరు చేసింది. నిమ్స్ ఆస్పత్రి విస్తరణలో భాగంగా నిర్మించతలపెట్టిన 2 వేల పడకల దశాబ్ది బ్లాక్‌కు సీఎం కేసీఆర్ జూన్ 14న భూమి పూజ చేశారు. నిమ్స్‌కు కేటాయించిన 33 ఎకరాల్లో విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా మూడు భవనాలను నిర్మించనున్నారు. ఇందుకు ఆర్అండ్‌బీ అధికారులు టెండర్ల ప్రక్రియను చేపట్టారు. ఈనెల 31న టెండర్లను ఖరారు చేయనున్నారు. అందులో భాగంగా మహారాష్ట్ర బ్యాంక్ రుణ సదుపాయాన్ని కల్పించింది. ఈ రుణ మొత్తాన్ని నిమ్స్ నిర్ణీత కాల వ్యవధిలో బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంది. పేదలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చేస్తున్న కృషిలో భాగంగా విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందుకు నిమ్స్ ప్రత్యేకంగా ఓ రిటైర్డ్ ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ లక్ష్మారెడ్డిని నియమించిన సంగతి తెలిసిందే.

సెప్టెంబర్ 10న బీసీల సింహగర్జన: జాజుల



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): సరూర్‌నగర్ స్టేడియంలో సెప్టెంబర్ 10న.. 5 లక్షల మందితో బీసీల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ మహిళలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం నాడు మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత నేడు రాష్ట్రంలో ఎందుకు అడగడం లేదని జాజుల ప్రశ్నించారు. అనంతరం రాష్ట్ర, యువజన, విద్యార్థి, మహిళా విభాగాల నూతన ప్రతినిధులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం 'నేను సావిత్రిబాయి పూలేను మాట్లాడుతున్నాను'అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

'లోకేశ్ నుంచి ప్రాణహాని'

టీడీపీ కోసం ఆస్తులు పోగొట్టుకున్నా ఆకుల వెంకటేశ్వరరావు ఆవేదన



సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని హైదరాబాద్‌కు చెందిన ఆకుల వెంకటేశ్వరరావు ఆరోపించారు. తనకు న్యాయం చేయడంపై చంద్రబాబును కలవడానికి పదేళ్లుగా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవడానికి చంద్రబాబు కార్యాలయంలోకి వెళ్తుండగా.. తనకు న్యాయం చేయాలంటూ వెంకటేశ్వరరావు నినాదాలు చేశారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. బంజారాహిల్స్‌లో తన 400 గజాల స్థలాన్ని చంద్రబాబు మనిషి కేఎల్ నారాయణ లాక్కున్నారని ఆరోపించారు. తన పేరు లోకేశ్ రెడ్ డైరీలో రాసుకున్నారని, లోకేశ్ నుంచి ప్రాణహాని ఉందన్నారు. 33 ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేసి ఆస్తులు పోగొట్టుకొని రోడ్డున పడ్డానని, మానసికంగా తనను చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్‌గా పోటీ చేసి రూ.కోట్లలో పోగొట్టుకున్నానని తెలిపారు.

నేడు జర్మనీలో తెలుగు భాషా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: జర్మనీలోని హనోవర్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని బిహార్‌కు చెందిన గౌతమ్ సాగర్ మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డాక్టర్ కేశవులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం భారత కాలమానం ప్రకారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఉంటుందని పేర్కొన్నారు. అదే జర్మనీలో సాయంత్రం 5.30 గంటల నుంచి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ కార్యక్రమంలో తెలంగాణ నుంచి నటుడు మురళీమోహన్, వేణు, కామినేని ఆసుపత్రి నిర్వాహకులు శ్రీనివాసరావు, చింతలపాటి మురళీకృష్ణ, సోహచంద్రిక, కామేశ్వర శర్మ, ఘంటసాల ఆదిత్య తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. వచ్చే ఏడాది కూడా పెద్ద ఎత్తున వేడుకలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకాశమే హద్దుగా..



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరం అంతర్జాతీయ నగరాలతో పోటీపడి పరుగులు తీస్తోంది. విశాలమైన రహదారులు, ఫ్లైఓవర్లు, ఆకాశ హర్మ్యాలు నగరానికి సరికొత్త డెస్టినేషన్‌గా మారాయి. నగరం పడమటి వైపు వెళ్లే ప్రతి ఒక్కరూ తాము ఏ న్యూయార్క్‌లోనో, మరే సింగపూర్ సిటీలోనో ఉన్నట్లుగా అనుభూతి కలిగించే అద్భుతమైన హైరైజ్ భవనాలు కనువిందు చేస్తాయి. రాత్రి వేళల్లో మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగుల్లో మహానగరం కొత్తగా, శోభాయమానంగా కనిపిస్తుంది. హైటెక్ సిటీ, మాదాపూర్, మణికొండ, నార్సింగి, గచ్చిబౌలి, రాయదుర్గం, కోకాపేట, పుప్పాలగూడ, కొల్లూరు తదితర ప్రాంతాలు హైరైజ్ భవనాలతో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత మూడేళ్లలో 10 చోట్ల ఆకాశహర్మ్యాల నిర్మాణాలకు అనుమతులిచ్చినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు. పలు దిగ్గజ సంస్థలు నిర్మిస్తున్న ఈ ఆకాశహర్మ్యాలు ఒక్కొక్కటి 50 నుంచి 59 అంతస్తుల వరకు ఉన్నాయి. ఈ స్థాయి నిర్మాణాల్లో ముంబై తరువాత రెండు భవనాలు హైదరాబాద్‌లోనే నిర్మితమవుతున్నట్లు అర్వింద్ చెప్పారు. మరో నాలుగైదేళ్లలో ఈ భవనాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రానున్నాయి. హెచ్ఎండీఏ ఇటీవల భూములను విక్రయించిన బుద్వేల్, మోకిలాల్లోనూ హైరైజ్ భవనాలను నిర్మించనున్నారు.

- గ్రేటర్‌లో భారీ ఎత్తున బహుళ అంతస్తుల భవనాలు
- 50 నుంచి 59 అంతస్తుల వరకు నిర్మాణం
- ఇప్పటికే 10 హైరైజ్ భవనాలకు అనుమతులిచ్చిన హెచ్ఎండీఏ

హైదరాబాద్‌లో నిర్మితమవుతున్న టాప్-10 హైరైజ్ భవనాలివీ...

నిర్మాణ సంస్థ	ప్రాంతం	అంతస్తులు
1. క్యాండూర్ స్కైలైన్	పుప్పాలగూడ	59
2. ఎస్ఏఎస్ క్రౌన్	కోకాపేట్	58
3. ది ట్రిలైట్ -1	కోకాపేట్	57
4. ది ట్రిలైట్-3	కోకాపేట్	50
5. శ్రేయాస్ డైమండ్ టవర్స్	పుప్పాలగూడ	55
6. మై హోమ్-99	కోకాపేట్	54
7. యో హైదరాబాద్ బై మై స్కేప్	పుప్పాలగూడ	52
8. పౌలోమి ప్లాజో	కోకాపేట్	54
9. క్యాండూర్ క్రిసెంట్	శేరిలింగంపల్లి	50
10. శ్రేయాస్ డైమండ్ టవర్స్	పుప్పాలగూడ	48

కాంగ్రెస్‌కు 'స్క్రీనింగ్' టెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

కోసం దరఖాస్తు చేసుకోవడంతో.. ఆయా చోట్ల గెలవగలిగేవారిని గుర్తించడంపై కీలక నేతలు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి మంగళవారం జరగనున్న ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం కీలకంగా మారింది. ఆశావహులు ఎక్కువగా ఉన్నచోట అభ్యర్థుల ఎంపికకు, తిరస్కరణకు ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు, ఏ ప్రాతిపదికలను అనుసరిస్తారన్నది రాష్ట్ర కాంగ్రెస్ కేడర్‌లో చర్చనీయాంశంగా మారింది.

ముగ్గురి చొప్పున ఎంపిక చేసి..


అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ వేగవంతం చేసింది. ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన నేపథ్యంలో.. వాటిని వడపోసేందుకు ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) మంగళవారం సమావేశం అవుతోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దరఖాస్తులను పరిశీలించి.. ప్రతి నియోజకవర్గానికి ముగ్గురి పేర్లను, సమస్యాత్మకంగా ఉన్న చోట్ల గరిష్ఠంగా ఐదుగురి పేర్లను ఎంపిక చేయనుంది. పీఈసీ సమావేశం ముగిశాక వీలైనంత త్వరగా స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించి.. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి రెండు లేదా మూడు పేర్లను ఖరారు చేయనున్నారు. అనంతరం ఆశావహుల జాబితాను కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పంపిస్తారు. ఆ కమిటీ సమావేశమై ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో అభ్యర్థి పేరును ఎంపిక చేస్తుంది. ఈ జాబితాను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి పంపుతుంది. సీడబ్ల్యూసీ ఆమోదం లభించాక అధికారికంగా అభ్యర్థులను ప్రకటిస్తామని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు 15–20 రోజుల వరకు సమయం పడుతుందని.. సెప్టెంబర్ మూడో వారానిల్లా తొలి విడత జాబితా వచ్చే అవకాశం ఉందని అంటున్నాయి. మరోవైపు అభ్యర్థుల ప్రకటన వచ్చే లోగానే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల అయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి. సెప్టెంబర్ 17న పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల అవుతుందని, ఆ తర్వాత అభ్యర్థుల తొలి జాబితా ఉంటుందని చెప్తున్నాయి.

నాయకత్వ లేమి ఎఫెక్ట్!

అభ్యర్థిత్వం కోసం 10–12 నియోజకవర్గాల్లో గరిష్ఠంగా రెండు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. కొడంగల్, మధిర, హుజూర్‌నగర్, మంథని, సంగారెడ్డి వంటి నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నాయి. అంటే పార్టీ కీలక నేతలున్న చోట్ల దరఖాస్తులు పెద్దగా రాలేదు. ఇప్పుడు ఇదే ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సభ్యులకు సవాల్‌గా మారనుంది. భారీగా దరఖాస్తులు వచ్చిన చోట్ల మూడే పేర్లను మాత్రమే సూచించాల్సి ఉంటుంది. వారి నుంచే అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే మిగతా దరఖాస్తుదారులను ఏ ప్రాతిపదికన తిరస్కరిస్తారు? ఎంపి చేసే ముగ్గురిని ఏ కారణాలతో ఓకే చేస్తారన్నది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై టీపీసీసీ కీలక నేత ఒకరు మాట్లాడుతూ ''దరఖాస్తులు ఎక్కువ ఉన్నాయని, పార్టీలో ప్రజాస్వామ్యం బాగున్నందునే ఇన్ని దరఖాస్తులు వచ్చాయనేది పైకి చెప్పుకునే మాట. కానీ 70 స్థానాల్లో విచ్చలవిడిగా దరఖాస్తులు వచ్చాయంటే.. అక్కడ నాయకత్వ లేమి ఉందని, నియోజకవర్గ స్థాయిలో ప్రభావితం చూపేవారు సరిగా పని చేయడం లేదని అర్థమవుతోంది. ఈ ప్రతికూల పరిస్థితులను పీఈసీ సమావేశం ఎలా గట్టెక్కిస్తుందో చూడాలి'' అని పేర్కొనడం గమనార్హం.

ఆ భూకేటాయింపు సమర్థనీయమేనా?

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో ఎకరం రూ.1 చొప్పున 5 ఎకరాలను రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీకి ఇవ్వడం ఎలా సమర్థనీయమో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. బుద్వేల్ సర్వే నంబర్ 325/3/2లో 5 ఎకరాల భూమిని 2018 సెప్టెంబర్ 9న రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీకి సర్కార్ కేటాయించింది. ఈ మేరకు జీవో నంబర్ 195ను కూడా వెలువరించింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన కె.కోటేశ్వర్‌రావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. జీవో జారీ చేసిన సర్కార్ దాన్ని రహస్యంగా ఉంచడంవల్లే హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం భూ కేటాయింపు జరిపిందని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదించారు.

ఆ భూములకు మార్కెట్ ధర నిర్ణయించండి

- సర్కార్‌కు హైకోర్టు ఆదేశం
- కమ్మ, వెలమ సంఘాలకు భూకేటాయింపు కేసు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని హైటెక్ సిటీ ప్రాంతంలో కమ్మ, వెలమ కుల సంఘాలకు కేటాయించిన భూములకు మార్కెట్ విలువను నిర్ణయించాలని సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. జీవో 571 ప్రకారం మార్కెట్ ధరను అంచనా వేయాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ చేపట్టిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించింది. ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న గత ఉత్తర్వులను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే నిర్మాణాలు చేసి ఉంటే అవి తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. ఖానామెట్‌లో కమ్మ, వెలమ కుల సంఘాల కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల చొప్పున కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రిటైర్డు ప్రొఫెసర్ ఎ.వినాయక్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం మరోసారి సోమవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. కుల సంఘాలకు భూకేటాయింపు అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. 2012, సెప్టెంబర్ 14 నాటి జీవో 571 మేరకు ప్రభుత్వం ఈ సంఘాలకు ఇచ్చిన భూములకు మార్కెట్ విలువను నిర్ణయిస్తామని, ఇందుకు అనుమతించాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ వినతిని ఆమోదించవద్దని కోరారు. అనంతరం ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ప్రీతి మృతికి కారకులపై ఏం చర్యలు తీసుకున్నారు?

అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారకులపై ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నిందితులపై చర్యలు తీసుకున్నారా? లేదా? అనే వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ర్యాగింగ్ నివారణకు గతంలో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేస్తున్నారా? లేదా? అనే వివరాలను కూడా వెల్లడించాలని చెప్పింది. తదుపరి విచారణను కోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. కులం పేరుతో ప్రీతిని ర్యాగింగ్ చేయడమే కాకుండా, ఆ తర్వాత దారుణంగా హత్య చేశారని, నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లయ్య రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం సోమ వారం విచారణ చేపట్టింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

'వేతన సవరణల్లో జాప్యంతో నష్టపోతున్న ఆర్టీసీ ఉద్యోగులు'

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఆరున్నరేళ్లుగా వేతన సవరణ చేయని ఫలితంగా ఒక్కో ఉద్యోగి రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్, సీనియర్ కార్మిక నేత నాగేశ్వరరావు తెలిపారు. వెంటనే బకాయి ఉన్న రెండు వేతన సవరణలు జరిపి ఉద్యోగులు నష్టపోకుండా చూడాలని కోరారు.

15 తర్వాతే సమగ్ర నోటిఫికేషన్!

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టత రాలేదని తెలిసింది. టీఆర్టీని రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న నేపథ్యంలో డీఎస్సీలకు పరిమిత అధికారాలు మాత్రమే ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో సమన్వయం దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి పెట్టారు. మరోవైపు పరీక్ష నిర్వహణ ప్రక్రియ మొత్తం రాష్ట్రస్థాయిలోనే కేంద్రీకృత వ్యవస్థలో నిర్వహించే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. అవసరమైతే రాష్ట్రస్థాయి పరీక్ష నిర్వహణకు ప్రత్యేక సమన్వయ కర్తలను నియమించాలని భావిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో టీఆర్టీ పరీక్షకు చట్టపరమైన అడ్డంకులు తలెత్తకుండా చూడా లని ప్రభుత్వం సూచించింది.దీంతో విధివిధానాల తయారీలో న్యాయ కోవిదుల సలహాలు కూడా తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పరీక్షకు సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్ సెప్టెంబర్ 15 తర్వాతే వెలువడే వీలుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఆన్‌లైనా? ఆఫ్‌లైనా?

పరీక్ష నిర్వహణ మొదలుకొని, నియామక ప్రక్రియ వరకూ ఎవరి బాధ్యత ఏమిటనే దానిపై తొలుత వెలువడే జీవోలోనే స్పష్టతివ్వాలని వాకా టి కరుణ అధికారులకు సూచించారు. ఆన్ లైన్, ఆఫ్‌లైన్ పరీక్షల్లో ఏది ప్రయోజనం అనే అంశాన్నీ చర్చించారు. ఆన్‌లైన్ విధానంలో కొన్ని సమస్యలు వచ్చే వీలుందని అధికారులు భావిస్తున్నారు. టీఆర్టీ పరీక్ష భాషా పండితులకు, సబ్జెక్టు టీచర్లకు, ఎస్టీజీటీలకు విడివిడిగా నిర్వహిస్తారు. టీఆర్టీకి దరఖాస్తు చేసే వారి సంఖ్య దాదాపు 4 లక్షల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఆన్‌లైన్ పరీక్ష విధానంలో ప్రశ్నపత్రం కూర్పు సమస్యలకు తావిస్తుందనే సందేహాలున్నాయి. ఒకేరోజు 4 లక్షల మందికి కంప్యూటర్ బేస్డ్‌గా పరీక్ష నిర్వహణ కష్టమని. ఒక్కో జిల్లాకు రెండు సెషన్స్ పెట్టాల్సి ఉంటుందని అంటున్నారు. అదే ఆఫ్‌లైన్‌లో అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు పరీక్ష నిర్వహించవచ్చని భావిస్తున్నారు. అయితే దీనివల్ల ఫలితాల ప్రకటన ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

పోస్టులు, వెయిటేజీపై ఇంకా అస్పష్టత

సమగ్ర నోటిఫికేషన్ సెప్టెంబర్ 15 తర్వాతే వెలువడే వీలుందని అధికారులు అంటున్నారు. ఏ జిల్లాలో ఎన్ని పోస్టులున్నాయి? సబ్జెక్టుల వారీగా ఎన్ని ఉన్నాయి? రిజర్వేషన్ల వారీగా పోస్టుల విభజన, బ్యాక్‌లాగ్ పోస్టుల సంఖ్యపై ముందుగా స్పష్టత రావాల్సి ఉంటుంది. దీంతో పాటు ఎస్జీటీలకు, ఎస్ఏలకు ఉండే అర్హతలపైనా అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. మరోవైపు టెట్ అర్హులకు ఇవ్వాల్సిన వెయిటేజీ పైనా చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సమగ్ర నోటిఫికేషన్ వెలువడేందుకు మరికొంత సమయం పట్టే వీలుందని అధికార వర్గాలు తెలిపాయి.

కాళేశ్వరంపై సందేహాలన్నీ తీర్చండి



- అదనపు టీఎంసీ పనులకు అనుమతులు పరిశీలిస్తాం
- మంత్రి హరీశ్‌కు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి లేఖ
- గతంలో ఇచ్చిన వివరణలు అసంపూర్తిగా ఉన్నాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు భవితవ్యం, మనుగడ, సుస్థిరతలపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) లేవనెత్తిన సందేహాల్లో కొన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని, వాటికి కూడా బదులిస్తే అదనపు టీఎంసీ పనులకు అనుమతుల జారీని పరిశీలిస్తామని కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపినట్లు తెలిసింది. జీఎస్టీ సమావేశంలో పాల్గొనేందుకు గత జూలైలో ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అక్కడ జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనులకు సత్వరమే అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తాజాగా షెకావత్ స్పందించారు. మంత్రి హరీశ్‌రావు స్వయంగా లేఖ రాశారు. సీడబ్ల్యూసీ లేవనెత్తిన ప్రశ్నలకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణలు అసంపూర్ణంగా ఉన్నాయని, అన్ని అంశాలపై సమగ్ర సమాధానాలను ఇవ్వాలని లేఖలో కోరినట్టు తెలిసింది. ఆ వెంటనే ప్రాజెక్టుకు అనుమతుల జారీ ప్రక్రియను పునరుద్ధరిస్తామని కూడా తెలియజేసినట్టు సమాచారం.

ఇబ్బందికర ప్రశ్నలు..క్లుప్తంగా వివరాలు

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తైన నాటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతులకు చేసిన వ్యయం, గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్టు యూనిట్‌కు రూ.3 చొప్పున విద్యుత్ సరఫరాకు తెలంగాణ ఈఆర్సీ అనుమతి ఇచ్చిందా? ప్రస్తుత విద్యుత్ చార్జీలు ఎంత? విద్యుత్ చార్జీల భారం దృష్ట్యా భవిష్యత్తులో ప్రాజెక్టు ఆర్థికంగా మనుగడ సాధిస్తుందా? ప్రాజెక్టు సుస్థిర మనుగడకు ఉన్న ఆర్థిక వనరులు ఏమిటి ? ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ఎంత? రుణాలు, వడ్డీల రేట్లు ఎంత? తదితర వివరాలను అందజేయాలని కోరుతూ గతేడాది సెప్టెంబర్ 29న రాష్ట్ర ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ లేఖ రాసింది. గతేడాది జూలైలో గోదావరికి వచ్చిన వరదల్లో మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌస్‌లు ఎందుకు మునిగాయి? పంప్‌హౌస్‌లు, సర్వీస్ బే ఎత్తుఎంత? జలాశయాల ఎఫ్ఆర్ఎల్ ఎంత? లాంటి సాంకేతిక అంశాలపై కూడా ఆరా తీసింది. అదనపు టీఎంసీ పనులకు సంబంధించిన అన్ని కాంపోనెంట్ల డిజైన్లను సమర్పించాలని సూచించింది. దూర ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణాలు, ప్రాజెక్టు కాస్ట్ బెనిఫిట్ రేషియో వివరాలనూ అడిగింది. సీడబ్ల్యూసీ అడిగిన సమాచారం చాలావరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉండడంతో వివరాలు క్లుప్తంగా అందజేసినట్టు తెలిసింది. కాగా ఈ సమాచారంపై సంతృప్తి చెందకపోవడంతోనే అదనపు టీఎంసీ పనులకు అనుమతుల జారీ ప్రక్రియను సీడబ్ల్యూసీ నిలుపుదల చేసినట్టు సమాచారం.

సాయిచంద్ కుటుంబానికి రూ.కోటిన్నర ఆర్థికసాయం

తండ్రి, చెల్లెలికి చెక్కుల అందజేత..



సాయిచంద్ తండ్రి వెంకట్రాములు, చెల్లెలికి చెక్కులను అందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రజినీకి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి సబితారెడ్డి, దాసోజు

బడంగ్‌పేట్/అమరచింత: ప్రజా గాయకుడు, దివంగత నేత సాయిచంద్ కుటుంబానికి సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో నివాసం ఉంటున్న సాయిచంద్ సతీమణి రజినీకి సోమవారం ప్రభుత్వం తరఫున రూ.కోటి చెక్కును ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం రజినీతో పాటు చిన్నారులను ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాసోజు శ్రవణ్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ తండ్రి, చెల్లెలికి చెక్కుల అందజేత

అణగారిన వర్గాల బాధలను, ఆంధ్ర పాలకుల నైజాన్ని ఎండగట్టిన మహాగాయకుడు సాయిచంద్ అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సాయిచంద్ తండ్రి వెంకట్రాములు, చెల్లెలు ఉజ్వలకు చెరో రూ.25 లక్షల చొప్పున చెక్కులను స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అమ్మకం..రూ.4 వేల కోట్ల స్కామ్

- వచ్చే ఆ సొమ్ము ఎన్నికల్లో ఖర్చు చేసేందుకే పన్నాగం
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నిధుల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం బియ్యం అమ్మకానికి పెట్టి.. కస్టమ్ మిల్లర్ల నోట్లో మట్టికొట్టే పనిచేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు కిలో నాలుగైదు రూపాయల తక్కువకు అమ్మాలని సీఎం కేసీఆర్ డిసైడ్ అయ్యారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం.. ఒక్క ఆక్షన్‌కి రూ.1000 కోట్ల స్కామ్.. కోటిటన్నులు అమ్ముకునే ప్రణాళిక బీఆర్ఎస్ సర్కారుదని ఆరోపించారు. ఈ విధంగా వచ్చే రూ.4 వేల కోట్ల అవినీతి సొమ్ము 100 నియోజకవర్గాల్లో..ఒక్కో సెగ్మెంట్‌లో రూ.40 కోట్లు ఖర్చు చేసి వచ్చే ఎన్నికల్లో గెలవాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపణలు సంధించారు. శనివారం అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ బియ్యం అమ్ముకుంటామని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిందని, దీనికి వెనుక అసలు ఉద్దేశం అదేనని ఆరోపించారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని వేలం వేసేందుకు వెయ్యికోట్ల టర్నోవర్, రూ.100 కోట్ల ప్రాఫిట్ ఉండాలనే నిబంధనలు పెట్టారని మండిపడ్డారు. మొదటిదశలో రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలం వేయాలని నిర్ణయించారని, టెండర్‌లో పాల్గొనేందుకు పౌరసరఫరాలశాఖ నిర్ణయించిన విధివిధానాలతో రైస్ మిల్లర్లకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎంఎస్‌పీకి బియ్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో మిల్లర్లు సిద్ధంగా ఉన్నా, టెండర్ల ద్వారా తమ మిల్లు సామర్థ్యం మేరకు ధాన్యం దక్కించుకుందామనుకున్న మధ్యతరగతి మిల్లర్లకు అసలు అందులో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలతో రైస్‌మిల్లర్లు బియ్యం ఆక్షన్‌లో కొనలేరన్నారు. రైస్‌మిల్లర్ల వ్యాపారం బంద్ అయితే రైతులు రోడ్డుమీదకు వచ్చే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్ నుంచి ఎంపీగా కల్వకుంట్ల కవిత పోటీచేస్తే మూడో స్థానానికి పరిమితం అవుతుందని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. తాను ఎంపీగా పోటీలో ఉండడం ఖాయమని ప్రకటించారు.

విద్యుత్ సవరణ బిల్లును అడ్డుకోవాలి

- అది కొందరి ప్రయోజనాల కోసమే
- విద్యుత్ చట్టం–2003ను కూడా రద్దు చేయాలి
- విద్యుత్ అమరవీరుల 23వ వర్ధంతి సభలో పలువురు వక్తలు



సదస్సులో సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్: దేశంలోని కొన్ని కార్పొరేట్ శక్తులకు లాభాలు అందించే సరుకుగా విద్యుత్ మారిందని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 7 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం '2022 విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిద్దాం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను ఎండగడదాం'అనే అంశంపై రాష్ట్ర సదస్సును నిర్వహించారు. అంతకముందు బషీర్‌బాగ్ విద్యుత్ కాల్పుల్లో మృతి చెందిన అమరులకు నివాళులర్పించారు. ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి ప్రసదన్న, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురగరి, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఏఐఎఫ్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ సవరణ బిల్లు–2022 అనేది కేవలం కార్పొరేట్ శక్తులకు మాత్రమేనన్నారు. ఈ బిల్లు వల్ల విద్యుత్ చార్జీలు సామన్య వినియోగదారులకు అందుబాటులో లేనివిధంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పేద ప్రజలు, రైతులు, ప్రజా వినియోగ రంగాలకు ఇచ్చే సబ్సిడీలు క్రమంగా రద్దు అవుతున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విద్యుత్ సవరణ బిల్లు–2022ను ఉపసంహరించుకోవాలని,విద్యుత్ చట్టం–2003ను రద్దు చేయాలని, ప్రీపెయిడ్ మీటర్ల యోచనను విరమించుకోవాలని, 100 యూనిట్లు లోపు గృహవినియోగదారులకు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలంటూ ఈ సదస్సు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, సుకన్య, తేజ, భరత్, హేమలత పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-4 జవాబు పత్రాలు

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులు హాజరు కాగా, పేపర్-2 పరీక్షకు 7,61,026 మంది హాజరయ్యారు.

కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రాథమిక కీలు

పరీక్షలకు హాజరైన అభ్యర్థుల జవాబు పత్రాలను స్కానింగ్ చేసిన కమిషన్... వాటిని అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచింది. నెల రోజుల పాటు వీటిని వెబ్‌సైట్ తెరిచి పరిశీలించుకోవచ్చు. అదే విధంగా గ్రూప్-4 పరీక్షల ప్రాథమిక కీలు సోమవారం నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఈ ప్రాథమిక కీల పైన ఏవేనీ అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీనుంచి సెప్టెంబర్ 4వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు నిర్దేశిత లింకు ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో తగిన ఆధారాలతో సమర్పించాల్సి ఉంటుంది. అభ్యంతరాలను కేవలం ఇంగ్లీషులో మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. నిర్దేశించిన గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమని, ఈమెయిల్, పోస్టు ద్వారా వచ్చే వినతులను సైతం పరిగణించమని, మరిన్ని వివరాలను వెబ్‌సైట్ తెరిచి చూసుకోవాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఒక్కొక్కడిని కాల్చి పడేస్తా..: ఎమ్మెల్యే మర్రి



సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ నేతల మాటల తూటాలతో వాతావరణం వేడెక్కుతోంది. కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. 'పదేళ్ల ప్రజాప్రస్థానంలో మర్రన్న' పేరుతో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం బొప్పల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతుండగా.. అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు 'జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేశారు. దీంతో మర్రి జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ.. 'నాతో పెట్టుకుంటే మీకే నష్టం.. నా కేడర్‌కు చెబితే ఒక్కడు కూడా ఇక్కడ తిరగడు. దమ్ముంటే, ధైర్యముంటే రేపటి నుంచి కాంగ్రెసోడిని తిరగమను. ఒక్కొక్కడిని కాల్చి పడేస్తా. నేను అన్ని కట్టెల్లో కాలి వచ్చిన వాడిని. నా సంగతి తెలియక నన్ను గెలుకుతున్నరు' అంటూ వ్యాఖ్యానించారు. తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని బొప్పల్లికి చెందిన కాంగ్రెస్ నేత భగవంత్‌రావు తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యేవి అహంకార పూరిత మాటలు



కందనూరు: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతాననేమోననే భయంతో కాంగ్రెస్ కార్యకర్తలను కాల్చి పాడేస్తాం అని అహంకార పూరిత మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ డా.మల్లు రవి మండిపడ్డారు. మర్రి వ్యాఖ్యలను చూస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా! లేక దొరల పరిపాలనలో ఉన్నామా? అని అనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ నాయకుల్లో ఓటమి భయం ఉందని, వారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కాంగ్రెస్ కార్యకర్తలు సహనంతో ఉండాలని మల్లు రవి సూచించారు.

'పల్లా తీరు సీఎం సంకల్పానికి విరుద్ధం'



చేర్యాల(సిద్దిపేట): బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డికి డబ్బు మదం ఎక్కువైందని, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తూ పార్టీని మలినం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది అధర్మం, సీఎం సంకల్పానికి విరుద్ధమని ముత్తిరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన సిద్దిపేట జిల్లా చేర్యాలలో విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి ప్రజాప్రతినిధులకు ఫోన్లుచేస్తూ డబ్బులు పంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చిన వారిని 'కుక్కలు' అనడం పల్లా అహంకారానికి నిదర్శనమన్నారు.

నాకు నర్సాపూర్ టికెట్ ఇవ్వాలి: మదన్‌రెడ్డి



నర్సాపూర్: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చినా అభ్యంతరం లేదని, తనకు నర్సాపూర్ టికెట్ కావాలని సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ఏ ఆలోచనతో నర్సాపూర్ టికెట్ ప్రకటించకుండా ఆపారో తెలియదని, పునరాలోచించి తనకే ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌లో పదవులు అనుభవించి బీఆర్ఎస్‌లో చేరారని, ఇక్కడ కేబినెట్ కేడర్ హోదాలో ఉన్నారని పరోక్షంగా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి అన్నారు. తనకు మంత్రి హరీశ్‌రావు అండదండలు ఉన్నాయన్నారు. టికెట్ ఇవ్వకుంటే ఏం చేస్తారని విలేకరులు అడగ్గా.. టికెట్ తనకే వస్తుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

టికెట్ ఇవ్వకుంటే రాజకీయ సన్యాసం



సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఈసారి తనకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. ఆయన సోమవారం మహబూబాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా మహబూబాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇంత బలం ఉన్న తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తుందని భావిస్తున్నానని చెప్పారు. ఒక వేళ ఇవ్వకపోతే ఖద్దరు బట్టలు కాకుండా.. ఎర్రటి వస్త్రాలు ధరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని వెల్లడించారు.

15 స్థానాల్లో ప్రజాపంథా పోటీ: రంగారావు



ఖమ్మం మయూరిసెంటర్: వచ్చే ఎన్నికల్లో 15 స్థానాల్లో పోటీ చేయాలని ప్రాథమికంగా భావిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. ఖమ్మంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడెక్కడ పోటీ చేయనున్నామనే అంశాన్ని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ ప్రధాన లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ–బీఆర్ఎస్ ఇచ్చిపుచ్చుకో అనే ధోరణిలో కొనసాగుతున్నాయని, రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన పార్టీ అధికారం కోసం అంటకాగుతోందని ఆరోపించారు. బీజేపీతో వ్యతిరేకంగా ఉన్నట్లు బీఆర్ఎస్ చెబుతున్నా.. కవిత కేసు, గవర్నర్‌తో సఖ్యత, బండి సంజయ్‌ను అధ్యక్షుడిగా తొలగింపుతో వారి సఖ్యత బయటపడిందని చెప్పారు.

తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తు

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి: ఎంపీ తిరుమావలనన్



లక్డీకాపూల్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని విముక్తి చిరుత కచ్చి (వీసీకే) వ్యవస్థాపకుడు, చిదంబరం ఎంపీ డాక్టర్ తోల్ తిరుమావలనన్ చెప్పారు. సోమాజిగూడలోని దిల్ కుషా అతిథి గృహంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీట్ల సర్దుబాటుపై త్వరలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించడమే వీసీకే లక్ష్యమన్నారు. పేద ప్రజల సంక్షేమానికి ఆ పార్టీలు చేసింది శూన్యమన్నారు. ఇప్పటికే తమ పార్టీ ఇండియా పార్టీలో మిత్రపక్షంగా పని చేస్తోందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలని, అదే విధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి కూడా గద్దర్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

4 జిల్లాల్లో ఫారెస్ట్‌బ్లాక్‌లు రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: నాలుగు జిల్లాల పరిధిలో ఫారెస్ట్ బ్లాక్‌లను రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని ఎస్‌డబ్ల్యూ లింగోటమ్, టీపీ గౌరారం గ్రామం పరిధిలోని 694 ఎకరాల్లో (280 హెక్టార్లు) ఎస్‌డబ్ల్యూ లింగోటమ్ కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫారెస్ట్‌బ్లాక్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో బోయినపల్లి మండలంలోని అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాల్లోని 243 ఎకరాలు (98.3 హెక్టార్లు) అనంతపల్లి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫారెస్ట్‌బ్లాక్, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో సుంగపూర్ గ్రామం పరిధిలోని వంద ఎకరాల్లో (40.57 హెక్టార్లు) సుంగపూర్ కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫారెస్ట్‌బ్లాక్, ఆదిలాబాద్ జిల్లాలోని బేలా మండలంలోని మంగ్రూడ్ గ్రామ పరిధిలోని 22 ఎకరాల్లో (8.9 హెక్టార్లు) మంగ్రూడ్ అఫారెస్టేషన్ ఫారెస్ట్ బ్లాక్‌ను రిజర్వ్ చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. సోమవారం ఈ మేరకు సీఎస్, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన అటవీ భూములకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపులో భాగంగా ప్రభుత్వం వీటిని రిజర్వ్ చేసింది.

జనాభా దామాషా ప్రకారం కురుమలకు సీట్లు ఇవ్వాలి

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం కురుమలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి తెలంగాణ కురుమ యువచైతన్య సమితి (కేవైసీఎస్) విజ్ఞప్తి చేసింది. ప్రస్తుత ఆధునిక సమాజంలో వెనుకబడిన వర్గంగా ఉన్న కురుమలకు వచ్చే ఎన్నికలలో అత్యధికంగా ఎమ్మెల్యే సీట్లు కేటాయించి వెనుకబడిన బహుజన వర్గాల పట్ల బీజేపీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నరసింహ కోరారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో నరసింహ ఆధ్వర్యంలోని బృందం కిషన్‌రెడ్డిని కలిసి కురుమలకు ఎమ్మెల్యే టికెట్‌లు ఇవ్వాలని, కురుమ కులమంతా బీజేపీకి అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా వేములవాడ–తుల ఉమకు, జనగామ–బీరప్ప బేజాడి, మక్తల్–శంకరొల్ల రవి కుమార్, సనత్‌నగర్–చీర శ్రీకాంత్ (సత్యనారాయణ), రాజేంద్రనగర్–బైతి శ్రీధర్, నాగర్‌కర్నూల్–కొండ మణెమ్మ నగేష్‌కు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గ్యారంటీ కార్డుతో ప్రజల్లోకి వెళతాం

అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తాం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే
- లెఫ్ట్ పార్టీలతో ప్రస్తుత చర్చలు అనధికారికమే..
- అసలైన చర్చలు పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేత జరుపుతారు
- వచ్చే నెల 17కు కాస్త అటూఇటూగా మేనిఫెస్టో విడుదల ఉంటుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని కీలక అంశాలతో గ్యారెంటీ కార్డును రూపొందిస్తామని.. ఆ గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయడం ద్వారా అధికారంలోకి వచ్చాక హామీలను నిలబెట్టుకుంటామనే భరోసాను ప్రజల్లో కల్పిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే చెప్పారు. సెప్టెంబర్ 17న పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలన్న ప్రతిపాదన ఉందని.. ఒకట్రెండు రోజులు అటూఇటూగా మేనిఫెస్టోను విడుదల చేస్తామని తెలిపారు. సోమవారం గాంధీ భవన్‌లో రోహిత్‌చౌదరి, మహేశ్‌కుమార్‌గౌడ్, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఫహీంలతో కలసి ఠాక్రే మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పార్టీపరంగా అంతర్గతంగా సర్వేలు నిర్వహిస్తున్నామని, తాము అధికారంలోకి వస్తామని వాటిలో స్పష్టంగా వెల్లడవుతోందని చెప్పారు. రోజురోజుకూ బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతోందని, ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఈ గ్రాఫ్ మరింత దిగజారుతుందని పేర్కొన్నారు. ''తెలంగాణలో ఒక కారు తిరుగుతోంది. ఆ కారులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలతోపాటు బీజేపీ కూడా కలసి ప్రయాణం చేస్తోంది..'' అని ఠాక్రే వ్యాఖ్యానించారు. ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లను బీసీలకు కేటాయిస్తామని చెప్పారు. త్వరలోనే బీసీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్లను ప్రకటిస్తామన్నారు.

'లెఫ్ట్'కు తలుపులు మూయలేదు

లెఫ్ట్ పార్టీలతో పొత్తు అంశంపై ఠాక్రే మాట్లాడారు. ''లెఫ్ట్ పార్టీలతో మేం మాట్లాడాం. వారు మాతో మాట్లాడారు. కానీ ఇదంతా అనధికారికమే. అధికారికంగా ఇంకా చర్చలు ప్రారంభం కాలేదు. లెఫ్ట్ పార్టీలకు మా తలుపులు మూసి ఉంచలేం. ఎందుకంటే వారు ఆర్ఎస్ఎస్, బీజేపీ కాదు. ఇండియా కూటమిలో భాగస్వాములు. అయినా వారితో చర్చలు జరపాల్సింది నేను కాదు. పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేత వారితో చర్చిస్తారు. అప్పుడే చర్చలు అధికారికంగా ప్రారంభమైనట్టు లెక్క. అప్పటివరకు వచ్చే వార్తలన్నీ ఊహాగానాలే..'' అని పేర్కొన్నారు. వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే విషయం గురించి రాష్ట్రస్థాయిలోని తమకు అవగాహన లేదన్నారు. వీలైనంత త్వరగా పార్టీ అభ్యర్థులను ప్రకటించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

గాంధీభవన్‌లో 'రైతు గోస'

- రాష్ట్రంలో భూమి హక్కులు, దళితుల భూముల వేలం, ఇటీవలి పంట నష్టంపై చర్చ
- ఠాక్రే, కోదండరెడ్డి, కిసాన్ సెల్ నేతలు, రైతులు హాజరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో 'రైతు గోస' కార్యక్రమం జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి, జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, అన్ని జిల్లాల కిసాన్ సెల్ అధ్యక్షులు పాల్గొన్నారు. పలు గ్రామాలకు చెందిన రైతులు, బాధితులు హాజరై తమ సమస్యను, ఆవేదనను వివరించారు. ధరణితో భూమి హక్కుల సమస్య తలెత్తిన నిజమైన హక్కుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, వర్షాలతో నష్టపోయిన పంటలకు వెంటనే పరిహారం ఇవ్వాలని.. దళితుల భూములను లాక్కోవడం ఆపేయాలని, తీసుకున్న భూములను 15 రోజుల్లో తిరిగి ఇవ్వాలని కార్యక్రమంలో తీర్మానించారు.

రైతులను నట్టేట ముంచిన సర్కారు

బీఆర్ఎస్ ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందని, దేశంలో పంటల బీమా పథకం లేని రాష్ట్రం ఒక్క తెలంగాణనేనని అన్వేశ్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు భూములిస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని లాక్కుని పెద్ద కంపెనీలకు అమ్ముతోందని, రైతులను బజారున పడేస్తుందని ధ్వజమెత్తారు. ధరణి వచ్చాక లక్షలాది మందికి భూమి హక్కులు రాలేదన్నారు. భూసర్వే జరగకుండా భూమి హక్కుల సమస్య పరిష్కారం కాబోదని స్పష్టం చేశారు. ఇప్పటికీ 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ రైతులకు సమస్యలు వచ్చినా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అన్ని మండలాల్లో కిసాన్ కాంగ్రెస్ నిర్మాణంతో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కేంద్ర నిధులపై ప్రజలకు నివేదికలు

▶ మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

17లోగా అవగాహన కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులకు, ముఖ్యంగా ప్రజలకు వివరించాలని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న అసంబద్ధ విధానాలు, వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. గత తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వ పాలనలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులు, అభివృద్ధిలో కేంద్రం పాత్రకు సంబంధించిన వివరాలు గడపగడపకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి సమావేశాల్లో వివిధ రంగాల ప్రముఖులు, కుల సంఘాలు, వృత్తి సంఘాలు, డాక్టర్లు, ఇంజనీర్లు, రిటైర్డ్ అధికారులను భాగస్వామ్యం చేసుకుంటూ సెప్టెంబర్ 17లోగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

బీజేపీ బాధ్యుల నియామకం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో..బీజేపీ సోషల్ మీడియా, ఐటీ, డేటా, కాల్‌సెంటర్‌లకు బాధ్యులుగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, వెదిరె శ్రీరాం, పోరెడ్డి కిషోర్‌రెడ్డి, జి.యోగానంద్‌లను కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించారు. ఐటీ బృందానికి కన్వీనర్‌గా కె.ప్రకాశ్‌బాబు, జాయింట్ కన్వీనర్లుగా రాహుల్ నేతికార్, సందీప్ మిశ్రా, మరో ఆరుగురిని సభ్యులుగా నియమించారు. సోషల్ మీడియా టీమ్‌కు కన్వీనర్‌గా సుమిరం కొమ్రరాజు, జాయింట్ కన్వీనర్లుగా ఎం.మయూర్‌నాథ్, సాగర్‌గౌడ్, గిరీష్ దారమోని, మరో ఏడుగురిని సభ్యులుగా నియమించారు. కాల్‌సెంటర్ టీమ్‌కు రావుల భరత్‌రెడ్డిని కన్వీనర్‌గా నియమించారు.

బీజేపీకి చరిత్ర లేదు.. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదు

మంత్రి కేటీఆర్ ట్వీట్

- చరిత్ర, భవిష్యత్తు ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్
- కాంగ్రెస్‌ది డిక్లరేషన్ సభ కాదు.. ఫ్రస్ట్రేషన్ సభ
- విజన్ లేని కాంగ్రెస్ ఇచ్చిన డజన్ హామీలు గాలిలో దీపాలే



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో బీజేపీకి చరిత్ర లేదు.. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదు.. చరిత్ర, భవిష్యత్తు ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే..' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. కాంగ్రెస్ సభను ప్రస్తావిస్తూ.. 'అది డిక్లరేషన్ సభ కాదు, అధికారం రానే రాదనే భావనతో జరిపిన ఫ్రస్ట్రేషన్ సభ' అని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ట్వీట్ చేశారు. 'కర్ణాటకలో కనీసం రేషన్ ఇవ్వలేని కాంగ్రెస్ తెలంగాణ కొచ్చి డిక్లరేషన్ ఇస్తే నమ్మేదెవరు? మీ 12 గ్యారెంటీలకు విలువ ఎక్కడిది? చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ ప్రజలకు అన్నీ తెలుసు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరిట విజన్ లేని కాంగ్రెస్ ఇచ్చిన డజన్ హామీలు గాలిలో దీపాలే..' అని కేటీఆర్ విమర్శించారు.

స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత కూడా ఎస్సీలు ఎస్టీలు వెనుకబడి ఉన్నారంటే ఇందుకు ప్రధాన దోషి కాంగ్రెస్ పార్టీయే. దళితులు, గిరిజనుల విషయంలో కాంగ్రెస్ దశాబ్దాల పాటు చేసిన పాపం ఆ పార్టీని మరో వందేళ్లయినా శాపంలా వెంటాడుతూనే ఉంటుంది. కర్ణాటకలో నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి పాలించే ఎబిలిటీ, ప్రజల్లో క్రెడిబిలిటీ లేదు..' అని మంత్రి విమర్శించారు.

కేసీఆర్ ఖేల్‌ఖతం.. బీఆర్ఎస్ దుకాణ్ బంద్

- యావత్ తెలంగాణ గుండె చప్పుడు ఇదే
- కేటీఆర్ ట్వీట్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రీట్వీట్
- 10 అంశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల వైఖరిని పోలుస్తూ పోస్ట్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలకు టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి గట్టికౌంటర్ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల వైఖరిని పోలుస్తూ 10 అంశాలను ఆయన సోమవారం ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. యావత్ తెలంగాణ గుండె చప్పుడు ఒక్కటేనని, కేసీఆర్ ఖేల్ ఖతం –బీఆర్ఎస్ దుకాణ్ బంద్ అని ఆ ట్వీట్‌లో వెల్లడించారు. తమ డిక్లరేషన్ దళిత, గిరిజన జీవితాల్లో గుణాత్మక మార్పునకు డిక్లరేషన్ అని ఆ ట్వీట్‌లో రేవంత్ స్పష్టం చేశారు.

ట్వీట్‌లో పేర్కొన్న అంశాలు

➤ మా డిక్లరేషన్ దళితుడిని సీఎం చేస్తానని మోసం చేయడం కాదు ➤ ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తానని మోసం చేయడం కాదు

➤ గిరిజన రిజర్వేషన్లు 12 శాతం పెంచుతామని మోసం చేయడం ➤ మద్దతు ధర అడిగిన గిరిజన రైతులను బందిపోట్ల కంటే ఘోరంగా బేడీలు వేసి అవమానించడం ➤ నేరెళ్ల ఇసుక దోపిడీని ప్రశ్నించిన దళిత, బీసీ బిడ్డలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం

➤ కాంగ్రెస్ హయాంలో దళిత, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములను లాక్కుని రియల్ ఎస్టేట్ మాఫియాకు అమ్ముకోవడం

➤ మరియమ్మను లాకప్‌డెత్ చేయడం లాంటిది కాదు

➤ కుటుంబంలో ముగ్గురు మంత్రి పదవులు తీసుకొని ఒక్క మాదిగకు కూడా మంత్రి పదవి ఇవ్వకపోవడం కాదు ➤ ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేయడం కాదు

➤ దళిత బంధు పథకంలో 30 శాతం కమీషన్లకు కక్కుర్తి పడడం కాదు

కాంగ్రెస్‌లో చేరిన నాగర్‌కర్నూల్, అచ్చంపేట నేతలు

జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్ దళిత, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చేశామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు గ్రామ గ్రామాన తిరిగి ప్రతి తలుపూ తట్టాలని, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

గ్యాదరి మధ్యంతర అప్లికేషన్ కొట్టివేత

- తనపై ఈపీని కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్
- ప్రధాన పిటిషన్ విచారణార్హమేనన్న న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌కు హైకోర్టు షాకిచ్చింది. తన ఎన్నిక చెల్లదంటూ ఇదే నియోజకవర్గ కాంగ్రెస్‌నేత అద్దంకి దయాకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ఎమ్మెల్యే దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను ఉన్నత న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. ఈ కేసులో సాక్షుల తుదిజాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 4కు వాయిదా వేసింది. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా గ్యాదరి కిశోర్, కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో కిశోర్ విజయం సాధించారు. అయితే కిశోర్ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని, పోలైన ఓట్లకు, ఈవీఎం, వీవీప్యాట్‌ల లెక్కల్లో తేడాలున్నాయని పేర్కొంటూ దయాకర్ 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. కిశోర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడాన్ని రద్దు చేసి, తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా రిటర్నింగ్ అధికారికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ ప్రధాన పిటిషన్ హైకోర్టులో ఇంకా పెండింగ్‌లోనే ఉండగా, తన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన ఎన్నికల పిటిషన్(ఈపీ)ను కొట్టివేయాలంటూ కిశోర్ మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి, కిశోర్ తరపు వాదనలను తోసిపుచ్చారు. ప్రధాన పిటిషన్ విచారణార్హమైనదేనని స్పష్టం చేశారు. సాక్షుల జాబితాను ఫైనల్ చేయాలని ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేశారు.

ఎవరెన్ని ట్రిక్కులు చేసినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

మంత్రి హరీశ్‌రావు

- ప్రజలంతా బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారు
- కాంగ్రెస్‌వి ఉత్తుత్తి, పనికిరాని డిక్లరేషన్లే..
- ఖర్గే సొంత రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని, ఎవరు ఎన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ విజయం సాధించి తీరుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావుతో పాటు మరి కొందరు నేతలు హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ఉత్తుత్తి, పనికిరాని డిక్లరేషన్లు చేస్తోందని విమర్శించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటకలో అధికారంలోకి వచ్చినా, అక్కడ ఇచ్చిన హామీలు కాంగ్రెస్ అమలు చేయడం లేదని అన్నారు. దళితులు, గిరిజనులపై కాంగ్రెస్ ప్రేమ నటిస్తోందని, కానీ ఆయా వర్గాల వెనుకబాటుతనానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆరోపించారు. అంబేడ్కర్‌ను ఓడించడంతో పాటు, భారతరత్న కూడా ఇవ్వలేదని, బాబూ జగ్జీవన్‌రామ్ ప్రధాని కాకుండా కాంగ్రెస్ అడ్డుకుందని విమర్శించారు.

కేసీఆర్ తెలంగాణను సుసాధ్యం చేశారు

అసాధ్యమనుకున్న తెలంగాణను కేసీఆర్ సుసాధ్యం చేశారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి చూపిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని హరీశ్‌రావు చెప్పారు. మేనిఫెస్టోలో ఏమీ చెప్పకపోయినా ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని అమలు చేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. వైన్స్, కాంట్రాక్టుల్లో దళితులకు రిజర్వేషన్లు, దళితబంధు వంటి పథకాలు ఆయన వల్లనే సాధ్యమయ్యాయన్నారు. వెనుకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఐదు మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పాటు కల్వకుర్తి ప్రాజెక్టుతో మూడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించామని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కూడా బీఆర్ఎస్ పార్టీ వల్లనే సాధ్యమవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు, రోడ్లు కూడా లేని పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణ తరహా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని హరీశ్‌రావు కోరారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడియం శ్రీహరి గుంటనక్క లాంటివాడు

రాజయ్యకు టికెట్ రాకపోవడం ఆయన కుట్రే: మంద కృష్ణ



స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి గుంటనక్కలాంటి వాడని, ఆనాడు డాక్టర్ రాజయ్య డిప్యూటీ సీఎం బర్తరఫ్‌లో, ప్రస్తుతం బీఆర్ఎస్ టికెట్ రాకపోవడంలో కడియం కుట్ర ఉందని, రెండు సందర్భాల్లో కడియం సూత్రధారుడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం జరిగిన నియోజకవర్గస్థాయి మాదిగల అస్థిత్వం, ఆత్మగౌరవసభలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో మాదిగల అస్థిత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత మాదిగలందరిపై ఉందన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో రాజయ్య పంచె, ధోతి కట్టుకుని రాష్ట్రమంతా తిరిగితే పెద్దదొర కేసీఆర్, దళితదొర కడియం ఓర్వలేదన్నారు. కడియం మాదిగలను అణగదొక్కేలా గుంటనక్కలా వ్యవహరిస్తున్నారన్నారు. లైంగిక వేధింపుల విషయమై రాజయ్యపై నిరాధారమైన ఆరోపణలతో మహిళా కమిషన్ సుమోటో కేసు ఎలా స్వీకరించిందని మంద కృష్ణ ప్రశ్నించారు. భూపాలపల్లి, బెల్లంపల్లి, ఆర్మూరు ఎమ్మెల్యేలపై లైంగిక వేధింపులపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు. కేవలం రాజయ్య మాదిగ ఎమ్మెల్యే కావడంతోనే సుమోటోగా స్వీకరించారన్నారు.



ఇతరులను తప్పు పట్టేముందు, మిమ్మల్ని ముందుగా ఈ ప్రశ్న వేసుకోండి: నేను విమర్శించబోయే దానిని పోలిన తప్పు నాలో ఏం ఉంది?

- మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 29 ఆగస్టు 2023

మన బంగారు కొండ

భారత క్రీడాభిమానులకు ఇది హృదయం ఉప్పొంగే క్షణం. అథ్లెటిక్స్‌లోనూ మన ఆటగాళ్ళు విశ్వ విజేతలుగా నిలుస్తున్న అపురూప సందర్భం. నిన్నటి దాకా ఒలింపిక్ ఛాంపియన్ మాత్రమే అయిన ఓ క్రీడా దిగ్గజం ఇవాళ ప్రపంచ ఛాంపియన్ కూడా అయిన అపూర్వ ఘట్టం. బుడాపెస్ట్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో పురుషుల జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణం సాధించడం ద్వారా భారత అథ్లెట్ నీరజ్ చోప్రా ఆదివారం నాడు అక్షరాలా చరిత్ర సృష్టించారు. ప్రపంచ అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు. దేశం గర్వపడేలా చేశారు. ఆదివారం నాడు రెండో ప్రయత్నంలో గరిష్ఠంగా 88.17 మీటర్ల దూరం ఈటెను విసిరి, నీరజ్ సాధించిన ఈ స్వర్ణపతకం ఇక భారత క్రీడాచరిత్రలో సువర్ణాక్షర లిఖితం.

భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ఊరిలోని నీరజ్ ఇంట్లో ఆయన తండ్రి, బంధుమిత్రులు ఒక్కచోట కూడిన ఉత్కంఠగా చూసిన ఈ విజయఘట్టం వారికే కాదు... యావద్భారతావనికి కూడా ఉద్విగ్నభరితమైనది. ఆర్మీలో సుబేదార్ అయిన పాతికేళ్ళ నీరజ్ చోప్రా మాటల్లోనే చెప్పాలంటే, ఒలింపిక్స్ కన్నా వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ కఠినమైనది. ఒలింపిక్స్ ప్రత్యేకమైనది అయితే, వరల్డ్ ఛాంపియన్ అనేది అతి పెద్ద కిరీటం. పోటీ పరంగా చూసినా, అథ్లెట్లు అవిశ్రాంత సాధన చేసి వచ్చే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ఎప్పుడూ కాస్తంత ఎక్కువ కఠినమే. అలాంటి వేదికపై స్వర్ణసాధనతో నీరజ్ 'భారతదేశంలో ఆల్‌టైమ్ అతి గొప్ప అథ్లెట్'గా అవతరించారు. మొహమాటంగా ఆ పిలుపును పక్కనపెడుతూ, ఆయన వినయంగా వ్యవహరిస్తున్నప్పటికీ అది వాస్తవమే. అటు ఒలింపిక్స్ స్వర్ణం, ఇటు తాజా ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ స్వర్ణం – రెండూ సాధించిన ఏకైక భారత అథ్లెట్ ఈ సైనికుడే.

మధ్యతరగతి నుంచి వచ్చిన నీరజ్ ఈ స్థాయికి చేరడానికి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నారు. మోచేతికి గాయం కావడంతో 2019లో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. అలా అప్పట్లో దోహాలో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌కు హాజరు కాలేకపోయారు. తర్వాత రెట్టించిన ఉత్సాహంతో వచ్చి, 2020 జనవరిలో టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆలస్యంగా ఆ మరుసటేడు జరిగిన ఆ ఒలింపిక్స్‌లో ఏకంగా స్వర్ణం సాధించారు. మన దిగ్గజ అథ్లెట్లైన మిల్ఖాసింగ్, పీటీ ఉషకు సైతం అందని ఆ స్వర్ణకీర్తిని అందుకున్నారు. అలా రెండేళ్ళ క్రితం 2021 ఆగస్టులో జరిగిన టోక్యో ఒలింపిక్స్‌– 2020లో స్వర్ణసాధన నాటి నుంచి అందరి దృష్టీ నీరజ్‌పై ఉంది. ఇప్పుడీ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లోనూ బంగారు పతకం తెచ్చి, అథ్లెటిక్స్‌లో మన దేశానికి పతకాలు పండించే బంగారు కొండ అయ్యారు. సౌత్ ఏషియన్ గేమ్స్ (2016), ఏషియన్ ఛాంపియన్‌షిప్స్ (2017), కామన్వెల్త్ గేమ్స్ (2018), ఏషియన్ గేమ్స్ (2018), ఒలింపిక్స్ (2020), డైమండ్ లీగ్ (2022), ఇప్పుడు వరల్డ్ ఛాంపియన్‌షిప్స్... ఇలా నీరజ్ సాధించిన స్వర్ణాలే అందుకు సాక్ష్యం.

మొత్తం ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ చరిత్రలో భారత్‌కు ఇది మూడో పతకం. ఇంతకు మునుపు జరిగిన 18 ఛాంపియన్‌షిప్‌లలో మన దేశానికి వచ్చినవి రెండు పతకాలే. ఆ రెండింటిలో కూడా ఒకటి నిరుటి ఛాంపియన్‌షిప్స్‌లో నీరజ్ చోప్రా సాధించిన రజతమే. అంతకు ముందెప్పుడో 2003లో మహిళల లాంగ్‌జంప్‌లో అంజూ బాబీ జార్జ్ కాంస్యం గెలిచారు. అప్పుడలా విశ్వవేదికపై మొదలైన మన పతకాల లెక్క ఇప్పుడు మూడుకు చేరడం ఒక రకంగా ఆనందమే అయినా, మరోరకంగా ఇన్నేళ్ళకు గానీ ఆ స్థాయికి చేరకపోవడం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. ప్రపంచ స్థాయికి చేరేలా మన ఆటగాళ్ళను ప్రోత్సహించేందుకు మనం చేయవలసినంత చేస్తున్నామా అన్నది ఆలోచించాల్సిన విషయం.

అయితే, ఒకప్పుడు అంతర్జాతీయ యవనికపై భారతీయ క్రీడ అంటే హాకీ. తర్వాత క్రికెట్, ఆ పైన చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, రెజ్లింగ్ వగైరాల్లోనూ మన ప్రతిభకు తక్కువ లేదని నిరూపితమవుతూ వచ్చింది. నిజానికి, జావెలిన్ త్రోలో సైతం ఒకప్పుడు విశ్వవేదికపై మనం ఎక్కడ ఉన్నామో కూడా ఎవరికీ తెలీదు. కానీ, ఇప్పుడు ఏకంగా ముందు వరుసలో నిలిచాం. అందులోనూ తాజా పోటీలో కిశోర్ జెనా, డీపీ మను అనే మరో ఇద్దరు భారతీయ జావెలిన్ త్రో వీరులు కూడా ఉండడం, వారిద్దరు 5వ, 6వ స్థానాల్లో నిలవడం... ఇవన్నీ మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భవిష్యత్తు పట్ల ఆశలు రేపుతున్నాయి. ఆ ఆశలు నెరవేరడానికి నీరజ్ అన్నట్టు మన దగ్గర కూడా కీలకమైన మోండో ట్రాక్స్ వగైరాలను అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) సిద్ధం చేయడం అవసరం.

చెక్ రిపబ్లిక్‌కు చెందిన దిగ్గజ అథ్లెట్ జెలెజ్నీ 98.48 మీటర్ల దూరం ఈటె విసిరి, ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. మూడుసార్లు ఒలింపిక్స్‌లో, మరో 3 సార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకాలు గెలిచారు. అతనే తనకు స్ఫూర్తి అని చెప్పే నీరజ్ ఆ స్థాయికి చేరడానికి చేయాల్సిన శ్రమ, సాగించాల్సిన ప్రయాణం ఇంకా చాలానే ఉంది. ఆ ప్రయాణానికి మన ప్రభుత్వాలు, క్రీడా సంస్థలు అందించాల్సిన సహకారమూ అపారమే. నీరజ్ ఒలింపిక్స్ సాధన తర్వాత హరియాణాలోని పానిపట్ సహా అనేక గ్రామాల్లో పిల్లల్లో, ఇళ్ళల్లో క్రీడల పట్ల ఆసక్తి కొన్ని పదుల రెట్లు పెరిగింది. గుంపులుగా వచ్చి, ఆటలాడుతున్న ఆ భావి భారత ఆశాకిరణాలకు మైదానాలు, ఆస్పత్రుల లాంటి కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ కర్తవ్యం. ఆ దిశగా కృషి చేస్తే, మరింత మంది నీరజ్‌లు ఈ గడ్డపై నుంచి వస్తారనడంలో సందేహం లేదు.

నిజంగానే అంత చెడ్డ దేశమా?!

కామెంట్



కరణ్ థాపర్


"పాక్ పాలకులపై ఆగ్రహంతో మనం ఎందుకని పాకిస్తాన్ పౌరులకు వీసాలను తిరస్కరిస్తున్నాం? పాకిస్తానీయులందరూ జిహాదీలేనని మనం నమ్ముతున్నామా? పాకిస్తానీ జనాభాలోని 99.99 శాతం మందికి ఏ మాత్రం సంబంధం లేని ఉగ్రవాద చర్యలకు ప్రతీకారం తీర్చుకోవడానికి సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను ఎందుకు రద్దు చేయాలి? పాకిస్తానీయులను భారతదేశంలోని తమ బంధువులతో కలవనీయకుండా చేస్తే హురియత్ తన ఆజాదీ పిలుపును విరమించుకుంటుందని నిజంగానే మనం భావిస్తున్నామా?"... ఈ ప్రశ్నలన్నిటినీ మనం ఎదుర్కోవలసిన అవసరం ఉందని మణి శంకర్ అయ్యర్ తన ఆత్మకథలో రాశారు. కరాచీలో కాన్సుల్–జనరల్‌గా ఆయన నాలుగేళ్ల కాలాన్ని పొందుపరచిన అధ్యాయం... మనవాళ్లలో చాలామంది శత్రువుగా భావించే దేశంలోని ప్రేమ, అవగాహనలను తెలియబరుస్తుంది.

మణి శంకర్ అయ్యర్ ఆత్మకథలోని మొదటి సంపుటం గురించి నా అభిప్రాయం ఏంటంటే – చెప్పడంలోని సొగసంతా క్లుప్తతలోనే ఉంటుందన్న మాటపై ఆయనకు నమ్మకం లేదని. 'మెమోయిర్స్ ఆఫ్ ఎ మావెరిక్'లోని ప్రారంభ అధ్యాయాలు మరీ అంత మితిమీరిన సమాచారంతో ఉండవలసింది కాదు. ఉల్లాసమైనవీ విసుగు తెప్పించేవీ, ఆసక్తికరమైనవీ అసంబద్ధమైనవీ, హాస్యభరితమైనవీ నిస్సారమైనవీ... అన్నిటినీ కూడా అయ్యర్ తనకు సాధ్యమైనంతగా వివరాలతో కిక్కిరిసిపోయేలా చేశారు. అందంగా రాశారు, అందులో సందేహం లేదు. కానీ అవసరంలేని దీర్ఘమైన నిరంతరాయ సాగతీతలు ఉన్నాయి. నిజానికి ఆ విషయాన్ని ఆయన ఒప్పుకొన్నారు. అనివార్యంగా కథనంలో అంత స్వాతంత్రతను కోల్పోయానని తనను తాను తిట్టుకున్నారు కూడా.

అయితే అంతకుమించి ఆయన్ని తప్పు పట్టేందుకేమీ లేదని వెంటనే నేను గుర్తించాను. తన జన్మనక్షత్రాలు, కుటుంబ వివరాలు, పెంపుడు జీవుల విశేషాలు, లేదా తన డూన్ స్కూల్ నాటి జ్ఞాపకాలను అలుపు తెప్పించేలా చెప్పడంలోని ఆయన స్వీయ సంతృప్తిని మీరు క్షమించాలి. కేవలం యూనియన్ (విద్యార్థి సంఘం) అంటే ఉన్న మక్కువతో మాత్రమే ఆయన కేంబ్రిడ్జిలో చేరే సమయం రాగానే పుస్తకంలోని పఠనీయ పరిస్థితులు మెరుగవుతాయనడంలో సందేహం లేదు. యూనియన్ అధ్యక్షుడవడం ఆయన ఏకైక ఆశయం. పాపం ఆ ఆశయాన్ని సాధించలేకపోయారు. వాస్తవానికి యూనియన్ అధ్యక్ష స్థానానికి చేరువయ్యే సోపాన క్రమంలో అట్టడుగున ఉండే స్థాయీ సంఘానికి ఎన్నికవడానికి కూడా ఆయనకు కష్టమయింది. కానీ ఆయన ప్రయత్నంలోని మనోహరమైన నిజాయితీ మీ మనసును గెలుచుకుంటుంది. అంతేకాదు, 21వ శతాబ్దపు తొలి దశాబ్దానికి చెందిన ఈ రాజకీయ నాయకుడు పన్నెండవ శతాబ్దపు రౌండ్ చర్చి వెనుక ఉన్న కేంబ్రిడ్జి యూనియన్ చాంబర్‌లో రూపొందాడన్నది స్పష్టంగా తెలుస్తుంది.

బంజరు భూముల వంటి ఈ ప్రారంభ పుటలను దాటితే డిసెంబరు మాసపు మొఘల్ గార్డెన్స్‌లా పుస్తకం వికసించి కనిపిస్తుంది. హఠాత్తుగా ఆయన అలవిమాలిన సమాచారం... చూపు తిప్పని వివరాలతో కూడిన కథనంగా మారిపోతుంది. కథకు అందే ప్రతి చిన్న చేరికతో ఆయన చూపుతున్న ప్రపంచం మనల్ని మరింతగా ఆకర్షిస్తుంది. ఇక్కడికి వచ్చేసరికి నేను పుస్తకాన్ని కింద పెట్టలేకపోయాను.





రాత్రి బాగా పొద్దుపోయే వరకు కూడా, దానికి ఏదీ సాటిరాని స్కాట్‌లాండ్ జలాలతో బలోపేతం అయిన పేజీలను తిప్పుతూ ఉండిపోయాను. ఓ, ఢిల్లీలోని ఉష్ణోగ్రతల కారణంగా కొంచెం ఐసుతో కూడా!

ఆయన ఫారిన్ సర్వీసుకు ఎప్పటికీ ఎలా చేరుకోలేక పోయారనే గాథను పుస్తకంలోని ముఖ్యాంశంగా పత్రికలు ఇచ్చి తీరాలి. మన ప్రముఖ పత్రికలలో ఒకటేదైనా ఇస్తుందని నాకు గట్టి నమ్మకం కనుక ఆ వివరాలను ఇక్కడ వెల్లడించడం ద్వారా పాఠకుల ఆసక్తిని ముందే చెప్పి పాడు చేయలేను. ఒకటైతే చెబుతాను. పుస్తకంలోని ఈ ముఖ్యాంశాన్ని ఇవ్వకపోతే మీ అభిమాన దిన పత్రికను కొనడం మానేయండి.

ఏదేమైనా, కరాచీలో కాన్సుల్–జనరల్‌గా పాకిస్తాన్‌లోని ఆయన నాలుగేళ్ల కాలాన్ని పొందుపరచిన అధ్యాయం... మనవాళ్లలో చాలా మంది శత్రువుగా భావించే దేశంలోని ప్రేమ, అవగాహనలను తెలియబరుస్తుంది. మీలో చాలామందిని అది అక్షరాలా ఆకట్టుకునేలా ఉంటుంది. పాకిస్తాన్‌ని ఆయన ఉన్నదున్నట్లుగా లేదా, నిజాయితీగా చెప్పాలంటే పాకిస్తాన్ అప్పట్లో ఉన్న విధంగా... మనవాళ్లు మనలో కలిగించిన, విధేయతతో సత్యం అని మనం నమ్మిన అపోహలను, అబద్ధాలను చెల్లాచెదురు చేసేలా ఆయన చిత్రీకరించారు.

మర్యాదపూర్వకంగా, ఆప్యాయతతో ఉండండి, అప్పుడు పాకిస్తానీలు అదే విధమైన తమ ప్రతి స్పందనతో మిమ్మల్ని ముంచెత్తుతారు అని మణి కటువైనది కాని సూచనగా మీకు చెబుతారు. "భారతీయ శత్రుత్వం, లేదా శత్రుత్వ భావన పాకిస్తానీలను వారి ప్రభుత్వం లేదా సైన్యం వెనుక సమైక్యం అయ్యేలా చేస్తోంది" అంటారు మణి. ఇప్పుడూ అంతే కదా... మనం వారిని వారి సైన్యం బాహువుల్లోకి విజయవంతంగా నెట్టేస్తున్నాం.

మనం ఎదుర్కోవలసిన అవసరం ఉన్న ప్రశ్నలను మణి లేవనెత్తారు. "పాక్ పాలకులపై ఆగ్రహంతో మనం ఎందుకని పాకిస్తాన్ పౌరులకు వీసాలను తిరస్కరిస్తున్నాం? పాకిస్తానీయులందరూ మన దేశంలో విధ్వంసాన్ని సృష్టించే జిహాదీలేనని మనం నిజంగా నమ్ముతున్నామా? పాకిస్తానీ జనాభాలోని 99.99 శాతం మందికి ఏ మాత్రం సంబంధం లేని ఉగ్రవాద చర్యలకు ప్రతీకారం తీర్చు కోవడానికి సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను ఎందుకు రద్దు చేయాలి? మనం కనుక పాకిస్తానీయులను భారతదేశంలోని తమ బంధువులతో కలవనీయకుండా చేస్తే హురియత్ తన ఆజాదీ పిలుపును విరమించుకుంటుందని నిజంగానే మనం భావిస్తున్నామా?"

ఇందుకు ఆయన ఇచ్చిన సమాధానాన్ని నేను సమర్థిస్తాను... అది భౌగోళికంగా కచ్చితంగా లేకుండా ధ్వనిపూర్వకంగా మాత్రమే దగ్గరగా ఉన్నప్పటికీ. "పరాగ్వేలో మనం పడిపోకుండా ఉన్నాం. పొరుగు దేశమైన పాకిస్తాన్‌లో నిలబడలేకున్నాం."

మనలో చాలా మందికి తెలియని ఒక సత్యాన్ని సంగ్రహించే ఒక వాక్యాన్ని మీకు వదిలేస్తాను. అయితే కొద్ది మంది దానిని అంగీకరించరు. "శాంతి కోసం జరిగే ప్రయత్నాలు భారతదేశంలో కంటే పాకిస్తాన్‌లోనే ఎక్కువని అయిష్టంగానే నేను ముగించాల్సి వచ్చింది."

ఈ మాటను మీరు అంగీకరిస్తే... మీరు ఈ పుస్తకాన్ని చదివేందుకు, మీరెంత కచ్చితమైన వారో తెలుసుకునేందుకు అది మిమ్మల్ని ప్రలోభపెడుతుందని నా ఆశ. అలా కాకపోతే మీకు ఎన్నడూ చెప్పని, లేదా మీ నుండి దాచి పెట్టినవాటిని ఎదుర్కోడానికి మీలో కోపాన్నైనా రేకెత్తించనివ్వండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఖండనార్హం



ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఒక ముస్లిం పిల్లాడు ఒక హిందూ టీచర్ చేతిలో దారుణమైన దౌర్జన్యానికి గురయ్యాడు. కశ్మీర్‌లోని కథువాలో ఒక హిందూ పిల్లాడు ఒక ముస్లిం చేతిలో దారుణమైన దౌర్జన్యానికి గురయ్యాడు. పరస్పర నిందల వల్ల ఉపయోగం లేదు. ఈ రెండు చర్యలూ హీనమైనవి. ఆరోగ్యకర ఆలోచనలు ఉన్న ప్రతి భారతీయుడూ వీటిని ఖండించాలి.

– సాకేత్ గోఖలే, తృణమూల్ ఎంపీ (రాజ్యసభ)

దేనికోసం?



మసీదులు, శ్మశానాలు, మదరసాలు, ఇతర సామాజిక కార్యకలాపాల్లో 'దళిత ముస్లింలు' కులతత్వం వల్ల వివక్షను ఎదుర్కొంటున్నారని అన్సారీ (సోషియాలజీ ప్రొఫెసర్ ఖాలిద్ అనీస్ అన్సారీ) వాదిస్తున్నారు. 1990లో లోక్‌సభలో వాజ్‌పేయి అడిగిన ప్రశ్ననే నేను మళ్లీ అడుగుతున్నాను: 'మరి వాళ్లెందుకు మతం మారినట్టు?'

– దిలీప్ మండల్, సంపాదకుడు

గుర్తించాలి



రాజ్యానికీ, మతానికీ మధ్య లౌకికవాదం అనేది ఒక గోడ వంటిది. పౌరుడికీ, మతానికీ మధ్య కమ్యూనిజం ఒక గోడ వంటిది. అందుకే కమ్యూనిజం అనేది లౌకికవాదం కాదు.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

శాంతి శాంతి



టీవీ వ్యాఖ్యాతలతో సహా ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయం చెప్తుంటారు– ఇది మంచిది, అది చెడ్డది, ఇది ఒప్పు, అది తప్పు. నేను వాళ్లలా ఉండదలుచుకోలేదు. అందుకే సంగీతాన్ని మాట్లాడనిస్తాను.

– హరూకీ మురకామి, రచయిత

మళ్లీ మూసుకోవాలా?



నిష్ఫలమని రుజువైనప్పటికీ మళ్లీ మాస్కులు పెట్టుకోవాలనే, చెడు చేసిందని తెలిసీ లాక్‌డౌన్లు విధించాలనే విధానాన్ని ఏమనాలి? జనాల సహకారం లేకుండా ఈ విధానాలు పనిచేయవు. సహాయ నిరాకరణ చేస్తే ఎలా ఉంటుంది?

– జోసెఫ్ ఎ.లడాపో, యూఎస్ ఆరోగ్య అధికారి

అన్ని టీచర్ పోస్టులూ భర్తీ చేయాలి

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో 5089 పోస్టులకే డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం, నిరుద్యోగులకు కంటితుడుపు చర్య మాత్రమే. 22 వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగ ఖాళీలు ఉండడం గమనార్హం.

నేడు ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు ఒకరిద్దరు ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నాయి. ఖాళీలన్నింటిని భర్తీ చేసినట్లయితే ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను పెంచవచ్చు. తద్వారా పాఠశాలల్లో నమోదు పెరుగుతుంది. కానీ, గత రెండు సంవత్సరాల నుండి ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో తంతు నిర్వహిస్తూ, విద్యార్థులున్న పాఠశాలలకు కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేకపోతున్నారు. తద్వారా చేరిన విద్యార్థులు కూడా తిరిగి ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళిపోతున్నారు.



భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలంలో గల బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలను ఆగస్టు 23న నేను సందర్శించాను. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఐదు తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులున్నారనీ, 70 పైగా ఉన్న విద్యార్థుల్లో 10 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళారనీ బాధతో చెప్పారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రాథమిక పాఠశాలల్లో మరింతగా పిల్లల నమోదు తగ్గి, స్కూళ్ల మూతపడే అవకాశముంది. నల్లగొండ జిల్లా, చిట్యాల మండలంలోని వట్టిమర్తి ప్రాథమిక పాఠశాలలో 150 పైగా విద్యార్థులున్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఐదుగురు ఉపాధ్యాయులుండాలి. కానీ, ముగ్గురే ఉపాధ్యాయులున్నారు. గత నాలుగేళ్ల నుంచి గ్రామస్థులే చందాలు వేసుకొని ముగ్గురు టీచర్లను నియమించుకుంటున్నారు. ఇలా పిల్లలున్న పాఠశాలలకు కూడా ఉపాధ్యాయులనిచ్చే పరిస్థితి లేకపోతే ఎలా?

ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఏడుగురు సబ్జెక్ట్ టీచర్లుండాలి. హిందీ, బయొలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్ట్ టీచర్ల కొరత చాలా ఎక్కువగా ఉన్నది. విద్యార్థులు తక్కువగా ఉన్న హైస్కూల్లో ఒక సబ్జెక్ట్ టీచర్ లేకున్నా ఏమీ కాదని అధికారులంటున్నారని తెలిసింది. సబ్జెక్ట్ ఎవరు బోధన చేస్తారు? హన్మకొండ జిల్లాలోని గంగదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గ్రామస్థులు అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నారు. ఒక్కొక్క తరగతిలో రెండు సెక్షన్స్ ఉన్నాయి. ఆరేళ్లయినా ఈ పాఠశాలకు సబ్జెక్ట్ టీచర్లను ఇవ్వలేదు. ఇంతకాలానికి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ... ఉన్న ఖాళీల్లో కోత విధిస్తే ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు న్యాయం జరిగేదెప్పుడు?

– అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ

గిడుగు సాక్షిగా మరొక భాషోద్యమం రావాలి

సందర్భం



పి. విజయబాబు

వ్యవహారిక భాష అనగానే మన మదిలో మెదిలేది గిడుగు వేంకట రామమూర్తి పంతులు. నాలుగు దశాబ్దాలకు పైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గ్రాంథిక వాదులతో అలుపెరగని పోరాటం చేశారు. వారు సలిపిన భాషోద్యమం అచ్చంగా అభ్యుదయ సమాజం కోసమే అని చెప్పాలి. నోటి మాటకు, చేతిరాతకు సంధానం కుదిరినప్పుడే భాష పోషకంగా ఉంటుందని భావించారు.

పండితులకే పరిమితమైన భాషను, కొద్ది మంది మాత్రమే చదువుకునే వెసులుబాటు ఉన్న విద్యను సామాన్య ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని ఆయన పరితపించారు. శిష్ట వ్యవహారిక భాషకు పట్టం కట్టినప్పుడే ఇది సాధ్యమవుతుందని ఆయన సంప్రదాయ భాషా వాదులపై సుదీర్ఘ పోరాటం చేశారు. అయితే సంప్రదాయ భాషా వాదులు ఆయన వాదనను బలంగా తిరస్కరించారు, అయినా గిడుగు వారు ఉద్యమించారు.

ప్రజల భావాలకు అనుగుణంగా భాష ఉండాలనీ, వాళ్ళ భావాలను అందరికీ అర్థమయ్యే రీతిలో రాయగలగాలనీ, అందుకే వాడుక భాష చాలా అవసరం అని గిడుగు వారు వాదించారు.

సంప్రదాయ సాహిత్య వాదులు, కవులు అయిన తిరుపతి వేంకట కవులు కూడా భాషలో మార్పుల్ని సమర్థించారు. ప్రారంభంలో కందుకూరి వారు సంప్రదాయ సాహిత్య పక్షాన నిలిచినా తదనంతరం గిడుగు వారి ఉద్యమ దీక్షలో సత్యాన్ని గ్రహించి ఆయన కూడా వ్యవహారిక భాషోద్యమానికి బాసటగా నిలిచారు. ఫలితంగా గిడుగు వారి ఉద్యమం మరింత బలపడింది.

గురజాడ, గిడుగు ఇద్దరూ అభ్యుదయవాదులు మాత్రమే కాదు, అద్భుతమైన భావజాలాలను కలబోసుకున్న మిత్రులు. విజయనగరంలో ఇద్దరూ కలిసే చదువుకున్నారు.

ఎంతో కష్టపడి సవరభాష నేర్చుకొని అదే భాషలో పుస్తకాలు రాసి, సొంతడబ్బుతో బడులు ఏర్పాటు చేసి, సవరలకు చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు గిడుగు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో 'రావు బహదూర్' బిరుదు ఇచ్చారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్నీ, 1936లో 'సవర–ఇంగ్లీషు కోశా'న్నీ తయారు చేశారు. ప్రభుత్వం ఆయనకు 'కైజర్–ఇ–హింద్' అనే స్వర్ణ పతకాన్ని ఇచ్చి గౌరవించింది.



గిడుగు రామమూర్తి పంతులు

1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాస పత్రిక నడిపారు. వ్యావహారిక భాషను ప్రతిఘటించిన 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' సభలో నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింపజేశారు గిడుగు. 'సాహితీ సమితి', 'నవ్య సాహిత్య పరిషత్తు' వంటి సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దుష్టంగా రాయలేడని నిరూపించారు. ఆ క్రమంలో విశ్వవిద్యాలయాలన్నీ వ్యవహారిక భాషకు పట్టం కట్టడం ప్రారంభించాయి. కాగా మరోవైపు గిడుగు వారి అనుంగు శిష్యుడైన తాపీ ధర్మారావు సంపాదకీయాలతో ప్రారంభమైన వ్యవహారిక భాష... పత్రికల్లోనూ క్రమంగా విస్తరిస్తూ వచ్చింది.

1863 ఆగస్టు 29న శ్రీకాకుళానికి ఇరవై మైళ్ళ దూరంలో ముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాల పేట గ్రామంలో జన్మించిన గిడుగు అలుపెరుగని వ్యవహారిక భాషోద్యమం చేస్తూ జనవరి 1940 జనవరి 22న కన్ను మూశారు.


భాషను పరిపుష్టం చేయడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు. భాషాభిమానులందరూ కూడా ఇందులో మమేకం కావాలి. తెలుగువారు తెలుగుతో పాటుగా ఇంగ్లీషు వంటి అంతర్జాతీయ భాషలలో పట్టు సాధించగలిగితే మన సాహిత్య అనువాదాలు ప్రపంచవ్యాప్తమవుతాయి తెలుగు వారు ఉన్నత స్థితిలో నిలిచినప్పుడు మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను కూడా అదే స్థాయిలో నిలబెట్ట గలుగుతారన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆలోచన. అందుకే మన కోసం, మన పాలనావసరాల కోసం, 'మన సంస్కృతి–సంప్రదాయాల కోసం, తెలుగు భాష... భవిష్యత్తు అవసరాల కోసం ఇంగ్లీష్ భాష' అనే లక్ష్యంతో సాగుతున్నారు. ఈ నేపథ్యంలో భాషావాదులు కువిమర్శలు పట్టించుకోకుండా వాస్తవాలను గ్రహించగలిగితే, తెలుగు భాష అజంతం, అజరామరం అనేదానికి సార్థకత ఉంటుంది. ప్రపంచ పటంలో తెలుగు కీర్తి రెపరెపలాడుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు

(నేడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి)

భిక్ష–ధర్మోపదేశం

త్రిపిటకాల్లో... వాటి వ్యాఖ్యానప్రాయాలైన 'అట్ట కథ'ల్లో బుద్ధుడి దిన చర్య గురించిన వివరాలు మనకు లభిస్తాయి. ఈ సాహిత్యం ప్రకారం: బుద్ధుడు ఉదయం పూట కాలకృత్యాలు తీర్చుకొని, భిక్షాటనం చేసే సమయం దాకా ఒక్కడే ఏకాంత ప్రదేశంలో కూర్చొని ఉండేవాడు. భిక్షకు ఒక్కోసారి ఒక్కడే, కొన్నిసార్లు భిక్షువులతో కలిసి వెళ్ళేవాడు. ఊరిలోకి వచ్చాక, గృహస్థులు బుద్ధ భగవానుణ్ణి భోజనానికి రమ్మని కోరేవారు. వెంట, ఇంత సంఖ్యలో భిక్షువులు రావాలని కూడా చెప్పేవారు. అతడి చేతిలోని పాత్ర తీసుకొని, తమ ఇంటికి తీసుకుపోయేవారు. ఉచితాసనం పైన కూర్చుండ బెట్టి భోజనం వడ్డించేవారు. భోజనం తర్వాత బుద్ధుడు



చేతులు, ముఖము కడుక్కొని, పుణ్యానుమోదనం చేసి, గృహస్థునికి సమయానుకూలంగా ధర్మోపదేశం చేసేవాడు. తర్వాత భిక్షు సంఘంతో పాటు విహారానికి తిరిగి వచ్చేవాడు. అప్పుడప్పుడు ఇంటింటా కొంతకొంత మధుకరం తీసుకొని ఏకాంతంలో కూర్చొని భోంచేసేవాడు. అప్పుడప్పుడు భిక్షకు వెళ్ళేవాడు కాదు. భిక్షువులు తెచ్చిన దానినే తీసుకొనేవాడు. ఇది చాలా తక్కువసార్లు జరిగేది. భోజనం అయ్యాక ఆరుబయట కూర్చొనేవాడు. ఆయన రోజులో ఒకసారే మధ్యాహ్నం కంటే ముందే భోజనం చేసేవాడు. అటు తర్వాత కుటీరంలో కొంచెంసేపు శయ్య మీద కుడివైపు తిరిగి పడుకొని శరీరానికి విశ్రాంతి ఇచ్చేవాడు. సాయంకాలం అయ్యేసరికి, చుట్టుపక్కల జనులు పుష్పాలు వంటివి పట్టుకొని బుద్ధునికి నమస్కరించటానికి వచ్చేవారు. భగవానుడు వారికి సమయానుకూలంగా ధర్మోపదేశం చేసేవాడు. దీంతో పగటి కార్యకలాపాలు ముగిసేవి.

బుద్ధుడి రాత్రి చర్య మూడు భాగాలుగా విభజింపబడి ఉండేది. సాయంకాలం ధర్మోపదేశం తర్వాత, అతడు స్నానం చేసి కాసేపు ఒక్కడే మౌనంగా కూర్చొనేవాడు. తర్వాత భిక్షువులు వచ్చి చుట్టూ కూర్చొనేవారు. కొందరు వేసే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవాడు. కొందరికి సాధన గురించి చెప్పి ప్రోత్సహించేవాడు. ఈ విధంగా రాత్రి మొదటి భాగం గడిచిపోయేది. తరువాత రెండవ భాగంలో దేవ, బ్రహ్మ లోకాల్లోని దేవతా బ్రహ్మలు, శుక్రుడు వస్తే వారితో ధర్మ చర్చ చేసేవాడు. రాత్రి చివరి మూడవ భాగం, మళ్ళీ మూడు భాగాలుగా ఉండేది. మొదటి భాగంలో శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి ఆరుబయట అటూఇటూ తిరిగేవాడు. రెండవ భాగంలో కుటీరంలోకి వెళ్ళి, కుడిపక్క పడకమీంచి లేచి, ఆసనంపై కూర్చొని లోకాన్ని కరుణాపూర్ణ దృష్టితో చూసేవాడు. ఈరోజు ధర్మ శిక్షణ ఏ పుణ్య వ్యక్తికి దొరకాలి అని విచారించి, అతనిపై కరుణా దృష్టి కురిపించేవాడు. సూర్యోదయం సమయానికి రాత్రి మూడవ భాగం పూర్తయేది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: శు.త్రయోదశి ప.12.53 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: శ్రవణం రా.11.42 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: రా.3.24 నుండి 4.54 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.53 నుండి 11.37 వరకు, అమృతఘడియలు: ప.1.58 నుండి 3.27 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.15.

క్లుప్తంగా...

బస్సు నడిపిన పువ్వాడ..


బస్సు డ్రైవర్ సీట్లో మంత్రి పువ్వాడ

ఇల్లెందు: రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కాసేపు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా మారారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్ డిపోను మంత్రి ప్రారంభించారు. అనంతరం డ్రైవర్ సీట్లో కూర్చుని బస్సును కాసేపు నడిపారు. అంతకుముందు జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం ఖమ్మం సభలో రైతుల గురించి మాట్లాడారని, ఆయనకు ఆ అర్హత లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల రైతులు దేశ రాజధానిలో ఎన్నో రోజులు ఆందోళన చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, అలాంటి వారు రైతుల గురించి మాట్లాడడమా? అని ప్రశ్నించారు. ఆ ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

డెంగీతో స్టాఫ్ నర్సు మృతి


రజని

ఏటూరు నాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో పని చేస్తున్న స్టాఫ్ నర్సు సాధనపెల్లి రజని(32) మూడు రోజులుగా డెంగీతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. వాజేడు మండలానికి చెందిన రజని ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో..రక్త పరీక్షలు చేయించగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. అప్పటికే ఆమె పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయిందని భర్త తాజ్ చెప్పారు. రజని మృతితో ఏటూరునాగారం ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, వైద్యులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కేసీఆర్, కేటీఆర్ నామినేషన్లకు పింఛనర్ల విరాళం

- రూ.లక్ష సేకరించి సర్పంచ్‌కు అందజేత


జమ చేసిన విరాళం చూపుతున్న పింఛనర్లు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కె) గ్రామం మరోసారి తన ప్రత్యేకత చాటుకుంది. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు చెల్లించాల్సిన నామినేషన్ రుసుము కోసం.. తమ వంతు వాటాగా గ్రామంలో వంద మంది ఆసరా పింఛనర్లు తలా రూ.వెయ్యి చొప్పున రూ.లక్ష విరాళం సేకరించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్‌కు సోమవారం అందజేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఈ మొత్తాన్ని త్వరలోనే హైదరాబాద్‌కు వెళ్లి అందజేయనున్నట్లు సర్పంచ్ మీనాక్షి వెల్లడించారు.

మంత్రి నుంచి ప్రాణహాని

- హెచ్ఆర్సీకి బీఆర్ఎస్ కౌన్సిలర్ ఫిర్యాదు

నాంపల్లి (హైదరాబాద్): మంత్రి జగదీశ్‌రెడ్డి నుండి తనకు ప్రాణ హాని ఉందంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్ వట్టే రేణుక సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ)లో ఫిర్యాదు చేశారు. సూర్యాపేట జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్, తన భర్త వట్టే జానయ్యపై మంత్రి అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. బలహీన వర్గాలకు చెందిన తమకు జిల్లాలో ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరినందుకు.. ఒక్క రోజులోనే తమపై పోలీసులతో 71 కేసులు బనాయించి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తన భర్త ఆచూకీ కూడా తెలియడం లేదని వెల్లడించారు. మంత్రి నుంచి ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'ఐఈఆర్పీ'లను రెగ్యులర్ చేయాలి: టీఎస్‌యూటీఎఫ్

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల కోసం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 763 మంది ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీ)ను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి సోమవారం ముఖ్యమంత్రికి ఓ లేఖ రాశారు. గత 19 ఏళ్లుగా ఐఈఆర్పీలు పనిచేస్తున్నారని, వారికి న్యాయం చేయాలని లేఖలో కోరారు.

1న 'జాక్టో' నిరసనలు

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీన ప్రతీ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) నిర్ణయించింది. కమిటీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి జాక్టో చైర్మన్ జి.సదానందం గౌడ్, సెక్రటరీ జనరల్ మట్టపల్లి రాధాకృష్ణ, ట్రెజరర్ కె.కృష్ణుడు హాజరయ్యారు.

భద్రగిరిలో ఘనంగా పవిత్రోత్సవాలు


గోదావరి నదీమతల్లికి హారతి ఇస్తున్న రామాలయ అర్చకులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. సోమవారం 'పవిత్రారోపణం' కార్యక్రమాన్ని నేత్రపర్వంగా జరిపించారు. తొలుత స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర ధారతో ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించారు. గతేడాది కాలంలో రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో జరిగిన దోష నివారణకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు వివరించారు. అనంతరం భక్తులు సమర్పించిన రామకోటి పుస్తకాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు గోదారమ్మకు నదీ హారతి సమర్పించారు.

యాదాద్రిలో పవిత్రోత్సవాలు పరిసమాప్తం


ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 3 రోజులుగా నిర్వహిస్తోన్న పవిత్రోత్సవాలు సోమవారం మహాపూర్ణాహుతి, పవిత్రమాలధారణ పర్వాలతో వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఆలయ ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, వేద పండితులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వయంభూలకు పవిత్రమాల ధారణతో ఉత్సవాలు ముగిశాయి.

నేటి నుంచి నిత్య కల్యాణం, హోమం: పవిత్రోత్సవాల్లో భాగంగా యాదాద్రి, పూర్వగిరి ఆలయాల్లో రద్దు చేసిన నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం పూజలను మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు.

'పామ్' తోటల ఖమ్మం



సాక్షిప్రతినిధి, ఖమ్మం

రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆయిల్ పామ్ సాగుకు చిరునామాగా మారుతోంది. గత పదిహేనేళ్లుగా పామ్ తోటలు సాగుచేసే రైతులు నెమ్మదిగా పెరుగుతున్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా పామాయిల్‌కు డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం కూడా రైతులకు రాయితీలు కల్పిస్తూ ఈ పంట సాగును ప్రోత్సహిస్తోంది. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మంలో 17,834 ఎకరాల్లో రైతులు పామాయిల్ సాగు చేయగా.. ప్రస్తుతం అది 73,938 ఎకరాలకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఈ పంట సాగు ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో సాగుకు అనుకూలమైన వాతావరణం, నేలలు ఉండటంతో ఒక వైపు పంట సాగు విస్తరిస్తుండగా, పామాయిల్‌ను ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలు కూడా ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటల్లో టీఎస్ ఆయిల్‌ఫెడ్ కంపెనీ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసింది. అలాగే కొత్తగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మరో ఐదు వరకు ఫ్యాక్టరీలు రానున్నాయి.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏటా పెరుగుతున్న పామాయిల్ సాగు • రాయితీలతో రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

ఇప్పటికే ఉన్న ఫ్యాక్టరీలకు తోడు మరిన్ని కంపెనీల ఆసక్తి • దేశీయ అవసరాలకు అనుగుణంగా సాగు పెంపుపై దృష్టి

సాగు విస్తీర్ణం పెంపుపై ప్రభుత్వాల దృష్టి..



గ్లోబల్ ఈడిబుల్ ఆయిల్ మార్కెట్‌లో వ్యాపారం సాగే తొమ్మిది ప్రధాన నూనెల్లో పామాయిల్ ఒకటి. కాగా, ప్రపంచ మార్కెట్‌లో ఇండోనేసియా, మలేసియా మాత్రమే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రపంచ ముడి పామ్ ఆయిల్ ఉత్పత్తిలో ఈ రెండు దేశాల నుంచి 90 శాతం వరకు వాటా ఉంది. ప్రపంచ దేశాలతోపాటు మన దేశంలోనూ పామాయిల్‌కు డిమాండ్ పెరగడంతో ఇక్కడ కూడా సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ప్రస్తుతం తెలంగాణలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో ఈ పంట సాగవుతోంది. 2020 వరకు తెలంగాణలో టీఎస్ ఆయిల్‌ఫెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్, రుచిసోయా ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనే మూడు కంపెనీలు ఉండగా, ప్రస్తుతం వీటితోపాటు మరిన్ని కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఎస్ ఆయిల్‌ఫెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ కంపెనీల ద్వారా ఫ్యాక్టరీ జోన్లలో నర్సరీలు కూడా ఏర్పాటయ్యాయి.

పామాయిల్ దీర్ఘకాల పంట కావడంతో దేశీయంగా నూనె లభ్యతను పెంపొందించే ప్రక్రియలో ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇందుకోసం ప్రభుత్వాలు సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాయి. 2000 సంవత్సరంలో ఈ పంట 17,834 ఎకరాల్లో

ప్రాసెసింగ్ ప్లాంట్లకు ప్రాధాన్యం..

సాగవగా, 2020 నాటికి 42,899 ఎకరాలకు, ప్రస్తుతం 73,938 ఎకరాలకు చేరుకుంది. సాగు విస్తీర్ణం పెరగడంతో ప్రభుత్వం ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చింది. డిమాండ్ పెరగడంతో ధర కూడా పెరుగుతూ వచ్చింది. 2010లో టన్ను గెలల ధర రూ.సగటున రూ.5,136 ఉండగా 2022 నాటికి రూ.18,069కి చేరింది

2005లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా అశ్వారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభమైంది. తొలుత 5 టన్నుల సామర్థ్యంతో ప్రారంభించగా, పలు దఫాలుగా సామర్థ్యం పెరుగుతూ, ప్రస్తుతం 60 టన్నులకు చేరింది. ఇక్కడ పామాయిల్ గెలలను 120 నుంచి 160 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు స్టీమ్ చేస్తారు. ఆ తర్వాత యంత్రాలతో గెలల నుంచి ముడి నూనెను తీసి, నేరుగా పైపులైన్‌ల ద్వారా పెద్ద ట్యాంకుల్లోకి పంపి నిల్వ ఉంచుతారు. ఇలా నిల్వ చేసిన క్రూడాయిల్‌ను లారీ ట్యాంకర్లలో ప్రాసెస్ యూనిట్లకు తరలిస్తారు. స్టీమ్ చేసిన

మొదట్లో రెండు ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి..

తర్వాత వచ్చే వ్యర్థాలను, నూనె గింజలను (నెట్) వేరు చేస్తారు. గెలల వ్యర్థాలను టన్నుల లెక్కన ఇతర అనుబంధ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారు. అశ్వారావుపేట తర్వాత దమ్మపేట మండలం అప్పారావుపేటలో 2017 ఏప్రిల్‌లో మరో ఫ్యాక్టరీ ప్రారంభమైంది. రూ.80 కోట్ల వ్యయం, మలేసియా టెక్నాలజీతో అత్యాధునిక పరికరాలను ఉపయోగించి దీనిని నిర్మించారు. తొలుత ఇది 60 టన్నుల సామర్థ్యంతో ప్రారంభం కాగా.. ప్రస్తుతం 90 టన్నులకు పెరిగింది. ఈ ఫ్యాక్టరీకి 2018లో రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ రంగ విభాగంలో ఉత్తమ ఫ్యాక్టరీ అవార్డు దక్కింది. అదే ఏడాది కేంద్రం ద్వారా గ్లోబల్ అవార్డు వచ్చింది.

కొత్త ఫ్యాక్టరీల నిర్మాణం..

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 3 ఫ్యాక్టరీలు ఉండగా.. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరిగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, అశ్వాపురం మండలం బి.జి.కొత్తూరు, ములకలపల్లి గ్రామాల్లో నూతనంగా ఫ్యాక్టరీలు ఏర్పాటు కానున్నాయి. వీటి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో పామాయిల్ తోటల సాగు మరింతగా విస్తరించి దేశీయంగా నెలకొన్న కొరతను తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

2000 - 2023 సంవత్సరాల మధ్య సాగు విస్తీర్ణం ఇలా (ఎకరాల్లో)	జిల్లా	2000	2005	2015	2020	2023
	ఖమ్మం	3,216	4,152	5,547	7,185	18,637
	భద్రాద్రి	14,618	18,144	25,226	35,714	35,301
	మొత్తం	17,834	22,296	30,773	42,899	73,938



ఈయనే సాగు మొదలు పెట్టింది..



1991లో ప్రభుత్వ సబ్సిడీ ఏమీ లేకుండా.. అశ్వారావుపేటకు చెందిన పిన్నమనేని మురళి అనే రైతు ఆయిల్ పామ్ పంట సాగును ప్రయోగాత్మకంగా మొదట ఐదు ఎకరాల్లో ప్రారంభించారు. మొదట్లో ఆయన మొక్క రూ.25 చొప్పున కొనుగోలు చేశారు. సమీపంలో గెలల కొనుగోలు, ఫ్యాక్టరీ లేనప్పటికీ.. ఆయన ఈ పంట సాగు చేయడంతో మిగిలిన రైతులు కూడా ఆకర్షితులయ్యారు. ప్రస్తుతం మురళి 100 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండటం, ఫ్యాక్టరీలు అందుబాటులో ఉండటంతో ఈ పంట ఆదాయం మెరుగ్గా మారిందని మురళి చెప్పారు.

లాభదాయకమైన పంట..



పామాయిల్ సాగు ద్వారా రైతులకు ఏటా లక్షల్లో ఆదాయం వస్తుంది. పంట సాగు చేసిన నాలుగేళ్లలో ఆదాయం ప్రారంభమవుతుంది. సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను ఇస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పామాయిల్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఫ్యాక్టరీలు సైతం రైతులకు అందుబాటులోకి వస్తున్నాయి.

-జినుగు మరియన్న, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

ఎకరం ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ..

మొక్కలకు (ఎకరానికి 57 మొక్కలు): రూ.11,600	బిందు సేద్యం: రూ. 22,518
ఎరువులు, అంతర పంటలకు ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లు: రూ.16,800	మొత్తం రూ. 50,918

మహబూబాబాద్ ఎస్పీ ఆకస్మిక బదిలీ

అత్త రేఖా నాయక్ ఎఫెక్ట్‌తోనే బదిలీ అయ్యారని సోషల్ మీడియాలో చర్చ


శరత్‌చంద్ర పవార్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బదిలీ అయ్యారు. ఆయనను తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎస్పీగా పనిచేస్తున్న చంద్రమోహన్ గుండేటిని నియమిస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆకస్మికంగా జరిగిన ఎస్పీ బదిలీపై సోషల్ మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ నాయకులు ఏరికోరి తెచ్చుకున్న ఎస్పీ ఎన్నికల వరకు ఉంటారని అందరూ భావించగా.. ఊహించని విధంగా బదిలీ కావడానికి 'రేఖా నాయక్ ఎఫెక్ట్'ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ ఎస్పీకి స్వయాన బిడ్డను ఇచ్చిన అత్తగారు. ఈసారి ఆమెకు టికెట్ రాకపోగా, ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. రేఖా నాయక్‌పై కోపంతో ఆమె అల్లుడిని ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

టీటీడీపీ అభ్యర్థుల ఎంపికకు ఏడుగురు సభ్యుల కమిటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే టీటీడీపీ అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఏడుగురు సభ్యుల కమిటీని నియమించారు. పోటీకి ఆసక్తి చూపే వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను ఈ కమిటీ చూస్తుంది. అనంతరం నియోజకవర్గాల వారీగా స్క్రూటినీ అనంతరం మిగిలిన వారి వివరాలతో పార్టీ అధినేత చంద్రబాబుకు ఈ కమిటీ నివేదిక సమర్పిస్తుంది. ఈ నివేదిక ఆధారంగానే పార్టీ హైకమాండ్ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఈ కమిటీలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, కంభంపాటి రాంమోహన్ రావు, అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నర్సింహులు, నర్సిరెడ్డి, కాశీనాథ్ ఉంటారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన కార్యక్రమాలను చేప ట్టాలని టీటీడీపీ నాయకత్వం నిర్ణయించింది. ఈ అంశంపై సోమవా రం టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బీఆర్ఎస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన తీరు పై పార్టీ శ్రేణులు ఆందోళనలు నిర్వహించి తహసీల్దార్, కలెక్టర్లకు విన తిపత్రాలు సమర్పించాలని ఆదేశించారు.

'రాష్ట్రం అప్పులు, అవినీతిలో కూరుకుపోయింది'

పంజగుట్ట (హైదరాబాద్): సీఎం కేసీఆర్ గిరిజన ద్రోహి అని, ఆ పార్టీలో ఉన్న ఒక్క మహిళా ఎమ్మెల్యే, మహిళా మంత్రి పార్టీని వీడి బయటకు రావాలని జాతీయ వడ్డెర, గిరిజన, సంచార జాతుల సంఘం ముఖ్య సలహాదారులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పులు, అవినీతిలో కూరుకుపోయిందని, ప్రశ్నించిన వారి గొంతు నొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు అన్యాయం జరుగుతుందని ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే అధికార పార్టీ నాయకుల సూచనలతో బాధితులపైనే కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్‌కు కూడా ప్రోటోకాల్ పాటించడంలేదని, రెండేళ్లుగా తిప్పలు పెడుతున్నారని రవీంద్రనాయక్ విరుచుకుపడ్డారు. ఎల్బీ నగర్‌లో జరిగిన గిరిజన మహిళపై దాడి, చిత్రహింసలకు గురిచేసిన పోలీస్ అధికారులు, డీసీపీని సర్వీస్ నుంచి తొలగించాలని, గిరిజన మహిళపై జరిగిన దాడి ఘటనపై రాష్ట్రపతి, కేంద్ర హోంమంత్రి, జాతీయ మానవహక్కుల కమిషన్, మహిళా కమిషన్, కేంద్ర సామాజిక, న్యాయ సాధికారత శాఖమంత్రి తదితరులకు వినతిపత్రాలు ఇచ్చానని తెలిపారు.

31 నుంచి గ్రాండ్ నర్సరీ మేళా

నర్సరీ మేళా బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 5 వరకు నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో గ్రాండ్ నర్సరీ మేళా ఉంటుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు తెలిపారు. 14వ నర్సరీ మేళా బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ నర్సరీ మేళా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ షోలో హార్టికల్చర్ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయల తోటలు, ఎరువులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, అగ్రికల్చర్ ఎనర్జీ సేవింగ్ టెక్నాలజీ అగ్రికల్చర్ సైన్స్, ఎడ్యుకేషన్, ఫుడ్ ఇండస్ట్రీ ఉత్పత్తులు ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్, కోల్‌కతా, ఢిల్లీ, హరియణా, గుజరాత్, మహారాష్ట్రలోని ముంబై, పూణే, షిర్డీ, కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూరు, ఆంధ్రప్రదేశ్‌లోని కడియం ఇతర ప్రాంతాలతో పాటు రాష్ట్రం నుంచి వచ్చిన మొక్కలు ప్రదర్శిస్తారని వివరించారు. అలాగే దేశ వ్యాప్తంగా 150కు పైగా నర్సరీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ మాట్లాడుతూ సౌదీ అరేబియా నుంచి వచ్చిన టిష్యూ కల్చర్ వెరైటీ డేట్ పామ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఠాణాలో యువకుడి మృతి

- పోలీసులే కొట్టి చంపారంటూ మృతుడి కుటుంబసభ్యుల ఆరోపణ


సీసీ పుటేజీలో పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న చోటే పడిపోయినట్టు కనిపిస్తున్న అంజి
అంజి(ఫైల్)

బెల్లంపల్లి: పోలీస్‌స్టేషన్‌లోనే ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన కీర్తి లక్ష్మీనర్సయ్య ఇంటిపై అతడి అన్నకొడుకు కీర్తి అంజి(24) మద్యంమత్తులో ఆదివారం ఉదయం దాడి చేశాడు. విచక్షణ కోల్పోయి తిడుతూ..చితకబాదడంతో లక్ష్మీనర్సయ్య తలకు గాయాలయ్యాయి. పైగా చంపేస్తానని అంజి హెచ్చరించాడు. భయపడిన లక్ష్మీనర్సయ్య 100కు డయల్ చేశాడు. బెల్లంపల్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఘటనాస్థలికి వెళ్లి అంజిని ఠాణాకు తీసుకెళ్లి విచారణ చేశారు. సాయంత్రం అంజిని ఇంటికి తీసుకెళ్లాలని పోలీసులు అతడి సోదరుడికి ఫోన్ చేయగా, తాను మంచిర్యాలలో ఉన్నానని, బెల్లంపల్లికి రాగానే ఠాణాకు వచ్చి తీసుకెళ్తానని చెప్పాడు.

రాత్రి 8.30 గంటల ప్రాంతంలో..

రాత్రి 8.30గంటల ప్రాంతంలో అంజికి ఫిట్స్ వచ్చినట్టు తెలిసింది. సీసీ పుటేజీ పరిశీలిస్తే అంజి పోలీస్‌స్టేషన్‌లోని వరండాలోని కుర్చీలో కూర్చుని పక్కకు ఒరిగిన దృశ్యం కనిపించింది. ఇది గమనించిన కానిస్టేబుల్ పక్క గదిలోకి వెళ్లి నీళ్లు తీసుకురాగా, మరో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో కలిసి నీరు తాగించడానికి ప్రయత్నించగా, స్పందించని దృశ్యాలు కనిపించాయి. ఆ తర్వాత ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుడు పరీక్షించి అంజి మృతిచెందినట్టు ధ్రువీకరించారు.

మృతదేహాన్ని పరిశీలించిన న్యాయమూర్తి

పోలీసులే కొట్టి చంపారని మృతుడి సోదరులు, కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్యలు సంఘటనపై సమీక్షించారు. పోలీసుల సమాచారం మేరకు మంచిర్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కల్లం సోమవారం మార్చురీకి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. అంజి మరణానికి పోలీసులే కారణమని అతడి కుటుంబీకులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఒంటిపై గాయాలున్నాయని, పోలీసు దెబ్బలకు తాళలేక చనిపోయాడని అంజి బావ బుర్ర లక్ష్మణ్ సెల్‌ఫోన్‌లో సీసీ పుటేజీ దృశ్యాలను చూపించే ప్రయత్నం చేశాడు. తన బావమరిదిని పోలీసులే చంపారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మృతుడి శరీరంపై గాయాలను పరిశీలించి న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు వేడుకున్నారు. అంజి చనిపోయిన తర్వాత పోలీసులు సమాచారం ఇచ్చారని, అతడి సోదరులు కీర్తి వీరేశం, లక్ష్మణ్, పెద్దనాన్న కొడుకు కీర్తి వీరేందర్, చిన్నమ్మ అంజమ్మ పోలీసులపై మండిపడ్డారు. అంజికి అనారోగ్య సమస్యలు లేవని కుటుంబీకులు స్పష్టం చేశారు. కాగా, న్యాయమూర్తి సూచనల మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించగా, అంత్యక్రియలు నిర్వహించారు.

కుమార్తె మృతిని తట్టుకోలేక.. రైలు కిందపడి తండ్రి ఆత్మహత్య


ఆరాధ్య


కిషోర్‌కుమార్

ఖైరతాబాద్: కన్న కూతురు అనారోగ్యంతో మృతిచెందడంతో తట్టుకోలేక అదే రోజు రాత్రి తండ్రి ట్రైన్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఖైరతాబాద్‌లో జరిగింది. ప్రైవేటు ఉద్యోగి కిషోర్‌కుమార్(40)భార్య ప్రియాంకతో కలిసి ఖైరతాబాద్‌లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఆరాధ్య(4)కు ఒంట్లో నలతగా ఉండటంతో ఆదివారం హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. లంగ్స్‌లో నీరుచేరి పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో సాయంత్రం 3గంటల ప్రాంతంలో మృతిచెందింది. ఆ బాధతో తండ్రి కిషోర్‌కుమార్ అదేరోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో ఖైరతాబాద్ రైల్వేగేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గంటల వ్యవధిలో కన్న కూతురు, కట్టుకున్న భర్త మృతిచెందడంతో ప్రియాంక కన్నీరు మున్నీరైంది.

దానం సాయం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ మృతుల కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ఆ కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించడంతో పాటు చిన్న పాప పేరుమీద లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

క్లుప్తంగా...

జపాన్ చందమామ ల్యాండర్ ప్రయోగం వాయిదా

టోక్యో: చందమామపై తొలిసారిగా అడుగుపెట్టాలన్న జపాన్ లక్ష్యం చివరి నిమిషంలో సాకారం కాలేదు. జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ను సురక్షితంగా దించి, పరిశోధనలు చేయడమే లక్ష్యంగా జపాన్ చేపట్టిన మూన్ ల్యాండర్ రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. జాక్సా టానేగాషిమా స్పేస్ సెంటర్‌లోని యోషినోబు లాంచ్ కాంప్లెక్స్ నుంచి సోమవారం ఉదయం 9.26 గంటలకు హెచ్2-ఏ రాకెట్‌ను ప్రయోగించాల్సి ఉన్నది. ప్రతికూల వాతావరణం కారణంగా లాంచింగ్‌కు 27 నిమిషాల ముందు ఈ ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు జపాన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'జాక్సా' తెలియజేసింది. ప్రయోగ కేంద్రం వద్ద తీవ్రస్థాయిలో బలమైన గాలులు వీచడం, ఉపరితల వాతావరణంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం వల్లే వాయిదా పడినట్లు తెలుస్తోంది. తదుపరి ప్రయోగ తేదీని ఇంకా ఖరారు చేయలేదు. సెప్టెంబర్ 15వ తేదీ తర్వాత తదుపరి ప్రయోగం ఉండొచ్చని సమాచారం. చంద్రుడిపై పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా), యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ సహకారంతో సాఫ్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్(స్లిమ్) అనే లూనార్ ప్రోబ్‌ను జపాన్ అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రుడిపై ల్యాండర్‌ను క్షేమంగా దించిన ఐదో దేశంగా జపాన్ రికార్డు సృష్టిస్తుంది. అయితే ప్రయోగించిన 4 నెలల తర్వాత ఈ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి కక్ష్యలోకి చేరనుంది. ఇదిలా ఉండగా, హెచ్-2ఏ రాకెట్ ద్వారా ఇప్పటిదాకా 46 ప్రయోగాలు చేయగా, అందులో 45 ప్రయోగాలు విజయవంతమయ్యాయి.


జీ20 సదస్సుకు హాజరు కాలేకపోతున్నా



న్యూఢిల్లీ: భారత్‌లో వచ్చే నెలలో జరిగే జీ20 కీలక సదస్సుకు తాను హాజరు కాలేకపోతున్నానని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్, రష్యా ద్వైపాక్షిక సహకారం, ఇతర ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన 'బ్రిక్స్' సదస్సు ప్రస్తావనకు వచ్చింది. సెప్టెంబర్ 9, 10న జరిగే జీ20 సదస్సుకు హాజరయ్యే విషయంలో తన అశక్తతను పుతిన్ తెలియజేశారు. ఈ సదస్సుకు రష్యా తరఫున తమ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హాజరవుతారని పేర్కొన్నారు. జీ20కి సారథ్యంలో భాగంగా భారత్ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నందుకు గాను పుతిన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. బ్రిక్స్ సదస్సుకు కూడా పుతిన్ హాజరు కాలేదు.

అయ్యో పాపం నెప్ట్యూన్... మేఘాలన్నీ మటుమాయం

2002 నుంచి 2023 వరకు మేఘాలు మాయమైన తీరు



అవున్నిజమే! నెప్ట్యూన్ మీది మేఘాలన్నీ ఎవరో మంత్రం వేసినట్టు ఉన్నట్టుండి మటుమాయం అయిపోయాయి. ఈ వింతేమిటి? అందుకు కారణమేమిటి...?

నెప్ట్యూన్ మీది మేఘాలన్నీ ఉన్నట్టుండి అమాంతంగా తుడిచిపెట్టుకుపోయాయి. సూర్యుని 11 ఏళ్ల ఆవర్తన చక్రం ప్రభావమే ఇందుకు కారణం కావచ్చని సైంటిస్టులు భావిస్తున్నారు. సాధారణంగా సూర్యుని చురుకుదనం అత్యంత ఎక్కువగా ఉన్నప్పుడు నెప్ట్యూన్ మీద మేఘాల పరిమాణమూ చాలా ఎక్కువగా ఉంటుంది. అతి తక్కువగా ఉన్నప్పుడు అవి దాదాపుగా లుప్తమైపోతాయి. ఇది సాధారణ దృగ్విషయమే. అయితే గత కొన్నేళ్లుగా ఆ గ్రహం మీద మేఘాలన్నవే లేకుండా పోవడం ఆశ్చర్యంగా ఉందని వారు చెబుతున్నారు.

ఏమిటి కారణం?

- సూర్యరశ్మి నెప్ట్యూన్ వాతావరణపు పై పొరను తాకినప్పుడు అక్కడ మేఘాల సంఖ్యలో హెచ్చుతగ్గుల క్రమం వేగం పుంజుకుంటూ ఉంటుంది.
- సౌర శక్తి వల్ల అక్కడ మీథేన్ మేఘాలు ఏర్పడటంతో పాటు పలు రసాయనాలు కూడా పుడతాయి.
- 11 ఏళ్ల సౌర ఆవర్తన క్రమమే ఇందుకు కారణం కావచ్చన్నది సైంటిస్టుల అంచనా.
- కానీ సౌర కుటుంబంలో సూర్యునికి సుదూరంగా ఉండే గ్రహాల్లో నెప్ట్యూన్ ఒకటి. దానికంటే దూరంగా ఉండేది ప్లూటో మాత్రమే!
- దాంతో నెప్ట్యూన్‌కు అందే సూర్యరశ్మి భూమికి అందే దానిలో ఒక్కటంటే ఒక్క వంతు మాత్రమే!
- నెప్ట్యూన్ నుంచి చూస్తే సూర్యుడు మిలమిల మెరిసే ఒక చిన్న నక్షత్రంలా కనిపిస్తాడు తప్ప మనకు కనిపించేంత భారీ పరిమాణంలో కాదు.
- అలాంటప్పుడు నెప్ట్యూన్ మీద మేఘాలు సమూలంగా మాయం కావడానికి సౌర ఆవర్తన చక్రమే ఏకైక కారణమా, ఇంకా వేరే ఏమన్నా ఉన్నాయా అన్నది తెలుసుకునే ప్రయత్నంలో నాసా సైంటిస్టులు ఇప్పుడు బిజీగా ఉన్నారు.

\- నేషనల్ డెస్క్, సాక్షి

వేడెక్కాల్సింది పోయి... చల్లబడుతోంది

నెప్ట్యూన్ దక్షిణార్ధ భాగం గత 15 ఏళ్లుగా క్రమంగా చల్లబడుతోందట. అందులో ఆశ్చర్యం ఏముందంటారా? ఉంది...

- ఎందుకంటే... ఈ సమయంలో ఆ ప్రాంతం నిజానికి క్రమంగా వేడెక్కాలి.
- 2003 నుంచి అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఆ బుల్లి గ్రహం మీద వేసవి నానాటికీ తగ్గిపోతూ వస్తోంది.
- హబుల్‌తో పాటు ప్రపంచంలోని పలు అతిపెద్ద టెలిస్కోప్‌లు అందించిన డేటాను విశ్లేషించిన మీదట ఈ ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది.
- అదే సమయంలో నెప్ట్యూన్ దక్షిణ ధ్రువం మాత్రం ఉష్ణోగ్రతలు 2018-2020 మధ్య కాలంలో ఏకంగా 11 డిగ్రీలు పెరిగిపోవడం విశేషం
- ఇది నిజంగా ఆశ్చర్యమే. ఎందుకంటే నెప్ట్యూన్ సూర్యుని చుట్టూ ఒక్కసారి తిరగడానికి మన లెక్కలో 165 ఏళ్లు పడుతుంది.
- గత 15 ఏళ్లలో అక్కడి ఉష్ణోగ్రత కనీసం 8 డిగ్రీ సెల్సియస్ మేరకు తగ్గిందట.
- అక్కడ ఒక్కో సీజన్ ఏకంగా 40 ఏళ్లుంటుంది.
- ఈ నేపథ్యంలో నెప్ట్యూన్ మీద ఇంతటి పరస్పరం విరుద్ధమైన వాతావరణ పరిస్థితులు చోటుచేసుకోవడం విచిత్రమేనని సైంటిస్టులు అంటున్నారు.



రోవర్ తప్పించుకున్న బిలం ఇదే..



దారిమళ్లిన రోవర్ గుర్తులు

రోవర్‌కు తప్పిన ప్రమాదం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడిపై పరిశోధనలకు పంపిన రోవర్‌కు చంద్రుడిపై పెద్ద ప్రమాదం తప్పింది. ల్యాండర్ నుంచి విడుదలైన రోవర్ చంద్రుడిపై తిరుగుతూ పలు రకాల పరిశోధనలు చేస్తూ భూనియంత్రిత కేంద్రాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంది. రోవర్ ప్రయాణిస్తున్న మార్గంలో సుమారు నాలుగు మీటర్లు వెడల్పయిన బిలాన్ని గుర్తించింది. అయితే, బిలాన్ని మూడుమీటర్ల దూరంలో ఉండగానే రోవర్ గుర్తించిందని ఇస్రో తెలిపింది. ప్రమాదవశాత్తూ ఆ బిలంలో పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని పేర్కొంది. ప్రత్యేక ఆదేశాలతో మరో దారిని రోవర్ ఎంచుకుందని వివరించింది. ప్రస్తుతం రోవర్ సురక్షితమైన మార్గంలో ముందుకు సాగుతోందని ఇస్రో సోమవారం ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొంది.

2న ఆదిత్య-ఎల్1 ప్రయోగం

ఏర్పాట్లు పూర్తి చేశామన్న ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్ ఘన విజయంతో భారత అంతరిక్ష అధ్యయన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమయింది. సౌర వాతావరణంపై అధ్యయనానికి ఉద్దేశించిన ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని శ్రీహరి కోట నుంచి పీఎస్ఎల్‌వీ సీ57 వాహక నౌక ద్వారా సెప్టెంబర్ రెండో తేదీన ఉదయం 11.50 గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో పూర్తి దేశీయంగా అభివృద్ధి పరిచిన ఈ శాటిలైట్‌ను రెండు వారాల క్రితమే శ్రీహరి కోటకు తరలించారు. సూర్యుడి వెలుపల పొరలు, ఫొటోస్పియర్ (కాంతి మండలం) క్రోమోస్పియర్ (వర్ణ మండలం), కరోనా వలయంలో పెరుగుతున్న వేడి వంటి వాటిపై ఆదిత్య-ఎల్1 అధ్యయనం జరుపుతుంది. సౌర వాతావరణంతోపాటు అంతరిక్ష వాతావరణం, భూ వాతావరణంపై దాని ప్రభావాన్ని ఇది అధ్యయనం చేస్తుందని ఇస్రో సోమవారం వెల్లడించింది.

నిరాటంకంగా పరిశోధనలు

భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో వున్న సూర్య వలయం లాంగ్రేజ్ పాయింట్-1 (ఎల్1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు. భూమి నుంచి లాంగ్రేజ్ పాయింట్‌కి చేరుకోవడానికి ఆదిత్య ఉపగ్రహానికి 175 రోజులు పడుతుంది. లాంగ్రేజ్ పాయింట్ల వద్ద ఉపగ్రహాలు తక్కువ ఇంధనాన్ని వినియోగించుకుని నిర్దేశిత కక్ష్యలో ఎక్కువ కాలం కొనసాగడంతోపాటు నిర్దేశిత లక్ష్యాలను అందుకునే అవకాశముంటుందని అంచనా. ఈ కక్ష్యలో ఉండే ఆదిత్య-ఎల్1కు గ్రహణాలు, ఇతర గ్రహాలు అడ్డురావు. పరిశోధనలను నిరాటంకంగా జరిపేందుకు వీలుగా ఉంటుందని ఇస్రో తెలిపింది.

స్వదేశీ పరిజ్ఞానంతో..

సుమారు 1,500 కేజీల బరువైన ఈ శాటిలైట్‌లో ఏడు పేలోడ్లు ఉన్నాయి. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్(ఐఐఏ) ఆధ్వర్యంలో విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్(వీఈఎల్‌సీ) పేలోడ్‌ను తయారు చేసింది. పుణేలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ శాస్త్రవేత్తలు సోలార్ అల్ట్రా వయోలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్(ఎస్‌యూఐటీ)ని తయారు చేశారు. సూర్యుడి ఉపరితలంపై 6వేల డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత మాత్రమే కాగా, కరోనా వద్ద 10 లక్షల డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండటానికి కారణాలపై వీఈఎస్‌సీ వివరాలు సేకరించనుందని ఇస్రో వివరించింది. యూవీ పేలోడ్‌ను, ఎక్స్‌రే పేలోడ్స్‌ను వినియోగించుకుంటూ కరోనాతోపాటు సోలార్ క్రోమోస్పియర్‌లపై ఆదిత్య-ఎల్1 పరిశీలనలు జరపనుంది. స్పెషల్ వాంటేజ్ పాయింట్ ఎల్1ను ఉపయోగించుకుని నాలుగు పేలోడ్లు సూర్యుడిపై ప్రత్యక్ష పరిశీలన జరుపుతాయి. మిగతా మూడు పేలోడ్లలో అమర్చిన పరికరాలు సూర్య కణాలపై పరిశోధనలు సాగిస్తాయి. కరోనాలో ఉండే మితిమీరిన ఉష్ణోగ్రతలు, కరోనల్ మాస్ ఇంజెక్షన్(సీఎంఈ), అంతరిక్ష వాతావరణం వంటి వాటిపైనా ఎస్‌యూఐటీ అత్యంత కీలకమైన సమాచారం పంపుతుందని ఆశిస్తున్నట్లు ఇస్రో పేర్కొంది.

వేగవంతమైన వృద్ధి బాటలో మన ఆర్థికం

- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- ఆటోమొబైల్, ఫార్మా, పర్యాటక రంగాల్లో కొత్త ఉద్యోగాలు
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- వివిధ రంగాల్లో 51,000 మందికి నియామక పత్రాలు



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి బాటలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. సోమవారం రోజ్‌గార్ మేళాలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. కేంద్ర పారామిలటరీ దళాలు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఢిల్లీ పోలీసు శాఖలో ఉద్యోగాలు పొందిన 51,000 మందికిపైగా యువతకు ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్, పర్యాటకం, ఆహార శుద్ధి రంగాల్లో మరింత వృద్ధి నమోదవుతుందని, యువతీ యువకులకు భారీ సంఖ్యలో కొత్త ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నట్లు మోదీ తెలిపారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా పురోగమిస్తోందని చెప్పారు. త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని పునరుద్ఘాటించారు. అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు అందుతాయని అన్నారు. అన్ని రంగాల అభివృద్ధితోనే ఆర్థిక వ్యవస్థ ముందడుగు వేస్తుందని చెప్పారు.

కోట్లాది కొత్త కొలువులు

దేశంలో 2030 నాటికి టూరిజం రంగంలో కొత్తగా దాదాపు 14 కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని, దేశ ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం వాటా రూ.20 లక్షల కోట్లకు చేరుతుందని ప్రధాని మోదీ వివరించారు. ఫార్మాస్యూటికల్ రంగం వాటా రూ.4 లక్షల కోట్లుగా ఉందని, 2030 నాటికి ఇది రూ.10 లక్షల కోట్లకు చేరుతుందని వెల్లడించారు. ఫార్మా రంగంలో యువత అవసరం ఎంతో ఉందన్నారు. ఆటోమొబైల్ రంగంలోనూ యువ శక్తి భాగస్వామ్యం కీలకమని చెప్పారు. ఆహార శుద్ధి రంగం విలువ ప్రస్తుతం రూ.26 లక్షల కోట్లుగా ఉందని, మరో మూడున్నరేళ్లలో ఇది ఏకంగా రూ.35 లక్షల కోట్లకు చేరుతుందని స్పష్టం చేశారు. ఆహార శుద్ధి పరిశ్రమ విస్తరిస్తున్నకొద్దీ కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతూనే ఉంటుందని ఆయన అన్నారు.

ఇక 'మేడ్ ఇన్ ఇండియా' ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు

సుపరిపాలన, చట్టబద్ధ పాలన ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు వెల్లువెత్తుతాయని, అందుకు ఉత్తరప్రదేశ్ ఒక ఉదాహరణ అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు ఉండాలన్నారు. వేగవంతమైన అభివృద్ధి కనిపించాలన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం ఉండాలన్నారు. నేరాల రేటు అధికంగా ఉన్న రాష్ట్రాలకు పెట్టుబడులు పెద్దగా రావడం లేదని, ఉద్యోగ అవకాశాలు పడిపోతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. గత తొమ్మిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ కృషి వల్ల మార్పు కనిపిస్తోందన్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో ఎగుమతులు జరిగాయన్నారు. వస్తూత్పత్తి ఊపందుకుందని, ఉద్యోగాల సంఖ్య పెరగడంతో కుటుంబాల ఆదాయం పెరిగినట్లు మోదీ తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. మేడ్ ఇన్ ఇండియా ల్యాప్‌టాప్‌లు, వ్యక్తిగత కంప్యూటర్లు ప్రపంచ మార్కెట్లను ముంచెత్తే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. పారా మిలటరీ దళాల్లో కొత్తగా చేరిన వారిని మోదీ 'అమృత్ రక్షకులు'గా అభివర్ణించారు.

విమానంలో రెండేళ్ల చిన్నారికి ఎయిమ్స్ వైద్యుల ప్రాణదానం

న్యూఢిల్లీ: పుట్టుకతో గుండె సంబంధిత సమస్య ఉన్న రెండేళ్ల పాప విమానంలో ప్రయాణిస్తుండగా హఠాత్తుగా శ్వాస పీల్చడం కష్టసాధ్యంగా మారింది. ఆ చిన్నారి శరీరం చల్లబడటంతోపాటు పెదవులు, వేళ్ల రంగు మారింది. ఈ విషయం గుర్తించిన విమాన సిబ్బంది అప్రమత్తమయ్యారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న వైద్యుల సహాయాన్ని కోరారు. వారు ఆ పాపకు చికిత్స అందించి, ప్రాణదానం చేశారు. బెంగళూరు నుంచి ఢిల్లీకి బయలుదేరిన విస్తారా విమానంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీలోని ప్రఖ్యాత 'ఎయిమ్స్'కు చెందిన ఐదుగురు వైద్యులు బెంగళూరులో ఓ సెమినార్‌కు హాజరై విమానంలో ఢిల్లీకి తిరిగి బయలుదేరారు. అదే విమానంలో ఉన్న చిన్నారి శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి, వెంటనే సీపీఆర్ ప్రారంభించారు. విమానంలో ఉన్న పరిమిత వనరులతోనే ఆ చిన్నారికి చికిత్స అందించారు. చికిత్సతో చిన్నారి శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. ఇంతలోనే ఒకసారి గుండెపోటుకు గురైంది. ఎయిమ్స్ వైద్యులు ఆమెకు ఏఈడీ పరికరంతో చికిత్స అందించారు. ప్రాణాలు నిలబెట్టారు. మెడికల్ ఎమర్జెన్సీ నేపథ్యంలో విమానాన్ని మహారాష్ట్రలోని నాగపూర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. అంబులెన్స్‌లో చిన్నారిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. ప్రాణాపాయం నుంచి బయటపడిన పాప ప్రస్తుతం సురక్షితంగా ఉంది. ఈ విషయాన్ని ఢిల్లీ ఎయిమ్స్ 'ఎక్స్'లో పోస్టు చేసింది. శ్వాస దాదాపు ఆగిపోయి, ఆ తర్వాత గుండెపోటుకు గురైన పాపను తమ వైద్యులు కాపాడినట్లు వెల్లడించింది.

కొచ్చి-బెంగళూరు విమానానికి బాంబు బెదిరింపు

కొచ్చి: ఇండిగో విమానయాన సంస్థకు చెందిన కొచ్చి-బెంగళూరు విమానంలో బాంబు ఉందంటూ వచ్చిన బెదిరింపు కాల్‌తో అధికారులు హైరానా పడ్డారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరాల్సిన విమానంలో పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి బాంబు లేదని తేల్చారు. అనంతరం మధ్యాహ్నం 2.24 గంటలకు బెంగళూరుకు బయలుదేరింది. 6ఈ6482 విమానం మొత్తం 139 మంది ప్రయాణికులతో కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. అంతలోనే, ఆ విమానంలో బాంబు ఉందంటూ గుర్తు తెలియని వ్యక్తి ఇంటర్నెట్ ద్వారా అధికారులకు ఫోన్ కాల్ చేశాడు. దీంతో, అధికారులు వెంటనే భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రయాణికులందరినీ కిందికి దించివేశారు. వారికి చెందిన లగేజీని కూడా క్షుణ్నంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువేదీ లేదని ధ్రువీకరించుకున్నారు. అనంతరం 2.24 గంటల సమయంలో ఆ విమానం తిరిగి బెంగళూరుకు టేకాఫ్ అయ్యింది. బాంబు బెదిరింపుపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక సమస్యతో యూకేలో నిలిచిన విమానాలు

లండన్: సాంకేతిక సమస్య కారణంగా యూకేకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి ఇతరదేశాలకు వెళ్లే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో, వేలాది మంది ప్రయాణికులు ఎక్కడివారక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. బ్రిటిష్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థల్లో సమస్య ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల్లో భద్రతా నిర్వహణ కోసం ట్రాఫిక్‌పై నియంత్రణలను విధించినట్లు యూకే నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ తెలిపింది. అయితే, సమస్యకు కారణం, ఎప్పటివరకు పరిష్కారమవుతుందనే విషయం సంస్థ తెలపలేదు. సమస్యను సాధ్యమైనంత త్వరంగా పరిష్కరించేందుకు తమ ఇంజనీర్లు కృషి చేస్తున్నారని తెలిపింది. యూకే గగనతలాన్ని మాత్రం మూసివేయలేదని స్పష్టతనిచ్చింది.

ముంబైలో జరిగే 'ఇండియా' భేటీకి సోనియా

ముంబై: త్వరలో ముంబైలో జరిగే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతల మూడో సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ హాజరుకానున్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే సోమవారం ఈ విషయం వెల్లడించారు. ఆగస్టు 31, సెప్టెంబర్ ఒకటో తేదీల్లో ముంబై శివారులోని ఓ లగ్జరీ హోటల్‌లో నేతలు భేటీ కానున్నారు. డజనుకుపైగా పార్టీల కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొంటారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఎజెండాపై చర్చించడంతోపాటు ఇండియా కూటమి అధికారిక లోగోను ఖరారు చేయనున్నారు.

నూహ్‌లో ప్రశాంతంగా పూజలు

నూహ్(హరియాణా): సర్వజాతీయ హిందూ మహాపంచాయత్ సంస్థ సోమవారం నూహ్‌లో తలపెట్టిన శోభాయాత్రను అధికారులు అడ్డుకున్నారు. జూలై 31న నూహ్‌లో మత కలహాలు చెలరేగిన నేపథ్యంలో హరియాణా ప్రభుత్వం తాజాగా శోభాయాత్రకు అనుమతి నిరాకరించింది. మల్హర్, ఝిర్, శింగార్ శివాలయాల్లో పూజలు మాత్రం చేసుకోవచ్చని తెలిపింది. దీంతో, అధికారులు ఢిల్లీ-గురుగ్రామ్ సరిహద్దుల నుంచి నూహ్ వరకు అయిదు ప్రధాన చెక్ పాయింట్లను పోలీసులు ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో పాల్గొనేందుకు అయోధ్య నుంచి బయలుదేరిన జగద్గురు పరమహంస ఆచార్య తదితరుల బృందాన్ని సోహ్నా వద్ద ఘమోర్జ్ టోల్ ప్లాజా వద్ద నిలిపివేశారు. అనంతరం అధికారులు నూహ్ జిల్లాలోకి అనుమతించిన 15 మంది సాధువులు, ఇతర హిందూ నేతలు సుమారు 100 మంది నల్హర్‌లోని శివాలయంలో జలాభిషేక పూజలు చేశారు. అక్కడ్నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ఫిరోజ్‌పూర్‌లోని ఝిర్కా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. శింగార్ ఆలయానికి కూడా వెళ్లారని అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పోలీసులు వెల్లడించారు. ఇలా ఉండగా, సోమవారం సోహ్నా నుంచి నూహ్ వరకు పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలేవీ తెరుచుకోలేదు. అధికారులు ముందు జాగ్రత్తగా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ప్రకటించారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

బీజేపీ మళ్లీ గెలిస్తే దేశంలో నియంత పాలనే



కోల్‌కతా: దేశంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తే నియంతృత్వమే రాజ్యమేలుతుందని, అరాచకం తప్పదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. బీజేపీ దేశంలో మతాల మధ్య, కులాల మధ్య శత్రుత్వాన్ని పెంచిందని మమత మండిపడ్డారు. బీజేపీ గనుక మళ్లీ గెలిస్తే ప్రజల నడుమ విద్వేషాలు మరింత రగులుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో మూడు దశాబ్దాల కమ్యూనిస్టుల పాలనను అంతం చేశానని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని సైతం మట్టికరిపిస్తానని చెప్పారు. వచ్చే ఏడాది జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్‌లోనే జరిగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. డిసెంబర్‌లో ఎన్నికలకు బీజేపీ మొగ్గు చూపుతున్నట్లు చెప్పారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ నాయకులు ఇప్పటికే దేశంలోని అన్ని హెలికాప్టర్లను బుక్ చేసుకున్నారని వెల్లడించారు. ఇతర పార్టీలకు హెలికాప్టర్లు లభించకూడదన్నదే బీజేపీ ఎత్తుగడ అని విమర్శించారు. సోమవారం కోల్‌కతాలో టీఎంసీ యువజన విభాగం ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించారు.



మిస్ వరల్డ్ 2022 కరోలినా బియెలాస్కా సోమవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌లో కశ్మీరీ సంప్రదాయ దుస్తుల్లో ఇలా ఫొటోలకు పోజిచ్చారు. ఆమె వెంట మిస్ వరల్డ్ ఇండియా సిని షెట్టీ తదితరులున్నారు.

42 ఏళ్లకు అమ్మను చూశాడు!

వాషింగ్టన్: దక్షిణ అమెరికా దేశం చిలీలో నెలలు నిండకుండానే జన్మించిన ఓ శిశువు అపహరణకు గురయ్యాడు. కిడ్నాపర్లు ఆ శిశువును అమెరికాకు చెందిన దంపతులకు దత్తతకిచ్చేశారు. ఇది జరిగి 42 ఏళ్లయింది. ప్రస్తుతం అతడి పేరు జిమ్మీ లిపర్ట్ థైడెన్. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రం ఆష్‌బర్న్‌లో ఉంటూ లాయర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, 1970, 80ల్లో నియంత పినోచెట్ హయాంలో చిలీలో వందలాదిగా శిశువులు అపహరణకు గురయ్యారు. ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో వారిలో కొందరు తిరిగి కన్నవారి చెంతకు చేరుతున్నారనే వార్తను మొన్న ఏప్రిల్‌లో థైడెన్ చూశాడు. ఆ సంస్థను సంప్రదించి తన డీఎన్ఏ వివరాల సాయంతో కన్న తల్లి జాడ కనుక్కున్నాడు. తోబుట్టువులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఇంకేముంది? భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని చిలీలోని వల్దీవియాలో ఉండే తల్లి మరియా అంజెలికా గొంజాలెజ్ వద్దకు వెళ్లాడు. 'హాస్పిటల్ సిబ్బంది నెలలు నిండని నా కొడుకు చనిపోయాడని చెప్పగా విని, గుండెలవిసేలా రోదించాను. నా చిన్నారి ఎక్కడున్నా సుఖంగా ఉండాలని దేవుణ్ని కోరుకున్నా. నా ప్రార్థన ఫలించింది' అంటూ ఆమె కొడుకును హత్తుకుంది. తల్లి, కొడుకు కలుసుకున్న వేళ ఆ ఊరంతా పండగ చేసుకుంది.

రోజ్‌గార్ మేళా.. ఒక గిమ్మిక్కు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోయారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల సమయంలో ఇమేజీని కాపాడుకునేందుకే ఆయన ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారని విమర్శించింది. ఉద్యోగ మేళాలు ఒక గిమ్మిక్కని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రకటించిన ప్రధాని మోదీ కేవలం కొన్ని వేల మందికి మాత్రమే నియామక కార్డులు పంపిణీ చేశారని అన్నారు.

అమ్మ భాష..
అమృత జలపాతం

అమ్మ చేతిలో గోరుముద్ద తెలుగు..
రుచిరాగాల పాలముద్ద తెలుగు..
అమ్మ రూపమే భాష..
అమృత జలపాతమే తెలుగు భాష..
మంగళవారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా స్పెషల్ స్టోరీ..

8లో▸



మంగళవారం । 29 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

శివాలయంలో సివిల్ జడ్జి పూజలు



హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన మ్యాకం సారయ్యజ్యోతి కుమార్తె మ్యాకం రమ్య ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా జడ్జి కుటుంబ సభ్యులు సోమవారం మండలంలోని చెల్పూర్ గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్జి రమ్యను అర్చకులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటాం



కరీంనగర్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని పలు సంఘాల నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం మంత్రి గంగుల కమలాకర్‌ను డీటీఎఫ్, ముదిరాజ్ కులస్తులు, రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులు, విశ్వబ్రాహ్మణ, కార్పెంటర్ అసోసియేషన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కు మద్దతుగా ఉండాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే తమకు అన్ని విధాలా న్యాయం జరిగిందని, మంత్రి గంగుల నాయకత్వంలోనే కరీంనగర్ నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఎం.రఘుశంకర్‌రెడ్డి, ఏసురెడ్డి, ఉమారాణి, తిరుపతి, దామోదర్, నర్సయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, రామకృష్ణ, అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజినీర్స్ జిల్లా కార్యవర్గం


డి.సంపత్ కుమార్


సీహెచ్. సంపత్ కుమార్

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా దేవసాని సంపత్‌కుమార్, చీర్లవంచ సంపత్‌కుమార్, కార్యనిర్వహక కార్యదర్శిగా కె.నిఖిల్, కోశాధికారిగా సీహెచ్ శ్రీకాంత్, కార్యాలయ కార్యదర్శిగా ఎ.చంద్రయ్య, మహిళా ప్రతినిధిగా పి.శ్వేత ఎన్నికయ్యారు. అలాగే కరీంనగర్ ఎంఆర్‌టీ డివిజన్ కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారి టి.మహేష్, కరీంనగర్ టౌన్ డివిజన్ కార్యదర్శి జి.శ్రీనివాస్, కోశాధికారి వి.సాయిఅజయ్‌రాజ్, కరీంనగర్ రూరల్ డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్, కోశాధికారి కె.శృతి, హుజురాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వీరాచారి, కోశాధికారిగా విక్రం తేజ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్.నరేందర్, శ్రీధర్‌రెడ్డి వ్యవహరించగా టీఎస్ఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యదర్శి ఎన్.సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు పర్యవేక్షించారు. కంపెనీ అధ్యక్షుడు వంగల వెంకటనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అడ్వైజర్ జంగ మధుసూదన్, ఉపాధ్యక్షుడు అడిచెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాఖీ పండుగకు 398 ప్రత్యేక బస్సులు

విద్యానగర్(కరీంనగర్): రాఖీ పండుగను పురస్కరించుకుని ఈనెల 29 నుంచి 31 వరకు 398 ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎన్.సుచరిత సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి కరీంనగర్ మీదుగా సిరిసిల్లకు 217 బస్సులు, పండుగ తర్వాత తిరుగు ప్రయాణికుల కోసం ఈనెల 31 నుంచి సెప్టెంబరు 4 వరకు సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ మీదుగా జూబ్లీ బస్టాండ్‌కు 181 బస్సులను ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాఖీ పండుగ దృష్ట్యా పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీ9- 60, టీ9-30 టికెట్లను ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు రద్దు చేసినట్లు వివరించారు. అలాగే రాఖీలు, వినాయక విగ్రహాల వ్యాపారానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బస్ స్టేషన్లలో వేకెంట్ స్టాల్స్, ఓపెన్ ల్యాండ్స్ తాత్కాలిక అద్దె ప్రాతిపదికన కేటాయిస్తున్నట్లు, ఆసక్తి గల వ్యాపారులు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

జ్వరాల పంజా

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఓపీ విభాగం రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజూ 750 మందికి పైగా రోగులు రావడంతో ఆస్పత్రిలోని ఓపీ టికెట్ ఇచ్చే హాల్ నిండి బయట వరకు క్యూ కడుతున్నారు. పేరు నమోదుకు గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వారం రోజులుగా ఓపీ విభాగానికి రోగుల తాకిడి పెరిగింది. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ఆసుపత్రి కిటకిటలాడుతోంది.

నాలుగు రోజులుగా జిల్లా ఆస్పత్రిలో ఓపీల సంఖ్య

తేదీ	సంఖ్య
24	690
25	750
26	730
28	907



- జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- సీజనల్ వ్యాధులతో జనం ఇబ్బందులు
- రోగులతో ఆస్పత్రులు కిటకిట

కరీంనగర్‌టౌన్: వాతావరణ మార్పులతో జిల్లాలో ఒక్కసారిగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. కురుస్తున్న వర్షాల కారణంగా జనం సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా, వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. పల్లె, పట్టణాలనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ ప్రభావం ప్రజారోగ్యంపై పడింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో పేరు నమోదుకు జనం బారులు తీరుతున్నారు. ఇందులో చాలా మంది దగ్గు, జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో వచ్చిన వారే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రోగులతో కిటకిట..

పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఈనెలలో కురిసిన వర్షాల కారణంగా ఒక్కసారిగా వైరల్ కేసులు పెరిగాయి. జిల్లా ఆసుపత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. చాలా మంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచాన పడుతున్నారు.

వైద్యారోగ్యశాఖ అప్రమత్తం

సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాలో ఇంటింటి జ్వర సర్వే ప్రారంభించారు. విష జ్వరాలు, వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించేలా చర్యలు చేపడతున్నారు. ముఖ్యంగా డయేరియా, వైరల్ ఫీవర్లతో ఆసుపత్రికి ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని వైద్యులు సూచిస్తున్నారు. డ్రమ్ములు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే అందులో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా ప్రబలి విషజ్వరాలు పెరిగే అవకాశం ఉంది.


ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో నిండిన వార్డు

దుర్శేడ్‌లో ఒకరికి డెంగీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో డెంగీ కేసు నమోదు కావడంతో అధికారులు సోమవారం నియంత్రణ చర్యలు చేపట్టారు. దుర్శేడ్‌కు చెందిన కాశిపాక అర్జున్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఫుడ్ డెలివరీ సంస్థలో పనిచేస్తున్నాడు. రెండు రోజులక్రితం జ్వ రం రావడంతో దుర్శేడ్‌కు వచ్చిన అర్జున్ ఆది వారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోగా డెంగీగా వైద్యులు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఎంపీడీవో జగన్మోహన్ రెడ్డి, సర్పంచు గాజుల వెంకటమ్మ, ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావు, వార్డుసభ్యుడు అశోక్, ఏఎన్ఎం పద్మ, ఆశావర్కర్లు అనిత, లక్ష్మి తదితరులు అర్జున్ ఇంటిని సందర్శించారు. కుటుంబసభ్యుల వివరాలు సేకరించారు. ఇంటి పరిసరాలను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లారు. అనంతరం చామనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సమీపంలోని నివాస గృహాల్లోని వ్యక్తులకు వైద్యపరీక్షలు చేశారు.


ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో, నాయకులు

అందుబాటులో వైద్యులు, మందులు



వ్యాధులు ప్రబలుతుండడంతో జిల్లా ఆసుపత్రిలో మందులు, వైద్యులను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతున్నాం. పేషెంట్లు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కువగా వైరల్ ఫీవర్లు, డయేరియా బారిన పడుతున్నారు. చాలా మంది ఓపీ చూపించుకొని మందులు తీసుకెళ్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

దేశ సేవలో భాగస్వాములవ్వాలి


నేవీకి ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి కమలాకర్

- మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి(కరీంనగర్): యువత దేశ సేవలో భాగస్వాములు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. కొత్తపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ రక్షణ లో పాలుపంచుకోమంటూ శిక్షణకు పంపిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్ నుంచే దేశ రక్షణలో భాగస్వాములు కావాలని, బాధ్యతగా ఎదుగుతున్న విద్యార్థుల భవిష్యత్ గొప్పగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. చేసే వృత్తి ఏదైనా గౌరవంగా ఉండాలని, ఒకప్పుడు రాజకీయాలు అంటే గౌరవం ఉండేది కాదని, నేడు ఆ పరిస్థితి పోయిందన్నారు. ఒక డాక్టర్ ఫెయిల్ అయితే ప్రాణం పోతుందని, ఒక లీడర్ ఫెయిల్ అయితే సమాజం కుప్పకూ లి పోతుందని, అందుకే ఒక మంచి అడ్మినిస్ట్రేటర్ నాయకుడైతే దేశం బాగుంటుందని తెలిపారు. ఒకప్పుడు కరీంనగర్ అనగానే 'నేను రాను' అనే పరిస్థితి నుంచి నేడు హైదరాబాద్ తర్వాత రెండో గొప్ప నగరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ట్రస్మా చైర్మన్ శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించగా, జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.


విద్యార్థినులతో డ్యాన్స్ చేస్తున్న చైర్మన్ సతీశ్‌రెడ్డి

సౌకర్యాలను వినియోగించుకోవాలి

కరీంనగర్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ నుంచి టీఎస్ఓబీఎంఎస్ పథకం ద్వారా వికలాంగుల (చెవిటివారికి)కు మంజూరైన సెల్‌ఫోన్‌లను కలెక్టర్ డా.బి.గోపితో కలిసి అందజేశారు. అర్హత గల దివ్యాంగులు టీఎస్ఓబీఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ, టీఎస్ఓబీఎంఎస్ ద్వారా జిల్లాలో 51శాతం కంటే ఎక్కువ చెవిటి ఉన్న ఐదుగురికి సెల్‌ఫోన్‌లు అందించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కరీంనగర్‌అర్బన్: ప్రభుత్వ పథకాలను అర్హులకు ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న హెచ్ఐసీసీలో స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకలకు మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, డీసీసీబీ చైర్మన్, రైతుబంధు సమన్వయ సమితి సభ్యులు హాజరయ్యేలా చూడాలన్నారు. సెప్టెంబర్ 15 నాటికి పెండింగ్ హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. వృద్ధాప్య ఆసరా ఫించన్‌దారులు మరణించిన క్రమంలో వారి భాగస్వామికి పెన్షన్ బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఆసరా ఫించన్ దరఖాస్తులు 3 రోజుల్లో మంజూరు చేయాలని సీఎస్ తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ సంబంధించి జిల్లా కమిటీ స్క్రూటినీ పూర్తి చేసి రెగ్యులరైజేషన్ పత్రాల పంపిణీ సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డా.బి.గోపి, అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్‌దేశాయ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


వీసీలో కలెక్టర్ డా.బి.గోపి, అధికారులు

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ఠాణా

- సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: సైబర్ కేసుల పరిష్కారానికి కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా కొత్తగా సైబర్ సెక్యూరిటీ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు సీపీ తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసే స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ వి.నరసింహారెడ్డిని నియమించారు. నరసింహారెడ్డి 1996 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ కాగా, ఎస్‌డీపీవోగా నల్గొండలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కరీంనగర్ వచ్చారు. సీఐగా ఎస్.సునీల్‌ను నియమించారు. సునీల్ 2007 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ కాగా, కామారెడ్డి డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా సీపీని ఏసీపీ నరసింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఇటీవల సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నందున వాటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన జరుగుతుందని త్వరలోనే దీని స్వతంత్ర సేవలు కరీంనగర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.


సీపీ సుబ్బారాయుడును కలిసిన నరసింహారెడ్డి

తుదిదశకు అభివృద్ధి పనులు

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. సోమవారం నగరంలోని 53వ డివిజన్ కశ్మీర్‌గడ్డలో కపీశ్వర ఆలయం ఆవరణలో రూ.32 లక్షలతో చేపట్టనున్న కల్యాణమండప నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. రూ.వేల కోట్లతో నగరంలో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతుందన్నారు. పనులు పూర్తయ్యాక 30 ఏళ్ల పాటు నగరంలో మళ్లీ పనుల అవసరం పడదన్నారు. కశ్మీర్‌గడ్డలో తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయం నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రధాన రోడ్డు, పరివార్ బేకరీ ప్రధాన రోడ్డు, సాయికృష్ణ థియేటర్ రోడ్డు, భగవతి పాఠశాల రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న మరో రెండు రోడ్లను కూడా త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కశ్మీర్‌గడ్డ ప్రాంతాన్ని మోడల్‌గా మార్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి ఓపెన్ డ్రైన్ లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు వేశామని వివరించారు. కల్యాణమండపం పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అలాగే దాతల సహకారంతో కపీశ్వర ఆలయాన్ని పునఃనిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తుల శ్రీదేవి చంద్రమౌళి, ఎడ్ల సరిత అశోక్, డివిజన్ వాసులు కేశవరెడ్డి, రాజేశ్వరరావు, విజయ్, అశోక్, సందీప్, ఉయ్యాల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


కల్యాణమండప నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మేయర్

వినతులు.. ఆవేదనలు


ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు

- ప్రజావాణికి 287 ఫిర్యాదులు
- అత్యధికం రెవెన్యూ సమస్యలే

మొత్తం అర్జీలు	287
కరీంనగర్ కార్పొరేషన్	31
మానకొండూరు తహసీల్దార్	17
కొత్తపల్లి తహసీల్దార్	15
కరీంనగర్‌రూరల్ తహసీల్దార్	13
ఇతర శాఖలు	211

కరీంనగర్ అర్బన్: ప్రజావాణికి జనతాకిడి ఎక్కువవుతోంది. వివిధ సమస్యలతో కలెక్టరేట్ వస్తున్న వారి సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ వస్తుండగా పరిష్కారం అంతంతమాత్రమే. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో 287 దరఖాస్తులు రాగా అత్యధికం రెవెన్యూ సమస్యలే. రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూం, దళితబంధు తదుపరి వరుసలో ఉన్నాయి. కలెక్టర్ డా.బి.గోపి అర్జీలను స్వీకరించగా, ప్రజావాణి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ అర్జీలు స్వీకరించారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించండి

పజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు శాతాన్ని పెంచాలని, జిల్లాలోని అన్ని కళాశాలల్లో 18 ఏళ్లు పైబడిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని తెలిపారు. అలాగే కుంటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా ఉండేలా చూడాలని సూచించారు.

పింఛన్ ఇప్పించండి



నేను మూగ, చెవిటి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్ ఇచ్చిన్రు. తెలంగాణ వచ్చిన నుంచి నా బతుకు ఆగమైంది. ఎందుకు పింఛన్ తొలగించారో తెలియదు. ఇదెక్కడి అన్యాయమని అధికారులను కలిస్తే వస్తది.. వస్తది అంటున్రు. ఎప్పుడొస్తదో.

– కె.విద్యాసాగర్, రేకుర్తి, కొత్తపల్లి


దళితబంధులో రాజకీయం



దళితబంధు కోసం దరఖాస్తు చేసిన. రాజకీయ ప్రోద్బలంతో అర్హులకు అన్యాయం చేస్తున్నారు. దివ్యాంగుడిని ప్రభుత్వ సహకారం లేదని మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలిపితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ ప్రజాప్రతినిధి నాపై చేయి చేసుకున్నారు. అన్ని రకాల అర్హుడినైన నాకు దళితబంధు సాయం చేయండి.

– గజ్జెల నాగరాజు, చొప్పదండి

14 గుంటలకు 12 గుంటలే చూపిస్తుంది



నాకు గ్రామంలోని 140ఎ/12 లో 14గుంటల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకం అన్నీ ఉండగా మోకాపై సైతం మేమే ఉన్నాం. కానీ ధరణిలో 14 గుంటల భూమికి బదులు 12గుంటల భూమి చూపిస్తుంది. మరో 2 గుంటల భూమి ఎలా తక్కువగా నమోదు చేస్తారని అధికారులను కలిసి అడిగితే చర్యలు తీసుకుంటామని చెబుతూ నాలుగేళ్లు గడిపోయింది. అయినా ఫలితం లేదు. ఇదెక్కడి అన్యాయం. తప్పుగా నమోదు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి.

– బీరం చంద్రయ్య, లింగాపూర్, మానకొండూరు

క్లుప్తంగా

డీసీవో బాధ్యతల స్వీకరణ



డీసీవో రామానుజాచార్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

కరీంనగర్అర్బన్: జిల్లా సహకార అధికారిగా సముద్రాల రామానుజాచార్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ డా.బి.గోపిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జలాలుద్దీన్అక్బర్, కార్యదర్శి సర్దార్ ప్రీత్‌పాల్‌సింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.అనిల్‌కుమార్, నాగుల మనోజ్, టీఎన్జీవోల సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు సల్వాజి తిర్మల్‌రావు, ఎం.శ్రీనివాస్, జి.రాంచంద్రు, ఎస్.రాజమౌళి, జి.కావ్య, వి.నిర్మల, డి.వనజ, జి.వనిత ఎ.లత, రఫికసస్రీన్, ఆర్.సుధారాణి, ఎస్డీ సాజిద్‌పాషా, ఎం.రమ్య, అమీనాకౌసర్, హసీనాబేగం, తహసీన్ సుల్తానా పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఐఈవో జగన్మోహన్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని సైన్స్ వింగ్ జూనియర్ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డి.మధుమోహన్‌రావు ఆధ్వర్యంలో డీఐఈవోను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.కేదారేశ్వర్, టి.స్వర్ణకుమారి, డాక్టర్ బి.సత్యనారాయణ, ప్రేమ్‌సాగర్, రామకిషన్, సంపత్, రాజేశ్వర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

తేట తెలుగు.. తేనెలొలుకు

- భావోద్వేగాలను మాతృభాషలోనే హాయిగా వెల్లడించగలం
- అమ్మభాషకు పట్టం కడదాం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

మాతృభాష తృణీకారం..
మాతృదేవి తిరస్కారంతో సమానం
– సినీ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
– సకిలించు ఆంధ్రుడా..
చావవెందుకురా..! – ప్రజాకవి కాళోజీ



గిడుగు-పిడుగు పుస్తక ముఖచిత్రం

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్(కరీంనగర్): మనిషి జీవన విధానంలో ఆయువుపట్టు వంటిది మాతృభాష. అందులో జ్ఞానాన్ని పొందలేనివారిలో అభివృద్ధి తక్కువగా ఉంటుందని, వ్యక్తిత్వ వికాసం, మేధాపరమైన ప్రగతి మందగిస్తాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. దేశభాషలందు తెలుగు లెస్స అని, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని ప్రశంసలందుకున్న తెలుగుకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ భాషలోని నుడికారాలు, సామెతలు, జాతీయాలు, లోకోక్తులు వేటికవే ప్రత్యేకం. అమ్మ భాషలోనే మన భావోద్వేగాలను హాయిగా వెల్లడించగలుగుతాం. తెలుగు భాష ఉన్నతి కోసం విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి(ఆగస్టు 29న) సందర్భంగా ఏటా ఈరోజున తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ప్రాధాన్యత కోల్పోతున్న తెలుగు

గిడుగు వెంకట రామ్మూర్తి కృషితో తెలుగుకు కొత్త వెలుగులు వచ్చినప్పటికీ పాలకుల నిర్వాకంతో అమ్మ భాష రోజురోజుకూ నిరాదరణకు గురవుతోంది. తెలుగులో రాయడం ఆత్మన్యూనతగా, ఆంగ్ల మాధ్యమంలో చదవడం నాగరికంగా మారిన కారణంగా సొంత గడ్డపైనే తెలుగు పరాయిదయిపోయింది. అధికార భాషగా తెలుగును అమలు చేయాలన్నది ఆచరణలో అంతంతమాత్రంగానే ఉంది. తెలుగు ప్రజల విజ్ఞప్తి మేరకు 2011లో కేంద్ర ప్రభుత్వం తెలుగును ప్రాచీన భాషగా ప్రకటించింది. తెలుగువారి ప్రస్తావన మహాభారతం, బౌద్ధుల కాలంలోనూ ఉంది.

తెలుగు మహాసభలు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక వేదికపై తీసుకువచ్చి, తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, కళలను తెలుసుకొని, స్నేహ సంబంధాలను వృద్ధి చేసుకోవాలన్న లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టింది. 1975 నుంచి 2012 వరకు అప్పటి అంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 మే 2న తెలంగాణ సాహితీ అకాడమీ ఏర్పాటు చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో అదే ఏడాది అక్టోబర్‌లో తెలుగు మహాసభలు నిర్వహించారు. అప్పటి నుంచి మళ్లీ వాటి ఊసే లేకుండా పోయింది.

కవులు చైతన్యం తీసుకురావాలి



ఆంగ్ల భాష వ్యామోహంలో పడి, తెలుగు భాషను విస్మరిస్తున్నాం, ఉద్యోగ నియామకాల్లో తెలుగు మీడియంలో చదివినవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. కోర్టు తీర్పులు తెలుగులో వెలువడేలా చూడాలి. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలి. – దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకుడు

తెలుగులో సాంకేతిక విద్యనందించాలి



ఆలోచనలను వ్యక్తపరిచే సాధనం అమ్మ భాష. నేడు తెలుగులో మాట్లాడటమే చిన్నతనంగా భావించడం బాధాకరం. సాంకేతిక విద్యను సైతం తెలుగు మీడియంలో అందించాలి. తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు ప్రత్యేక వెయిటేజీ ఇవ్వాలి. – గాజుల రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

చిరస్మరణీయుడు.. గిడుగు



గిడుగు చిరస్మరణీయుడు. ఆయన వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. విశ్వవిద్యాలయాల్లో వాడుక భాష రాజ్యమేలుతోంది. పత్రికలూ పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. – నంది శ్రీనివాస్, సాహితీ గౌతమి అధ్యక్షుడు

మాతృభాష నేర్పించండి



తెలుగు భాషను పరిరక్షించాలి. ప్రాథమిక చదువులు మాతృభాషలో కొనసాగితేనే ఆలోచన శక్తి, ప్రశ్నించేతత్వం విద్యార్థుల్లో పెరుగుతాయి. తల్లిదండ్రులు ఆంగ్లంపై ఉన్న వ్యామోహన్ని తగ్గించి, పిల్లలకు మాతృభాష నేర్పించాలి. – కేఎస్.అనంతాచార్య, సమైక్య సాహితీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

కొత్త తరానికి అందించాలి



భాషా నుడికారాలు, సాహిత్య సౌరభాలను కొత్త తరానికి అందించాలి. ప్రపంచీకరణతో మన భాషా సంస్కృతులను రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంగ్ల భాష వ్యామోహం నుంచి మాతృభాష వైపు మళ్లాల్సిన అవసరం ఉంది. – కొత్త అనిల్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

పరిపాలనలో అమలు చేయాలి



తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలి. వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పాలకులు పరిపాలనలో తెలుగును పక్కాగా అమలు చేయాలి. అందరం అమ్మ భాషకు పట్టం కడదాం. – మాడిశెట్టి గోపాల్, సమైక్య సాహితీ అధ్యక్షుడు, కరీంనగర్

'అల్ఫోర్స్'లో ఉచిత దంతవైద్య శిబిరం



దంతవైద్యులను సన్మానిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో సోమవారం కరీంనగర్ డెంటిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలోని సుమారు 1,900 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దంతాల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకుముందు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక రోగాలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. వైద్యులు ఎం.జయకృష్ణారావు, పి.భాస్కర్‌రెడ్డి, అర్పిత జీవన, శౌర్య, శరత్, జవీజిరెడ్డి, రాకేశ్‌బాబు, మహేశ్వర్‌రావు, కె.రమ్య, సుశ్మితారావు, ప్రతిభ, శశివదనలను శాలువాలతో సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2న బోవెరా జయంతికి రండి

కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రంలోని బీటో రోడ్‌లో గల బోవెరా భవన్‌లో సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బోయినపల్లి వెంకటరామారావు 103వ జయంతి, సారస్వత జ్యోతి మిత్రమండలి స్థాపనా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు బోవెరా సంస్థల చైర్మన్ బోయినపల్లి హనుమంతరావు తెలిపారు. సోమవారం బోవెరా భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత్రికేయ సంఘాల జాతీయ నాయకుడు, ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్ స్మారకోపన్యాసం చేస్తారన్నారు. బోవెరా కవితా పురస్కారాన్ని వాగ్గేయకారిణి, తెలంగాణ ఉద్యమకారిణి విమలక్కకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర తొలి శాసనసభాపతి ఎస్.మధుసూదనాచారి అధ్యక్షత వహిస్తారని, అతిథులుగా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్, సాంఘిక, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, రచయిత టంకశాల అశోక్, మేయర్ సునీల్‌రావు, రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల సంఘం అధ్యక్షుడు వున్నం వెంకయ్య హాజరవుతారని తెలిపారు. బోవెరా అభిమానులు, గాంధేయవాదులు, కవులు, కళాకారులు, సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థల బాధ్యులు, నగరవాసులు విజయవంతం చేయాలని కోరారు.

5 వరకు డిగ్రీ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ అడ్మిషన్లు

కరీంనగర్ సిటీ: డిగ్రీ కళాశాలల్లో సెప్టెంబర్ 5 వరకు స్పెషల్ డ్రైవ్ ఫేజ్ అడ్మిషన్లకు అవకాశం ఉందని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, 'దోస్త్' సమన్వయకర్త ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సారార్ అటానమస్ కళాశాలలో 1,680 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇందులో బీఏ ఇంగ్లిష్ 2, బీఏ తెలుగు 9, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ 10, బీబీఏ 12, బీబీఏ రిటైల్ 12, బీకాం బిజినెస్ అనలైటిక్స్ 12, బీఎస్సీ లైఫ్ సైన్స్ 27, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 58 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కళాశాలలో ఈ ఏడాది నుంచే స్వయం ప్రతిపత్తి హోదా అడ్మిషన్లు జరుగుతున్నాయని అన్నారు. న్యాక్-ఎ గ్రేడ్ గుర్తింపు వచ్చిందని, అన్ని సదుపాయాలు గల లాబ్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, లైబ్రరీ, టీఎస్‌కేసీ, బాలికలకు హాస్టల్ వసతి, విశాలమైన క్రీడా ప్రాంగణం ఉన్నాయని, అనుభవజ్ఞులైన లెక్చరర్లతో విద్యాబోధన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉజ్వల భవిష్యత్తు పొందాలన్నారు. కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ సదుపాయం ఉందని, ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఏదైనా సమస్య ఎదురైతే సంప్రదించాలని సూచించారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- ఎస్‌యూ రిజిస్ట్రార్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కామర్స్ విభాగంలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్, గౌరవ అతిథులుగా చార్టర్డ్ అకౌంటెంట్ డి.నిరంజనాచారి, జీడీసీ చంచల్‌గూడ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ డాక్టర్ రామావత్ రవిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. కామర్స్, బీబీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. కామర్స్‌తో సీఏ, సీఎంఏ, సీఎస్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చేయడం ఎంతో ఉపయోగమని సీఏ శ్రీనిరంజనాచారి తెలిపారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం హెచ్‌వోడీ వి.భిక్షపతి, అధ్యాపకులు సతీశ్‌కుమార్, ప్రసాద్, నారాయణ, శిరీష, అరవింద్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు అస్వస్థత


- హత్యకు కుట్ర పన్నారని బాధితుడి భార్య ఫిర్యాదు
- ముగ్గురిపై కేసు



చికిత్స పొందుతున్న తిరుపతి

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల తిరుపతి అనే రైతు విద్యుదాఘాతంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. తిరుపతి సోమవారం పొలానికి నీరు పెట్టేందుకు బావి వద్దకు వెళ్లాడు. అప్పటికే ఎవరో స్టార్టర్ డబ్బా నుంచి ఇనుప తీగకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, పొలంలోకి వదిలారు. ఇది గమనించని తిరుపతి దానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై, పొలంలో పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి, విద్యుత్ సరఫరా నిలిపివేసి, అతన్ని జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరుపతికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. తిరుపతిని హత్య చేసేందుకే స్టార్టర్ డబ్బా నుంచి ఇనుప తీగ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారని బాధితుడి భార్య కోమల ఆరోపించింది. భూ తగాదాల నేపథ్యంలో గ్రామానికే చెందిన వేల్పుల కుమార్, కుక్కల రమేశ్, రాచపెల్లి వెంకటేశ్‌లు తిరుపతిని చంపేందుకు పథకం వేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



రమేశ్ మృతదేహం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరుకు చెందిన దొంతుల రమేశ్(25) బైక్ అదుపు తప్పి పడిపోవడంతో మృతిచెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. రమేశ్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పని నిమిత్తం చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా పాపగానిపల్లె వద్ద వాహనం అదుపుతప్పి, రోడ్డుపక్కనే ఉన్న చెత్తకుండీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థులు సొంతంగా కంపెనీలు స్థాపించాలి



కరీంనగర్‌సిటీ: రానున్న కాలంలో విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసుకుని సొంతంగా స్టార్టప్ కంపెనీలు స్థాపించాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి సూచించారు. ఎంటర్‌ప్రైజెస్ షిప్ డెవలప్మెంట్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో ఎంటర్‌ప్రైజెస్ ప్రమోషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, హరీశ్‌బాబు, కావేరి గిన్నె మెయిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రమేష్, భవాని ఫీడర్స్ ఎండీ రేవూరి ఆంజనేయులు హాజరయ్యారు. రానున్న కాలంలో విద్యార్థులు మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని, ఇతరులకు ఉద్యోగం అవకాశాలు కల్పించాలని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు వక్తలు, వివిధ స్థాయిల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ట్యూషన్ ఫీజు చెల్లించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు వెంటనే చెల్లించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి అమర్నాథ్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకునేందుకు సర్టిఫికెట్లు కావాలని కాలేజీల చుట్టూ తిరిగితే ఫీజు బకాయిలు ఉన్నాయంటూ యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఫీజు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.


మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ వీరారెడ్డి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ విభాగం హెడ్ డాక్టర్ వీరారెడ్డి సోమవారం ఆస్పత్రిలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

జాతీయ కరాటే పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన అచీవర్స్ పాఠశాల విద్యార్థులు కటా, కుమిటి, వెపన్ విభాగాల్లో 13 బంగారు, 15 వెండి, 10 కాంస్య పతకాలు సాధించి, ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు విద్యార్థులను సన్మానించారు. పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్న ఉద్దేశంతో కరాటేలో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు సురభి వేణుగోపాల్, వినేశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్రీడా అవగాహన సభ

కరీంనగర్ స్పోర్ట్స్: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో చలో మైదాన్ క్రీడా అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజవీరు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడారంగం, క్రీడాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు, యువజన సంఘాల నాయకులు, సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేట్ ఆస్పతుల్లో తనిఖీలు చేయండి



కరీంనగర్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రుల గుర్తింపు రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్, తిరుపతి కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ గోపికి వినతిపత్రం అందజేశారు. సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సంతాన సాఫల్య, ఐవీఎఫ్ కేంద్రాలు అంటూ రకరకాల తోక పేర్లు పెట్టుకొని, అనుమతి తీసుకోకుండా, రెన్యువల్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా దవాఖానాలను నడిపిస్తున్నారని అన్నారు. హాస్పిటల్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే జిల్లా వైద్య శాఖ అధికారులు వెళ్లి, పరిశీలించడం లేదని, రెన్యువల్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫైర్ సేఫ్టీ, పార్కింగ్ స్థలం, పొల్యూషన్ కంట్రోల్ బిల్డింగ్ అగ్రిమెంట్ ప్లానింగ్, అర్హత కలిగిన వైద్యులు, స్టాఫ్ నర్స్ ఉన్నారా లేదా అని చూడకుండా అనుమతులు ఇస్తున్నారని అన్నారు. కొన్ని ఆస్పత్రుల్లో గుట్టుచప్పుడు కాకుండా భ్రూణహత్యలు చేస్తున్నారని, తనిఖీలు నిర్వహించి అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రెగ్యులర్ చేయకుంటే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం



తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

కరీంనగర్: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయకుంటే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా సెకండ్ ఏఎన్‌ఎంలు సోమవారం కలెక్టరేట్ నుంచి ర్యాలీగా వెళ్లి తెలంగాణ చౌక్‌లో రాస్తారోకో చేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడారు. ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలు పరిష్కరించాలని ఏఎన్‌ఎంలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమ్మె విచ్ఛిన్నం చేయడానికి కుట్ర చేస్తుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని, వారి కుటుంబాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు మెరుగు రజిత, ప్రధాన కార్యదర్శి శోభారాణి, అరుణ, రేణుక, వీణ, వనిత, మాధవి, శైలజ, కనకలక్ష్మి, జయశ్రీ, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



ధర్నా చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

కరీంనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం తెలంగాణ చౌక్ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పటివరకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగులకు జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మద్దతు తెలిపి మాట్లాడారు. మంగళ, బుధవారాల్లో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఎస్ జిల్లా అధ్యక్షులు దీప్తి, సుకన్య, వరలక్ష్మి, జిలాని, కనుకుల రమేష్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, శ్రీనివాస్, భరత్, శంకర్, రాజమౌళి, రవిచంద్ర, మహేందర్, రమేష్, నరోత్తం, నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో 'రాఖీ' సందడి

- జోరుగా విక్రయాలు
- దూరప్రాంతాల్లోని తమ సోదరులకు పంపడానికి మహిళల ఆరాటం


రాఖీల కొనుగోళ్లు

విద్యానగర్(కరీంనగర్): అన్నాచెల్లెళ్ల అనురాగానికి అక్కాతమ్ముళ్ల అనుబంధానికి కొలమానమే కాకుండా నిలువెత్తు ఆలవాలంగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా కరీంనగర్‌లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రాఖీ కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఈనెల 31 గురువారం దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షాబంధనం పురస్కరించుకుని తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి తమ రక్త బంధాన్ని దృఢంగా చేసుకోవడానికి సోదరీమణులు సిద్ధమవుతున్నారు.

కరీంనగర్‌లో రాఖీల అమ్మకాలు

కరీంనగర్‌లోని శాస్త్రీరోడ్‌లోని రాజస్తాన్, గుజరాత్ హోల్‌సెల్ వ్యాపారుల నుంచి జిల్లా పరిధిలోని చిరువ్యాపారులు రిటేల్‌గా అమ్ముకోవడానికి టోకున కొనుగోలు చేస్తున్నారు. టవర్ సర్కిల్, ఆఫీస్‌రోడ్ ప్రాంతంలో చిరువ్యాపారులు తోపుడు బండ్లపై, రోడ్డువారగా, కాలనీల్లోని కిరాణ, జనరల్ స్టోర్స్‌లో రాఖీల అమ్మకాలు సాగిస్తున్నారు. కరీంనగర్‌లో దాదాపు 30 వరకు హోల్‌సేల్ దుకాణాలు ఉండగా, నగరంలోని వివిధ ప్రాంతాల్లో రిటైల్ వ్యాపారులు రాఖీలు విక్రయిస్తున్నారు.

వైవిధ్యమైన రాఖీలు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైవిధ్యమైన రాఖీలు లభిస్తున్నాయి. ఫ్యాన్సీ, కుందన్‌లతో చేసిన డిజైన్లు రాఖీలు, జ్యువెల్లరీని తలపించే రాఖీలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. రూ.10 నుంచి ప్రత్యేక రాళ్ల పొదగబడిన రాఖీలు రూ.300 వరకు ఉన్నాయి. వీటికి తోడు జువెల్లరీ షాపుల్లో వన్ గ్రామ్ రాఖీలు, వెండి రాఖీలు అమ్ముతున్నారు.

రూ.2కోట్ల మేర వ్యాపారం



హోల్‌సేల్ దుకాణాల్లో గడిచిన పదిరోజుల నుంచి రోజుకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల విలువ గల రాఖీల వ్యాపారం జరుగుతుందని, ఈనెల ప్రారంభం నుంచి ఇప్పటివరకు కరీంనగర్ కేంద్రంగా దాదాపు రూ.2కోట్ల వరకు వ్యాపారం జరిగినట్లు హోల్‌సెల్ వ్యాపారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు


ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించిన దళిత, గిరిజన డిక్లరేషన్‌ను హర్షిస్తూ సోమవారం నగరంలోని తెలంగాణచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్‌నాయక్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచి, నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు పద్మాకర్‌రెడ్డి, సమద్ నవాబ్, అంజన్‌కుమార్, తాజ్, అరుణ్‌కుమార్, మోహన్, రాజమల్లయ్య, రెహమాన్, బాబు, పోచయ్య, దన్నా సింగ్, చంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, షబానా మహమ్మద్, ములకల కవిత, అబ్దుల్ బారి, బాల భద్ర శంకర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా 'కొనగాల'


మహేశ్

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా డాక్టర్ కొనగాల మహేశ్‌ను నియమించినట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్‌లోని అసెంబ్లీలకు సంబంధించి వివిధ సమస్యలపై ఆ ప్రాంత నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా పార్లమెంట్ పరిధిలోని డీసీసీ అధ్యక్షులకు, పార్లమెంట్ స్థాయి సీనియర్ నాయకులకు సహకరించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

థాక్రేతో రోహిత్‌రావు భేటీ



కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ నాయకుడు మేనేని రోహిత్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రేను మర్యాద పూర్వకంగా కలిసి కరీంనగర్ రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం రోహిత్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పక్షాన నియోజకవర్గంలో చేపట్టిన ప్రతీ కార్యక్రమాన్ని థాక్రేకు వివరించడం జరిగిందన్నారు. అభ్యర్థుల విషయంలో పార్టీ అధిష్టానం పారదర్శంగానే వ్యవహరిస్తుందని తెలిపారు.

మొక్కలు పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న జయశ్రీ

కరీంనగర్‌కార్పొరేషన్: హరితహారంలో భాగంగా నగరంలోని 36వ డివిజన్ మంకమ్మతోటలో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన పూలు, పండ్ల మొక్కలను ఇంటి ఆవరణలో నాటాలని డివిజన్ వాసులను కోరారు.

'భవన' కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ), తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు సోమవారం కరీంనగర్‌లోని లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 1996 నిర్మాణ కార్మికుల సమగ్ర చట్టం, 1979 వలస కార్మికుల చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు. గతేడా మేడే సందర్భంగా సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన మోటార్ సైకిళ్లు, స్కూటీలు వెంటనే ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. రాష్ట్ర అడ్వైజరీ బోర్డులో కార్మిక సంఘాల నాయకులను నియమించాలని, నిర్మాణ రంగంలో వాడే ముడి సరుకులు, నిత్యావసరాల ధరలను తగ్గించాలని, దళారీ వ్యవస్థను అరికట్టాలని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు బోర్డు ద్వారా నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరె రమేశ్, కోశాధికారి వట్టి జగదీశ్, ఉపాధ్యక్షులు పల్ల తిరుపతి, జంభూకం వెంకన్న, రామ్మూర్తి, బత్తుల ప్రసాద్, సుద్దాల రాజేందర్, నెల్లి కనకయ్య, ఇల్లెందుల రవి, సహాయ కార్యదర్శి గేరా రాజకుమారి, నాయకులు పాల్గొన్నారు.

శివశక్తి.. ఖగోళ సమాఖ్య సూత్రాలకు విరుద్ధం

సప్తగిరికాలనీ(కరీంనగర్): చంద్రునిపై చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతానికి ప్రధాని మోదీ శివశక్తి అని పేరు పెట్టడం అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు, కోశాధికారి, జన విజ్ఞాన వేదిక జిల్లా, రాష్ట్ర బాధ్యులు సి.రామరాజు, ఆర్.వెంకటేశ్వర్‌రావు, కె.శంకర్, జి.అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌరవ్యవస్థలో దేనికైనా కొత్తగా నామకరణం చేయాలంటే ఆ పేర్లు అంతర్జాతీయంగా తెలిసినవై ఉండాలని, ఖగోళ సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా ఉండాలన్నారు. రాజకీయ, మిలటరీ, మత సంబంధమైన పేర్లు పెట్టరాదని, అంతర్జాతీయ స్థాయి వ్యక్తులు పేర్లు పెట్టవచ్చని తెలిపారు.

'ఇంపాక్ట్' ప్రోగ్రాం సర్టిఫికెట్లు ప్రదానం

కరీంనగర్: ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో 30 మందికి 30 రోజులపాటు ఆన్‌లైన్‌లో ఉపన్యాస, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాల్లో ఇన్‌చార్జి కుతాడి తిరుపతి, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్రావు అప్పన్నల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని వి కన్వెన్షన్‌లో శిక్షణనిచ్చారు. వారికి సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తిరుపతి మాట్లాడుతూ.. ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వర్‌రావు ఆశీస్సులతో కరీంనగర్‌లోనే శిక్షణ తీసుకున్న తాను ఈ ప్రోగ్రాంకు ఇన్‌చార్జిగా వ్యవహరించడం ఆనందంగా ఉందన్నారు. సర్టిఫికెట్ పొందిన ప్రతీ ట్రైనర్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా మోటివేషన్ తరగతులు నిర్వహించాలని సూచించారు. వెంకట్రావు మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్నవారు తమలాంటి ఎందరో నిస్వార్థ ట్రైనర్లను తయారు చేయాలన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలి


డబుల్‌బెడ్రూం ఇళ్ల ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొత్తపల్లి: అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంట శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి ఆరేళ్లు గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయడం లేదని, పేదలంటే మంత్రికి ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. ఇళ్ల కోసం నగరంలో 15 వేల మంది దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు ఒక్కరికీ కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని విమర్శించారు. చింతకుంటలోని 660 డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి లాటరీ పద్ధతిలో పారదర్శకంగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రవణ్‌నాయక్, కొరివి అరుణ్‌కుమార్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, పొరండ్ల రమేశ్, షేక్ శేహెన్షా, షబానా మహమ్మద్, బాలబద్రి శంకర్, ముల్కల కవిత, ఎగ్గడి శారద, అన్నే జ్యోతి, కుర్ర పోచయ్య, ముక్క భాస్కర్, మహాలక్ష్మి, నెల్లి నరేశ్, అష్రఫ్ ఖురేషి, మహమ్మద్ భారీ, బషీర్, నాగుల సతీష్, తమ్మడి ఎజ్రా, వంగల విద్యాసాగర్, సొహేల్, రాజ్ కుమార్, హనీఫ్, పెద్దిగారి తిరుపతి, కీర్తి కుమార్, కిషన్ నాయక్, ముల్కల యోన, ఇమ్రాన్, నసీం, ఉప్పరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


మనోహర్‌ను అభినందిస్తున్న నాయకులు

కరీంనగర్‌స్పోర్ట్స్: తైక్వాండో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం కరీంనగర్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొంతుల మనోహర్, ప్రధాన కార్యదర్శిగా గాధగారి సంతోష్, కోశాధికారిగా జుంజురి లహరి, ఉపాధ్యక్షులుగా పెండ్లి రాజేందర్, నరెడ్ల కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా రామగిరి శ్రీజ, సభ్యులుగా వినోద్, గణేష్, అంజలి, నాగమణి, కావ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన



కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల(సీబీఎస్ఈ) పదోతరగతి, 12వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై సైకాలజిస్ట్, లైఫ్ కోచ్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. చదువుపై ఆసక్తి, మెలకువలు, మంచి, చెడు వైఖరి, ప్రస్తుతం తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్యారడైజ్, సెయింట్ జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ మొక్కలాంటి విద్యార్థులను ఏ విధంగా మలుచుకుంటే ఆ విధంగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఓనమ్ వేడుకలు



విద్యానగర్: కరీంనగర్‌లోని ది ప్లే స్కూల్‌లో సోమవారం కేరళ సంప్రదాయ పండుగ ఓనమ్‌ను వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులు, పూలతో అలంకరించి విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించారు. విద్యార్థులు చేసిన కేరళ సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాఠశాల చైర్మన్ సుధాకర్ రావు, ప్రిన్సిపాల్ ప్రభాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ముజాఫర్


ముజాఫర్

కరీంనగర్‌రూరల్: వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన సయ్యద్ ముజాఫర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ముజాఫర్, రీజినల్ సెక్రటరీగా ఆర్.వెంకటేశ్వర్ రావు ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై కరీంనగర్ వినియోగదారుల మండలి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

యువకుడి అదృశ్యం


సాయిరాం

కరీంనగర్ క్రైం: నగరంలోని కాపువాడకు చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరాం ఎంబీఏ పూర్తిచేసి ఒక ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 22న ఇంట్లో నుంచి లాప్‌టాప్ రిపేరు చేసుకుని వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుమార్లు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. బంధువులు, తెలిసిన వారి ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని 8 గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో ఆటలాడుకునేందుకు పంపిణీ చేసిన క్రీడా సామగ్రిని సోమవారం కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ పంపిణీ చేశారు. క్రికెట్ కిట్, రెండు వాలీబాల్ కిట్లు, మూడు టీషర్టులు, 4 డంబుల్స్‌ను గ్రామ పంచాయతీలకు అందజేశారు. ఎంపీవో శ్రీనివాస్, సర్పంచులు సంపత్, మంజులసమ్మయ్య, ఎంపీటీసీలు తిరుపతినాయక్, కమలమనోహర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం


నివాళి అర్పిస్తున్న వామపక్ష నాయకులు

కరీంనగర్: పాలక ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి భిన్నంగా వ్యవహరిస్తే పతనం తప్పదని, 23 ఏళ్ల క్రితం విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జరిగిన ప్రదర్శనలో బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో అమరులైన వారి పోరాట స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తామని వామపక్ష నాయకులు మిల్కూరి వాసుదేవారెడ్డి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000లో బషీర్‌బాగ్ చౌరస్తాలో పోలీసులు ఉద్యమకారులపై కాల్పులు జరపడం వల్ల రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలు మృతి చెందారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అప్రజాస్వామిక పోకడలతో పాలన సాగిస్తూ, ఎన్నికల హామీలు విస్మరిస్తూ నియంత పాలన సాగిస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలక ప్రభుత్వాలపై నాటి విద్యుత్ తరహా పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు వర్ణ వెంకట్‌రెడ్డి, బీమా సాహెబ్, ఎడ్ల రమేశ్, సుంకరి సంపత్, డి.సురేష్, నాగమణి, తిరుపతినాయక్, రోహిత్, కసిరెడ్డి మణికంఠరెడ్డి, బూడిద సదాశివ, పైడిపల్లి రాజు, బి.యుగేందర్, బుచ్చన్నయాదవ్, నలువాల సదానందం, న్యాలపట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి కార్యవర్గం ఎన్నిక


నియామకపత్రాలు అందజేస్తున్న లక్ష్మీనర్సయ్య

కరీంనగర్: తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం నగరంలోని ఫిలింభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు రాయిల లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజవెల్లి నారాయణ, సలహాదారుడిగా గజవెల్లి అంజయ్య, అధికార ప్రతినిధిగా పిల్లి లక్ష్మీరాజం, ఉపాధ్యక్షులుగా గజవెల్లి లింగయ్య, గజ్జల వైకుంఠం, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రమేశ్, కార్యదర్శిగా గడ్డం మొగిలి స్వామి, సహాయ కార్యదర్శిగా రాయిల రాజయ్య, ప్రచార కార్యదర్శిగా గడ్డం ఆంజనేయులు, కోశాధికారిగా గజవెల్లి శంకరయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాయిల లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో చిందోళ్లను ఏ గ్రూప్‌లో చేర్చి రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ తదితర రంగాల్లో నామినేటెడ్ పదవులను ఇవ్వాలన్నారు. ప్రతీ జిల్లా కేంద్రంలో చిందు కులం సంఘ భవనానికి 10 గుంటల స్థలం ఇవ్వాలని, చిందు కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మూడు ఎకరాల వ్యవసాయ భూమి, గృహలక్ష్మి పథకంతో పాటు చిందుల కులస్తుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చిందు సంఘం నాయకులు గడ్డం ధనుంజయ్, గజ్జల మురళీ, అంజయ్య, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై విద్యుత్ తీగెలు తొలగింపు

- మంత్రి కమలాకర్ ఆదేశంతో విద్యుత్‌శాఖ చర్యలు
- 30 వరకు ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు


నగునూరులో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌తీగెలు

కరీంనగర్‌రూరల్: కొన్ని దశాబ్దాల నుంచి ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌తీగెలతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ప్రతిరోజూ ప్రమాదాలతో చెలగాటమాడుతున్నప్పటికీ విద్యుత్ అధికారుల నుంచి స్పందన కరువైంది. ప్రమాదకరమైన విద్యుత్‌తీగెలను తొలగించాలని విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధితులు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ ఎలాంటి ప్రయోజనకం కలుగలేదు. విద్యుత్ తీగెలను మార్పిడి చేసేందుకు అయ్యే ఖర్చును గ్రామపంచాయతీ లేదా బాధితులు చెల్లించినట్లయితే విద్యుత్‌శాఖ ముందుకొచ్చి పనిచేస్తోంది. గ్రామపంచాయతీలు చేతులెత్తేయడంతో పలు గ్రామాల్లో నెలకొన్న ఈ సమస్య స్థానిక ప్రజాప్రతినిధులకు కత్తిమీద సాములా మారింది. అసెంబ్లీ, స్థానిక ఎన్నికలు సమీపిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడంతో ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రత్యేక నిధుల మంజూరుకు మంత్రి హామీ

కరీంనగర్ మండలం చామనపల్లిలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగెలను మార్పిడి చేయాలని గ్రామస్తులు మంత్రి గంగుల కమలాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణకు వచ్చిన మంత్రిపై స్థానికులు ఒత్తిడి చేయగా సొంతంగా రూ.11లక్షలను విద్యుత్ శాఖకు చెల్లించేందుకు అంగీకరించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మండల పరిషత్ సమావేశంలో సైతం కరీంనగర్ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాలతోపాటు కార్పొరేషన్‌లో ఇళ్లపై ఉన్న విద్యుత్‌తీగెల మార్పిడి, వీధిలైటకు కొత్తగా స్తంభాలు వేయడం తదితర వాటిపై స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత ఏఈలకు సమాచారం ఇవ్వాలని కరీంనగర్‌రూరల్ ఏడీఈ కె.రాజు కోరారు. ఈనెల 30వరకు దరఖాస్తులు ఇస్తే సర్వే చేసి మంత్రికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో సోమవారం జరిగిన గ్రామసభలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. 13మంది వార్డుసభ్యులకు ముగ్గురు వార్డుసభ్యులు మాత్రమే హాజరుకావడం సరికాదని అన్నారు. వర్షాలకు వరదనీళ్లన్నీ ఇళ్లలోకి వస్తున్నాయని, డ్రైనేజీ కట్టినప్పటికీ లాభం లేదని తెలిపారు. రాజీవ్‌రహదారిలో ఇళ్ల ముందు మురికి నీరు నిలుస్తున్నాయని, కచ్చకాలువతో మసీదుకు పోయేందుకు దారి కరువైందని అన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతామని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. సర్పంచ్ గాజుల వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, వార్డుసభ్యులు కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, కల్లెపల్లి అశోక్, లక్ష్మి, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్ గాజుల అంజయ్య, బోగ తిరుపతి, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ గుమ్మడి లింగయ్య హఠాన్మరణం

కొత్తపల్లి: సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి లింగయ్య(85) సోమవారం హఠాన్మరణం చెందారు. ఉమ్మడి కరీంనగర్ మండలం సీతారాంపూర్ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. దివంగత మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావుకు ప్రధాన అనుచరుడిగా కొనసాగిన వారిలో లింగయ్య ఒకరు. అయితే లింగయ్యకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ సర్పంచ్ మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.

'అసదుద్దీన్‌ని దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి'



కరీంనగర్‌క్రైం: ఏఐఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని ఉద్దేశించి శనివారం సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకురాలు నేరెళ్ల శారద భర్త నేరెళ్ల ఆంజనేయులు గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ సోమవారం టౌన్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేద్దామని వెళ్తే కనీస స్పందన కూడా లేదని ఆరోపించారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అజర్ దబీర్, ఫసియుద్దీన్ ఖాలీద్, అంజద్ ఖాన్, కరీంఖాన్‌లు పాల్గొన్నారు.

రాజీవ్‌రహదారిపై డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారిలోని దుర్శేడ్ సబ్‌స్టేషన్ నుంచి ఇరుకుల్ల వాగు వరకు డ్రైనేజీ నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ దుర్శేడ్ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఊరడి మల్లారెడ్డిలు సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందించారు. రాజీవ్ రహదారిలో డ్రైనేజీ లేకపోవడంతో వర్షాకాలంలో దుర్శేడ్‌లోని నివాసగృహాల్లోకి వరదనీరు వస్తున్నాయని తెలిపారు. దుర్శేడ్ సబ్‌స్టేషన్ నుంచి ఇరుకుల్ల వాగు వరకు, గోపాల్‌పూర్ స్టేజీ నుంచి ఇరుకుల్ల వాగు వరకు రెండువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చారు.

క్లుప్తంగా...

పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం



సాక్షి, అమరావతి: పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియలు సజావుగా కొనసాగించడం ద్వారా ఉత్తమ ప్రమాణాలు సాధించేందుకు వీలుగా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లోని తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. బోధనకు ఎలాంటి ఆటంకం రాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థుల పూర్తి ధ్యాస పాఠ్యాంశాలపైనే ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల యునెస్కో విడుదల చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ రిపోర్టు ఆధారంగా పాఠశాల విద్యాశాఖ ఈ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తాజాగా విద్యాశాఖ ఈ ఆదేశాలు జారీ చేసింది. తాజా నిబంధనల్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రధానోపాధ్యాయులు, ఆ పై అధికారులు వీటిపై విద్యా శాఖ సూచించింది. ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తరువాత తమ ఫోన్లను సైలెంట్ మోడ్‌లో ఉంచి ప్రధానోపాధ్యాయునికి అప్పగించాలి. ఉపాధ్యాయేతర సిబ్బందికీ ఇదే నిబంధన వర్తిస్తుంది.

పురందేశ్వరి టీడీపీ ఏజెంట్

- చంద్రబాబు స్క్రిప్టును బీజేపీ అధ్యక్షురాలిగా ఆమె చదువుతున్నారు
- ఎన్నికల కోసం ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణేల పేరిట నాటకం
- ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి

సాక్షి, అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలి హోదాలో పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌గా వ్యవరిస్తున్నారని తెలుగు, సంస్కృత అకాడెమీ అధ్యక్షురాలు, మాజీ సీఎం ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలైన ప్పటికీ, ఆమె చంద్రబాబు స్క్రిప్టునే చదువుతున్నారన్నారు. ఎన్నికల కోసం వదిన, మరిది ఒక్కటైపోయారని, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మూకుమ్మడిగా విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ప్రజా తీర్పును చూసి చంద్రబాబు, పురందేశ్వరి మూటాముల్లె సర్దుకుని ఊరేగాల్సిందేనని ఎద్దేవా చేశారు. లక్ష్మీపార్వతి సోమవారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి పదవిని లాక్కోవడంలో పురందేశ్వరి ప్రధాన కుట్రదారని ఆరోపించారు. రాజకీయాల్లోకి వస్తానంటే ఎన్టీఆర్ వద్దన్నారన్న కోపంతోనే ఆమె ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టారని అన్నారు. చంద్రబాబు పార్టీలో కుట్రలు చేస్తుంటే.. పురందేశ్వరి, భువనేశ్వరి అమాయకులైన తోబుట్టువు (ఎన్టీఆర్ కొడుకులు)లకు మాయ మాటలు చెప్పి కుటుంబంలో తండ్రిపై వ్యతిరేకత తీసుకొచ్చారని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనుకుంటే పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. చంద్రబాబు, పురందేశ్వరి స్వార్థ రాజకీయాల కోసం ఎన్టీఆర్ పేరును మరింత దిగజారుస్తున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణెం పేరిట నాటకాలాడుతున్నారని తెలిపారు. గతంలో పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే చంద్రబాబుని ఆహ్వానించని పురందేశ్వరి.. ఇప్పుడెలా రూ.100 నాణెం కార్యక్రమానికి పిలుస్తారని నిలదీశారు. అప్పట్లో విగ్రహం ఏర్పాటును ఎవరికి వారు ఖాతాల్లో వేసుకునే ప్రయత్నం చేయలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు చంద్రబాబు స్క్రిప్టునే వదిన చదవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌పై రూ.100 నాణేన్ని కేంద్ర ప్రభుత్వమే విడుదల చేస్తే ఆయన చట్టబద్ధమైన అర్థాంగిగా తనను ఆహ్వానించాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి లక్ష్మీపార్వతి

అలాగైతే ఎన్టీఆర్ యుగపురుషుడా?

ఎన్టీఆర్ తనను వివాహం చేసుకోలేదని టీడీపీ దుర్మార్గపు ప్రచారం చేస్తోందని అన్నారు. ఎన్టీఆర్ జ్ఞాపకార్థం రూ.100 నాణెం విడుదల కార్యక్రమానికి తనను రానివ్వకుండా పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. మరి ఎన్టీఆర్ నాతో ఇల్లీగల్‌గా జీవించారా? అలా అయితే ఇల్లీగల్ పనులు చేసే వ్యక్తి యుగ పురుషుడు ఎలా అవుతారని, దీనికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, టీడీపీ సమాధానం చెప్పాలని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతిలో బహిరంగంగా ప్రకటించిన తర్వాతే ఎన్టీఆర్ 1993లో శ్రేయోభిలాషుల మధ్య దైవసాక్షిగా తనను వివాహం చేసుకున్నారని చెప్పారు.

చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొడతా

రాష్ట్రం నుంచి చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొట్టడమే లక్ష్యంగా తాను ఎన్టీఆర్ కుటుంబంపై పోరాటం చేస్తానని లక్ష్మీపార్వతి హెచ్చరించారు. 'వచ్చే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తా. ఎన్టీఆర్‌ను ఏ విధంగా కుటుంబం మోసం చేసిందో ఆయనే ఆవేదనతో చెప్పారు. ఆ మాటలనే ఊరూరా ప్రచారం చేస్తా. నేను రాకుంటే ఎన్టీఆర్ లేచి నిలబడేవారా? మీరు బిడ్డలుగా ఆయన్ని ఏనాడైనా చూశారా? ఇప్పుడు నన్ను చులకన చేస్తూ ఎన్టీఆర్‌ను అవమానిస్తున్నారు. అందరికీ రావాల్సిన తెలివితేటలు పురందేశ్వరికి మాత్రమే వచ్చాయని ఎన్టీఆర్ చెబుతుండేవారు. తండ్రి మరణానంతరం పురందేశ్వరి కాంగ్రెస్‌లో చేరి కేంద్ర మంత్రిగా పురందేశ్వరి భారీ అవినీతికి పాల్పడ్డారు'అని లక్ష్మీపార్వతి చెప్పారు.

చిరస్మరణీయుడు

ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక అధ్యాయం
- సినిమాలతో సామాజిక న్యాయం, సమానత్వాన్ని చాటారు
- ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు



ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణెం విడుదల చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. పక్కన ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: తన అసాధారణ వ్యక్తిత్వంతో దివంగత ఎన్టీఆర్ దేశ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. రామాయణ, మహాభారతంలోని పాత్రలకు ప్రాణం పోసి భారతీయ సినిమా, సంస్కృతిని సుసంపన్నం చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌పై రూపొందించిన రూ.100 స్మారక నాణెంను ఆమె విడుదల చేసి మాట్లాడారు.

రిక్షా దిగి నేలకు నమస్కారం..

'ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం ముద్రించాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఈ ప్రక్రియను ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందుకు తీసుకెళ్లారు. ఆమెకు ప్రత్యేక అభినందనలు. ఓ గొప్ప వారసత్వానికి ఆమె వారసురాలు. ఎన్టీఆర్ తెలుగు సహా పలు భారతీయ భాషల్లో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఎన్టీఆర్ గురించి నా దృష్టికి వచ్చిన ఓ ఘటనను గుర్తు చేసుకుంటున్నా. 70వ దశకంలో ఓ పెద్దావిడ తన కుమార్తెను చూసేందుకు మద్రాసు వెళ్లారు. అనంతరం మనవరాలితో కలసి రిక్షాలో వెళ్తుండగా ఓ వీధిలో జనం గుమి గూడటాన్ని చూశారు. ఆ వీధిలో ఎన్టీఆర్ ఉంటారని మనవరాలు చెప్పడంలో ఆమె వెంటనే రిక్షా దిగి భూమికి నమస్కరించారు. ఎన్టీఆర్ గురించి ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. సామాన్యుల బాధను కూడా ఆయన తన నటనతో తెలియజేశారు. మనుషులంతా ఒక్కటే సినిమా ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం సందేశాన్ని చాటి చెప్పారు. నటుడు, ప్రజా సేవకుడు, నాయకుడు ఇలా అన్నింటా ఆయన ప్రజాదరణ పొందారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు నేటికీ గుర్తుంటాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

అన్ని తరాలకు ఆదర్శ హీరో: పురందేశ్వరి

తన తండ్రి ఎన్టీఆర్ ఒక్క తరానికి మాత్రమే కాకుండా అన్ని తరాలకు ఆదర్శ హీరో అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు. సినీ, రాజకీయ రంగాల్లో ప్రత్యేక ముద్రతోపాటు మహిళలకు ఆస్తి హక్కు కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.

నేటి నుంచి మూడు చోట్ల విక్రయాలు

ఎన్టీఆర్ స్మారక నాణెం మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుందని మింట్ అధికారులు తెలిపారు. ఓ వ్యక్తి స్మారకార్థం నాణెం హైదరాబాద్‌లో రూపొందించడం ఇదే తొలిసారని హైదరాబాద్ మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వీఎస్ఆర్ నాయుడు చెప్పారు. నాణెం తయారీలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ వినియోగించామన్నారు. రూ.100 నాణెం అయినప్పటికీ దీని ధర రూ.3,500 నుంచి రూ.4,850 వరకు ఉండవచ్చన్నారు. ప్యాకింగ్ మెటీరియల్‌ను బట్టి ధర వేర్వేరుగా ఉంటుందన్నారు. స్మారక నాణెం కాబట్టి చెలామణీలో ఉండదని స్పష్టం చేశారు. తొలి విడతలో 12 వేల నాణేలను రూపొందించామని, 50 వేల నాణేల వరకు డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్, చర్లపల్లి మింట్, మింట్ మ్యూజియం వద్ద విక్రయాలు నిర్వహిస్తామని తెలిపారు.

జీవిత విశేషాలతో వీడియో..

ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన 20 నిమిషాల వీడియోను రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో ప్రదర్శించారు. స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నారా బ్రాహ్మణి, నందమూరి కుటుంబ సభ్యులు, ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ము లేకనే.. దత్తపుత్రుడు!

నగరి సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం

సొంత బలం, సొంత కుమారుడిపై చంద్రబాబుకు అప నమ్మకం
ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారు

సాక్షి, తిరుపతి: సొంత బలంపై, సొంత కుమారుడిపై నమ్మకం లేని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లు, మోసం, అబద్ధాలేనని ధ్వజమెత్తారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యాదీవెన నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. 'ఏ ఇంటికీ, ఏ సామాజిక వర్గానికీ, ఏ ప్రాంతానికీ ఎలాంటి మంచి చేయని గత పాలకులు ఎన్ని దుర్మార్గాలకు దిగుతున్నారో నాలుగు మాటలు మీ ముందుంచుతా. దుర్మార్గమైన ఆలోచనలు చేసే ఆ పెద్ద మనిషి మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. 28 ఏళ్ల క్రితమే ఆయన ముఖ్యమంత్రి అయ్యాడు. మూడుసార్లు సీఎం అయిన ఆ వ్యక్తి పేరు చెబితే కనీసం ఒక్కటంటే ఒక్క మంచి స్కీమైనా మీ మెదడులో తడుతుందా? గత పాలనకు, ఈ నాలుగేళ్ల పాలనకు తేడా ఉందా? లేదా? అనేది ఆలోచన చేయండి'అని సీఎం జగన్ పేర్కొన్నారు. సభలో ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్యాకేజీ ఇచ్చి దత్తపుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నాడు



ఆ మనిషి ఎలాంటివాడో అందరికంటే మీకే బాగా తెలుసు. ఆ మనిషి ఏదైనా మాట ఇస్తే నిలబెట్టుకున్నాడా? అనేది ఆలోచన చేయండి. అధికారం కోసం ఏ గడ్డి అయినా తినడానికి వెనుకాడడు. చివరికి పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడవడానికి కూడా ఏ మాత్రం వెనుకాడని మనిషి.. ఆ పెద్ద మనిషి!! ఆ పెద్ద మనిషికి సొంత బలం మీద గానీ, సొంత కుమారుడి మీద గానీ నమ్మకం లేదు. కాబట్టే దత్త పుత్రుడిని ప్యాకేజీ ఇచ్చి అద్దెకు తెచ్చుకున్నాడు.

ప్రతి అడుగులో కుళ్లు, కుతంత్రాలే!

ఈమధ్య కాలంలో ఆయన గానీ, ఆయన కుమారుడు గానీ, దత్తపుత్రుడు గానీ మీటింగుల్లో మాట్లాడుతున్నప్పుడు మాట్లాడుతున్న మాటలు చూసినప్పుడు, వారి భాషను చూసినప్పుడు ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రతి మాటలోనూ రెచ్చగొట్టాలి, కుతంత్రాలు చేయాలి, గొడవలు సృష్టించి శవ రాజకీయాలు చేయాలనే కుతంత్రాలు ప్రతి అడుగులోనూ కనిపిస్తాయి.

వీళ్లతో కలిసి ఎల్లో మీడియా ప్రయాణం..

టీవీలో ఏదైనా వార్త వస్తే నిజమేనేమో అనుకునే పరిస్థితులు ఇవాళ లేవు. ఆ పాత రోజులు పోయాయి. ఈరోజు ఎల్లో మీడియా చంద్రబాబు నాయుడును ఏ రకంగా మోస్తోందో మీ అందరికీ తెలుసు. ప్రజలకు ఫలానా మంచి చేశామని చెప్పుకునేందుకు గత చరిత్ర ఏదీ లేదు కాబట్టే వీళ్లంతా అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్ల మీద ఆధారపడి వాటినే జీవితంగా మార్చుకుని రాజకీయాలు చేస్తున్నారు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అనేదే వారి లక్ష్యం.

కుర్చీ లాక్కుని ఫోటోలకు దండేస్తారు

ఇదే వ్యక్తి.. ఎన్టీ రామారావు నుంచి సీఎం కుర్చీని లాగేసుకున్నారు. ఆయనకు వెన్నుపోటు పొడిచారు. ఎన్టీఆర్ పార్టీని కూడా లాగేసుకున్నారు. ఎన్టీఆర్ చావుకు కూడా చివరకు వీళ్లే కారణం అయ్యారు. ఇదే దుర్మార్గులు మళ్లీ ఎన్టీఆర్ చనిపోగానే ఆయన శవాన్ని లాక్కుంటారు. ఫొటోలకు దండలేస్తారు. ఫొటో ముందు ప్రతి రోజూ దండం పెడుతూ తిరుగుతారు. ఆయన పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేస్తుంటే ఆ కార్యక్రమంలో కూడా చంద్రబాబు నిస్సిగ్గుగా పాలు పంచుకుంటారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

క్రీడల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

- స్పోర్ట్స్ పాలసీ అమల్లోకి తేవాలి
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడారంగం అభివృద్ధిపై విశ్లేషకుల అభిప్రాయాలు, సూచనలు



కరీంనగర్‌స్పోర్ట్స్: అన్ని రంగాల వారు క్రీడారంగాన్ని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే క్రీడారంగం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. కనీసం స్వరాష్ట్రంలోనైన క్రీడారంగం అభివృద్ధి చెందేలా మార్గదర్శకాలు తేవాలని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. క్రీడా రంగాన్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. నియోజకవర్గం, మండలానికో మినీ స్టేడియం నిర్మిస్తామని నేతలు హామీలిచ్చి.. గాలికి వదిలేశారు. రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటే క్రీడాకారులు ఎందరో ఉన్నారు. వారిని వెలికి తీసి ప్రోత్సహిస్తే ఒలింపిక్స్ లాంటి క్రీడల్లో మన జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేస్తారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. క్రీడారంగంలో నూతన పాలసీలు తీసుకురావాలని, ఏటా క్రీడాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారికి ఏటా ఆర్థికంగా ప్రోత్సహించాలని కోరుతున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పలు క్రీడా సంఘాలు, విశ్లేషకుల అభిప్రాయాలు.

నూతన పాలసీ అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం క్రీడరంగాన్ని గాడిలో పెట్టేందుకు, క్రీడలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నూతన క్రీడా పాలసీని రూపొందించింది. ఈ పాలసీతో క్రీడాకారులకు, సంఘాలకు మేలు కలగనుంది. వెంటనే నూతన క్రీడాపాలసీని అమల్లోకి తెస్తే బాగుంటుంది. – నందెల్లి మహిపాల్, రాష్ట్ర అథ్లెటిక్ సంఘం ఉపాధ్యక్షుడు

స్టేడియాలు పూర్తి చేయాలి



నియోజకవర్గానికొక మినీ స్టేడియం అని హుటాహుటిన కొన్నిచోట్ల మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో మంజూరైన మినీ స్టేడియాల్లో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల మినహా మిగతా చోట్ల పూర్తి కాలేదు. సుమారు పదేళ్లు అవుతుంది. ఫస్ట్ మంజూరైన స్టేడియాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. – గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి

క్రీడా సంఘాలను మమేకం చేయాలి



తెలంగాణ ప్రభుత్వం అమలు పరుచనున్న నూతన క్రీడా పాలసీలో క్రీడా సంఘాలను మమేకం చేయాలి. ఒలింపిక్, క్రీడా సంఘాల సలహాలు, సూచనలు తీసుకోవాలి. మన క్రీడాపాలసీ దేశ వ్యాప్తంగా అమలు పరిచేలా రూపొందించాలి. – చల్ల హరిశంకర్, రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు

ఏటా నిధులు మంజూరు చేయాలి



ఏటా క్రీడల నిర్వహణ, ఇతర అవసరాలకు నిధులు కేటాయించాలి. అకస్మాత్తుగా పోటీలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు స్పాన్సర్‌లు దొరికితేనే సాధ్యమవుతుంది. అలాగే జిల్లా క్రీడాశాఖ పరిధికి ఈ మొత్తం కేటాయించాలి. – సీహెచ్.సంపత్‌రావు, రాష్ట్ర కబడ్డీ సంఘం సంయుక్త కార్యదర్శి

క్రీడాకారులను ప్రోత్సహించాలి



జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ప్రోత్సహించాలి. వారు పోటీల్లో గెలిచి జిల్లాకు రాగానే ఘనస్వాగతం పలకాలి. పతకాలు సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పారితోషికం, స్కాలర్‌షిప్ ఇవ్వాలి. ఇలా చేస్తేనే క్రీడలకు పూర్వవైభవం వస్తుంది.– బసరవేణి లక్ష్మణ్, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి

పోటీలు జరుగుతూనే ఉండాలి



రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయగా, పోటీలు నిర్వహించడం మరిచారు. క్రీడా ప్రాంగణాల్లో ఎప్పుడూ పోటీలు జరిగేలా క్రీడా శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలి. – ఎస్.సిద్ధారెడ్డి, జిల్లా యోగ సంఘం కార్యదర్శి

కోచ్‌ల నియామకం చేపట్టాలి



ఎన్నో క్రీడాంశాలకు నెలవుగా ఉండే జిల్లా కేంద్రంలోని స్టేడియంలో క్రీడాకారులకు శిక్షణనిచ్చే కోచ్‌లను వేళ్ల మీద లెక్కించవచ్చు. సత్తాచాటే క్రీడాకారులు కావాలంటే అది కేవలం కోచ్‌ల వల్లే సాధ్యం. వెంటనే అన్ని జిల్లాల్లో కోచ్‌లను నియమించాలి. – కొమురోజు కృష్ణ, ఆర్చరీ సంఘం అధ్యక్షుడు

నిర్వహణకు బడ్జెట్ ఇవ్వాలి



రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ అన్ని జిల్లాల్లో సమానంగా నిర్వహించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ఏ క్రీడ అయినా ఘనంగా నిర్వహించేలా ప్రతిపాదనలు తేవాలి. పోటీల నిర్వహణకు ముందే బడ్జెట్ ఇవ్వాలి. ఇలా ఏటా మూడు నాలుగు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తే క్రీడారంగంపై అందరి దృష్టి పడుతుంది. – గట్టు అనిల్‌కుమార్‌గౌడ్, జిల్లా స్కేటింగ్ సంఘం సంయుక్త కార్యదర్శి

అన్ని పాఠశాలల్లో..



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 164 పీఈటీ పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చ జెండా ఊపింది. అన్ని పాఠశాలల్లో పోస్టులు మంజూరు చేయాలి. విద్యార్థులకు వ్యాయామ పాఠాలు చెప్పాలంటే పీఈటీల అవసరం ఎంతైనా ఉంది. – కదారి రవి, జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి

నిర్బంధ వ్యాయామ విద్య



రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో నిర్బంధ వ్యాయామ విద్య అమలు చేయాలి. పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి. ఎన్నో ఏళ్లుగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం చూస్తున్నా ఆచరించడం లేదు. వచ్చే విద్యాసంవత్సరం నుంచైన అమలు చేయాలి. – గిన్నె లక్ష్మణ్, వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి

టూరిజంకు కడెం ఐబీ

- పదేళ్లపాటు అప్పగింత
- ఇరిగేషన్ కార్యాలయం తరలించవద్దని వినతి

కడెం: రాష్ట్రంలోని ప్రాజెక్టుల పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేయడంపై పర్యాటక శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కడెం ఐబీని నీటి పారుదల శాఖ పదేళ్ల పాటు పర్యాటక శాఖకు అప్పగించింది. కడెం ప్రాజెక్టు ఈఈ విఠల్, డీఈ భోజదాసు పర్యాటక శాఖ అధికారులు సునంద, రాజులకు ఐబీ భవనం, 6.16 ఎకరాల స్థలానికి సంబంధించిన పత్రాలను సోమవారం అప్పగించారు. పర్యాటక సంస్థ ప్రైవేటు టెండర్లను పిలిచి హోటల్, చిల్డ్రన్స్ పార్క్, వాటర్ గేమ్స్ తదితర వాటిని అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కార్యాలయం తరలించవద్దని నిరసన

సుమారు ఆరు దశాబ్దాల నాటి కడెం ప్రాజెక్టు డివిజన్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్లుగా సమీపంలోని ఐబీలోనే ఇరిగేషన్ అధికారులు కార్యాలయ కార్యకలపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు దానిని పర్యాటక సంస్థకు అప్పగిస్తే కార్యాలయాన్ని ఎక్కడికి తరలిస్తారని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ కార్యాలయాన్ని కడెం నుంచి తరలించొద్దని ఈఈ విఠల్‌కు స్థానిక రైతు నాయకులు వినతిపత్రం అందజేశారు. శిథిలావస్థకు చేరిన ఇరిగేషన్ కార్యాలయం స్థానంలో డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయం నిర్మాణం చేపట్టాలని గతంలోనే ఉన్నాతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు ఐబీలోనే రెండేళ్ల పాటు కార్యాలయం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.



కడెం మండల కేంద్రంలోని ఐబీ



ఇరిగేషన్ కార్యాలయం తరలించవద్దని ఈఈ కి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

తరలిస్తే ఊరుకోం



విశ్రాంతి భవనం పర్యాటక సంస్థకు అప్పగించొద్దు. శిథిలావస్థకు చేరిన డివిజన్ కార్యాలయ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలి. కడెం నుంచి ఇరిగేషన్ కార్యాలయాన్ని ఊరుకోం. – హపావత్ రాజేందర్, సదర్‌మట్ కాలువ సమితి అధ్యక్షుడు

కార్యాలయం ఇక్కడే..



ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక సంస్థ అధికారులకు ఐబీ, ఆరు ఎకరాల స్థలం పదేళ్లపాటు అప్పగించాం. డివిజన్ కార్యాలయం మరో రెండేళ్లు ఐబీలోనే కొనసాగుతుంది. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం, నిధులు మంజూరు కాగానే కొత్త భవనం నిర్మిస్తాం. – భోజదాసు, డీఈ

ఉమ్మడి జిల్లాకు 70 చార్జింగ్ స్టేషన్ల మంజూరు

- ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: పర్యావరణ కాలుష్యం నియంత్రించడంతో పాటు ఇంధన వనరుల వినియోగాన్ని కట్టడి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దీంతో ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ వాహనాల సంఖ్య పెరిగింది. ఈ మేరకు అవసరమైన చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌రెడ్‌కో) నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 70 చార్జింగ్ స్టేషన్లను మంజూరు చేసింది. వీటి ఏర్పాటు కోసం పీపీపీ పద్ధతిలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. టీఎస్‌రెడ్‌కో ఎంపిక చేసిన పాయింట్ ఆపరేటర్లకు పదేళ్ల వరకు రెవెన్యూ షేరింగ్ ఆధారంగా స్థలం కేటాయిస్తారు. సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా స్థలాల్లో స్టేషన్లను సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి గలవారు టీఎస్‌రెడ్‌కో వెబ్‌సైట్ https:// www. tsredco. telangana. gov. in/ లేదా హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లోని రెడ్‌కో ప్రధాన కార్యాలయంలో సంప్రదించవచ్చని జిల్లా మేనేజర్ నివర్తి బదావత్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులతో సెప్టెంబర్ 4 లోగా ప్రత్యక్షంగా హాజరై కేటాయింపు ప్రక్రియలో పాల్గొనవచ్చని ఆయన సూచించారు.

జిల్లాల వారీగా మంజూరైన స్టేషన్లు

జిల్లా	మంజూరైన స్టేషన్లు
ఆదిలాబాద్	19
నిర్మల్	16
మంచిర్యాల	26
కుమురంభీం ఆసిఫాబాద్	09

తెప్పలో వెళ్తేనే మల్లన్న దర్శనం

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని అతిపురాతన సిరిచెల్మ మల్లన్న ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. శ్రావణ సోమవారం కావడంతో మల్లికార్జుడిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భారీగా తరలివచ్చారు. ఆలయం చెరువు మధ్యలో ఉండి చుట్టూ నీరు ఉండడంతో ఇలా తెప్పలపై వెళ్లి దర్శించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



న్యూస్‌మేకర్


కజిరంగా సిబ్బందితో సొనాలి ఘోష్

మహారణ్యానికి మహిళా బాస్


సొనాలి ఘోష్

అస్సాంలో వెయ్యి చదరపు కిలోమీటర్ల కజిరంగా నేషనల్ పార్క్...
118 ఏళ్ల ఘన చరిత్ర...
కాని ఇంతకాలం వరకూ ఒక్కసారి కూడా ఫీల్డ్ డైరెక్టర్ బాధ్యతలు మహిళలకు అప్పజెప్పలేదు.
ఇన్నాళ్లకు ఐ.ఎఫ్.ఎస్ అధికారి సొనాలి ఘోష్ చరిత్ర సృష్టించింది.
సెప్టెంబర్ 1 నుంచి కజిరంగాలోని చెట్టూ పుట్టా ఖడ్గమృగాలూ ఏనుగు గుంపులూ సొనాలి కనుసన్నల్లో మెలగనున్నాయి.
శక్తి సామర్థ్యాలతో ఈ స్థాయికి ఎదిగిన సొనాలి ఘోష్ పరిచయం.

మొత్తానికి ఒక స్త్రీ రక్షించిన అరణ్యానికి మరో స్త్రీ సర్వోన్నత అధికారి కావడం విశేషం అనే చెప్పుకోవాలి. అస్సాంలో గోలఘాట్, నగాన్ జిల్లాల మధ్య విస్తరించి ఉన్న కజిరంగా నేషనల్ పార్క్ ఒకప్పుడు, ఇప్పుడు ఒంటికొమ్ము ఖడ్గమృగానికి ఆలవాలం. అయితే ఏనాటి నుంచో వందల, వేల ఖడ్గమృగాలు ఇక్కడ వేటగాళ్ల బారిన పడేవి. 1904లో నాటి వైస్రాయ్ లార్డ్ కర్జన్ భార్య మేరీ కర్జన్ వన విహారానికి వచ్చినప్పుడు ఇక్కడ యథేచ్ఛగా సాగుతున్న ఖడ్గమృగాల హననం చూసి చలించిపోయింది. వెంటనే ఆమె భర్తకు ఈ విషయం చెప్పి ఎలాగైనా ఈ వేటకు అడ్డుకట్ట వేసి ఖడ్గమృగాలను కాపాడమని కోరింది. దాంతో అతడు 1905లో కజిరంగా అరణ్యాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి ఈ ప్రాంతాన్ని కాపాడాడు. అప్పటి నుంచి మొదలయ్యి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పూనికతో కజిరంగా నేషనల్ పార్క్‌గా రక్షణ పొందడమే కాక యునెస్కో వారి గుర్తింపు కూడా పొందింది. అయితే ఇంత ఖ్యాతి ఉన్న ఈ పార్క్‌కు ఫీల్డ్ డైరెక్టర్‌గా ఇంత కాలం వరకూ పురుషులే పని చేశారు. ఇన్నేళ్లకు సెప్టెంబర్ 1 నుంచి ఈ బాధ్యతలను సొనాలి ఘోష్ స్వీకరించనుంది.

అడవి అంటే ప్రేమ

సొనాలి ఘోష్ ఒక ఆర్మీ కుటుంబంలో జన్మించింది. తండ్రి ఉద్యోగరీత్యా అడవులు ఆమెకు బాల్యం నుంచే తెలుసు. అలా వాటిపై ప్రేమ ఏర్పడింది. డిగ్రీ అయ్యాక వైల్డ్‌లైఫ్ సైన్స్ చదివి, ఆ తర్వాత ఎన్విరాన్‌మెంట్ లా చదివింది. మానస్ నేషనల్ పార్క్‌లో పులులను ట్రాక్ చేసేందుకు రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ



ఉపయోగించడం వల్ల కలిగే లాభనష్టాలను పరిశోధించి డాక్టరేట్ పొందింది. ఈ చదువంతా ఆమెకు ఐ.ఎఫ్.ఎస్. ర్యాంకు సాధించడంలో ఉపయోగపడింది. ఐ.ఎఫ్.ఎస్. 2000–2003 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచింది. ఆమెకు అస్సాం కేడర్ కేటాయించారు. అప్పటి నుంచి ఆమె తన ఉద్యోగరంగంలో దూసుకుపోసాగింది.

స్త్రీలకు సవాలు

'అడవుల్లో పని చేయడం స్త్రీలకు సవాలే. కాని ఆ సవాలును స్త్రీలు సమర్థంగా ఎదుర్కొంటున్నారు. నేను ఐ.ఎఫ్.ఎస్.లో చేరేనాటికి 100 కు లోపే ఐ.ఎఫ్.ఎస్. మహిళాధికారులు ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య బాగా పెరిగింది. ఇక రేంజర్లుగా, డిప్యూటి రేంజర్లుగా స్త్రీలు పెద్ద సంఖ్యలో ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా ఏదో ఒక ఉద్యోగం అని అడవుల్లోకి రాలేదు. అడవులంటే ఇష్టం కాబట్టే వచ్చారు. అయితే మాకు సమస్యల్లా కుటుంబ జీవనం, వృత్తి జీవనం బేలెన్స్ చేసుకోవడం. అటవీశాఖలో పని చేసే మహిళల పిల్లలను చూసుకునే శిశు కేంద్రాలు సరైనవి ఉంటే తల్లులు నిశ్చింతతో ఇంకా బాగా పని చేయగలరు. అంతే కాదు అడవుల్లో తిరిగే ఈ మహిళా ఉద్యోగులకు తగినన్ని టాయిలెట్లు, స్నానాల గదులు ఉంటే వారికి సౌకర్యంగా ఉంటుంది. నా ఉద్దేశంలో మంచి బడి, మంచి వైద్యం అందుబాటులో ఉంటే గనక అటవీశాఖలో పని చేసే స్త్రీలు తమ పిల్లల్ని అడవులతోపాటుగా పెంచాలని కోరుకుంటారు. ఎందుకంటే అడవికి మించిన గురువు లేదు. స్త్రీలు మంచి కమ్యూనికేటర్లు. అడవుల అంచున జనావాసాలు ఉంటాయి. మనుషుల వల్ల అటవీ జీవులకు వచ్చే ప్రమాదాలను నివారించడంలో మనుషులు ఎలా వ్యవహరించాలో పురుషులు చెప్పడం కంటే స్త్రీలు చెప్తే ఎక్కువ వింటారు. అందుకని కూడా అటవీశాఖలో ఎక్కువమంది పని చేయాలి. అడవులంటే వేటగాళ్లను నిరోధించడం మాత్రమే కాదు. అన్ని జీవుల సమగ్ర జీవన చక్రాలను కాపాడాలి. అది ముఖ్యం' అంటుంది సొనాలి ఘోష్.

ఆమె ఆధ్వర్యంలో కజిరంగా మరింత గొప్పగా అలరారుతుందని ఆశిద్దాం.

సేవాపథం



'ఎవరైనా సరే నిద్రలేస్తూనే నేను ఉద్యోగం కోసం ఎదురు చూడడం లేదు. పదిమందికి ఉపాధి కల్పించడం కోసం ఎదురుచూస్తున్నాను' అనుకోవాలి. 'ఆశాపూరిత ప్రపంచాన్ని ఊహించుకున్నప్పుడే, దాన్ని నిజంగా సృష్టించగలం. నీ మార్గం ఏమిటి అనే విషయంలో స్పష్టత ఉంటేనే అక్కడికి చేరుకుంటావు. అలా చేరుకోవడానికి నీలోని ఉత్సాహం, అంకితభావం ఇంధనంలా ఉపయోగపడతాయి'...'మైక్రోఫైనాన్స్ దారిదీపం'గా ప్రసిద్ధుడైన మహ్మద్ యూనస్ చెప్పిన ఇలాంటి మాటలెన్నో శాన్‌ఫ్రాన్సిస్కోలోని శీతల్ మెహతా వాల్ష్‌కు ఇష్టం. ఆ ఇష్టమే ఆమెను యూనస్ బాటలో నడిపించి 'శాంతి లైఫ్'కు శ్రీకారం చుట్టేలా చేసింది. సూక్ష్మరుణ సంస్థగా మొదలైన 'శాంతి లైఫ్' ఎన్నో గ్రామాల ముఖచిత్రాన్ని మార్చింది....

శాంతి లైఫ్

● స్త్రీ సాధికారతే జీవనాడి


శీతల్ మెహతా వాల్ష్

కెనడాలో పెరిగిన శీతల్ అక్కడి గుజరాతీ అసోసియేషన్‌లో భాగం కావడంతో ఎన్నో కుటుంబాలతో పరిచయం ఏర్పడింది. కమ్యూనిటీ లైఫ్‌లో భాగం కావడం ద్వారా పాశ్చాత్యజీవన విధానానికి భిన్నమైన భారతీయ జీవన విధానాన్ని చూసింది. ఎన్నోవిలువలు నేర్చుకుంది.

వెంచర్–క్యాపిటల్ ఫండింగ్ సెక్టర్‌లో రెండు దశాబ్దాల అనుభవాన్ని సంపాదించిన శీతల్ బంగ్లాదేశ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ మహ్మద్ యూనస్ స్ఫూర్తితో అహ్మదాబాద్ కేంద్రంగా 'శాంతి లైఫ్' అనే సూక్ష్మరుణ సంస్థను ప్రారంభించింది. ఇది పేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది.

గతంలో ఎలా ఉండేదంటే...

పేద మహిళలకు రుణాలు లభించడం కష్టం. ఒకవేళ లభించినా బారెడు వడ్డీ కట్టలేక అష్టకష్టాలు పడేవాళ్లు. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ వడ్డీతో 'శాంతి లైఫ్' రుణాలు ఇవ్వడం మొదలుపెట్టింది. ఎన్నో గ్రామాల్లో ఎంతో మంది మహిళలు రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ సొంతకాళ్ల మీద నిలబడ్డారు.

కేవలం రుణాలు ఇవ్వడమే కాకుండా గ్రామీణప్రాంత మహిళలకు స్కిల్స్ ట్రెనింగ్, ఫైనాన్షియల్ లిటరసీ... మొదలైన వాటిలో శిక్షణ ఇస్తోంది శాంతి లైఫ్.

క్షేత్రస్థాయిలో పనిచేయడం ద్వారా అక్కడి పరిస్థితులపై స్పష్టమైన అవగాహన రావడానికి శీతల్‌కు అవకాశం ఏర్పడింది. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు, వాటిని దూరం చేయాలంటే ఏంచేయాలి... మొదలైన విషయాలను తెలుసుకుంది శీతల్.

'శాంతి లైఫ్' ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుంది.

పారిశుద్ధ్య లోపం వల్ల గ్రామీణ ప్రాంతాలలో మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'సేఫ్ శానిటేషన్' నినాదంతో గ్రామీణప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ అవగాహనతో వారు డబ్బు పొదుపు చేసి మరుగుదొడ్లు నిర్మించుకున్నారు.

'రుణం తీసుకోవడం అనేది ఆర్థిక వ్యవహారమే కాదు. ఒక బాధ్యతను నిరంతరం గుర్తు చేస్తుంది. శాంతి లైఫ్ ద్వారా రుణం తీసుకున్న ఒక మహిళ రిక్షా కొనుగోలు చేసింది. ఈ రిక్షాను ఆమె భర్త నడిపేవాడు. గతంలో అతడి ప్రవర్తన ఎలా ఉన్నా ఇప్పుడు మాత్రం క్రమశిక్షణతో నడుచుకుంటున్నాడు. ఏరోజు డబ్బును ఆరోజే భార్యకు ఇస్తుంటాడు.

భార్య పేరు మీద లోన్ ఉంది కాబట్టి ఆమెకు చెడ్డ పేరు రావద్దని అనుకునేవాడు భర్త. ఇలాంటి భర్తలు ఎందరో! రుణసహాయం మాత్రమే కాదు క్రమశిక్షణ పాదుకొల్పడంలో 'శాంతి లైఫ్' తనదైన పాత్ర నిర్వహిస్తోంది.

గ్రామీణ వృత్తికళాకారులు తయారు చేసిన యోగా బ్యాగులు, చీరెలు, దుప్పట్లను ఆన్‌లైన్ ద్వారా అమ్మడం మొదలుపెట్టింది.

'ప్రతి ఒక్కరికీ తమదైన నైపుణ్యం ఉంటుంది. అది ఇతరుల కంటే ఏ రకంగా భిన్నమైనది, ఆ నైపుణ్యం సమాజానికి ఏ రకంగా ఉపయోగపడుతుంది అనేది ఆలోచించాలి. నైపుణ్యాలను ఉపయోగించి క్షేత్రస్థాయిలో పనిచేయడం ద్వారానే పేదరికాన్ని దూరం చేయవచ్చు' అంటుంది శీతల్.

లాభాలు గడించాలనే దృష్టితో కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలి అనే అవగాహనతో 'శాంతి లైఫ్'కు శ్రీకారం చుట్టింది శీతల్. సామాజిక నిబద్ధతతో మొదలైన 'శాంతి లైఫ్' అనుకున్న లక్ష్యాన్ని చేరుకుందా అని ప్రశ్నించుకుంటే 'అంత కంటే ఎక్కువే' అని జవాబు చెప్పుకోవచ్చు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్, టెక్నాలజీలకు సంబంధించి నైపుణ్యాల శిక్షణ ద్వారా గుజరాత్‌లోని ఎన్నోగ్రామాల ముఖచిత్రాన్ని'శాంతి లైఫ్' మార్చింది.

సాగుబడి

మఖ కార్తె : ఆగస్టు 30 వరకు
పుబ్బ కార్తె : 31 నుంచి

ఆ క్యాట్‌ఫిష్‌లతో ముప్పు!

- అమెరికన్/ ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌లతో దేశీయ చేపల జీవవైవిధ్యానికి ముప్పు
- మన చేపల రైతులు, మత్స్యకారుల ఆదాయానికి గండి
- విదేశీ క్యాట్‌ఫిష్‌ల నియంత్రణకు తోడ్పడేందుకు సిద్ధమంటున్న 'సిసిఎంబీ'

నిషిద్ధ ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌లను మన ప్రజలు ఇష్టంగా తినే కొర్రమీను చేపలుగా చూపి అక్రమంగా విక్రయిస్తున్న వారిపై, తరలిస్తున్న వారిపై మత్స్యశాఖ అధికారులు కేసులు పెడుతున్న సందర్భాలు అడపాదడపా మనం చూస్తున్నాం. అయితే, ఈ ఆఫ్రికన్/ అమెరికన్ క్యాట్‌ఫిష్‌లపై ఎందుకు నిషేధం విధించారు? ఇవి చేపల జీవవైవిధ్యానికి ఏ విధంగా విధ్వంసకరంగా పరిణమిస్తున్నాయి? ఇవి మన చేపల రైతులు, మత్స్యకారుల ఆదాయానికి గండికొట్టే ముప్పు పొంచి ఉందా? వీటిని అరికట్టే మార్గాలేమిటి?.. ఇటువంటి ప్రశ్నలకు సికింద్రాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మోలెక్యులర్ బయాలజీ (సిఎస్ఐఆర్-సిసిఎంబి) సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త డా. జి.ఉమాపతి సమాధానాలు.. 'సాక్షి సాగుబడి' పాఠకుల కోసం ఆయన మాటల్లోనే...



డా. జి.ఉమాపతి


ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్

మన దేశపు నీటి వనరుల్లోకి చొరబడిన అమెరికన్, ఆఫ్రికన్ కాట్ ఫిష్‌ల వంటి విదేశీ జాతి చేపలు స్థానిక చేపల జాతుల మనుగడకు, జీవవైవిధ్యానికి, చేపల రైతులు/ మత్స్యకారుల జీవనోపాధికి గొడ్డలిపెట్టుగా పరిణమించాయి. ఈ విదేశీ చేపలు మన చెరువుల్లో, కాలువల్లో, వాగులు, వంకలు, సరస్సులు, నదుల్లోకి చేరిపోయి తమ సంతతిని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటున్నాయి. సాధారణంగా అమెరికన్, ఆఫ్రికన్ కాట్ ఫిష్‌లు విపరీతమైన మాంసాహారులు కాబట్టి, అవి మన చేపల గుడ్లు, చేపపిల్లలతో పాటు ఇతరత్రా జలచరాలను ఈ బకాసుర కాట్‌ఫిష్‌లే ఆరగించేస్తుంటాయి. ఆ విధంగా స్థానిక చేపల సంతతి బాగా తగ్గిపోతోంది. ఒక్కోసారి ఇవి పూర్తిగా అంతరించిపోయే ముప్పు కూడా ఉంది. అమెరికన్ / ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌ల తీవ్రమైన ఆహారపు అలవాట్లు, భూమిని తవ్వి బొరియలు చేసే అలవాట్ల వల్ల నీటి మొక్కల పెరుగుదలను, నీటి ప్రవాహదారులు మారిపోతున్నాయి. జలచరాల ఆవాసాలు చెల్లాచెదురవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే స్థానిక జాతులను ఇవి చెలకట్టనియ్యట్లేదు.

దుష్ప్రభావాలు

విదేశీ జాతుల క్యాట్‌ఫిష్‌ల వల్ల చేపల రైతులు.. చెరువులు, సరస్సులు, జలాశయాల్లో చేపలపై ఆధారపడి జీవించే మత్స్యకారుల ఆదాయాలు తీవ్రంగా దెబ్బతింటాయి. మనోల్లాసం కోసం చేపలు పట్టడం వంటి వ్యాపకాల ద్వారా ఆదాయం తగ్గిపోతోంది. ఆ విధంగా చెరువులు, సరస్సులు, నదుల్లో స్థానిక చేప జాతుల జీవవైవిధ్యం నశిస్తుంది. కొన్నిసార్లు ఈ జాతులు అంతరించిపోనూ వచ్చు. ఈ నష్టం ఆహార చక్రాల్లో, పర్యావరణ వ్యవస్థ అందించే సేవల్లో ప్రతికూల మార్పులు చోటుచేసుకొని, మొత్తంగా పర్యావరణ వ్యవస్థ గొలుసు కట్టు దుష్ప్రభావాలకు లోనవుతోంది. వీటి సంతతిని నియంత్రించడం లేదా నిర్మూలించడం అంత సులభసాధ్యమైన పని కాదు సరికదా, ఖరీదైనది కూడా. వీటి నిర్మూలనకు రసాయనాలు ప్రయోగించటం లేదా ఏరివేయటం వంటి సాంప్రదాయ నిర్వహణ పద్ధతుల వల్ల పెద్దగా ఫలితం ఉండకపోవచ్చు. అంతేకాదు, ఈ పనుల వల్ల పర్యావరణానికి అను కోని రీతిలో హాని జరగొచ్చు.


అమెరికన్ క్యాట్‌ఫిష్

చెరువులు, జలాశయాలు, సరస్సుల్లో విధ్వంసక విదేశీ జాతుల చేపల జాడను ఈ-డిఎన్ఎ విశ్లేషణ పద్ధతిని ఉపయోగించి గుర్తించటం, పర్యవేక్షించడం, వాటి సంతతిని అంచనా వేయడం వంటి పనులు చేయొచ్చు. ఈ విషయంలో సీసీఎంబీలోని జీవ జాతులు అంతరించిపోకుండా సంరక్షించే 'లకోన్స్' విభాగం సహాయపడుతుంది. విదేశీ క్యాట్‌ఫిష్ జాతుల వల్ల ఉన్న ప్రమాదాల గురించి స్థానికులకు, ఆక్వా రైతులకు అవగాహన కల్పించడానికి 'లకోన్స్' వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది. విదేశీ చేప జాతుల డేటాబేస్‌ను ఏర్పాటు చేసే వీలుంది. దేశవ్యాప్తంగా సమర్థవంతమైన పరిష్కారాలు వెతికేందుకు పరిశోధకులు, రైతుల మధ్య లకోన్స్ అనుసంధానం చేస్తుంది. విదేశీ జాతుల ఉనికిని క్షేత్రస్థాయిలో ముందస్తుగా గుర్తించే పరీక్షను అభివృద్ధి చేయడంలో 'లకోన్స్' సహాయపడుతుంది. మత్స్య శాఖ అధికారులకు, స్థానిక ఆక్వా రైతులకు శిక్షణ ఇవ్వటానికి కూడా 'లకోన్స్' సహాయపడుతుంది.

జిల్లా స్థాయిలో నిఘా అవసరం

చేపలు ఇతర జలచరాలకు సంబంధించిన చట్టాల్లోని నిబంధనలను స్థానిక ప్రభుత్వ యంత్రాంగాలు అమలు చేయాలి. ఆక్వా చెరువులను తనిఖీ చేయటం (అక్రమ చెరువులను అరికట్టడం), విదేశీ చేప జాతుల ముప్పుపై అవగాహన కలిగించేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, జిల్లా స్థాయిలో నిఘా ఏర్పాటు చేయడం అవసరం. మత్స్య శాఖ పరిశోధనా సంస్థల సహకారంతో విదేశీ చేప జాతులను అరికట్టే పద్ధతులను అభివృద్ధి చేయవచ్చు. ఈ పద్ధతులను అనుసరించే రైతులు, మత్స్యకారులకు ప్రోత్సాహకాలను అందించవచ్చు.

ఆఫ్రికన్/అమెరికన్ క్యాట్‌ఫిష్‌లను నియంత్రించాలి

మన దేశంలోని చేపల జాతులతో సంకరం చేసి కొత్త జాతులను అభివృద్ధి చేయడానికి పరిశోధనల నిమిత్తం ఆఫ్రికా, అమెరికా ఖండాల నుంచి క్యాట్‌ఫిష్‌లను కొన్ని దశాబ్దాల క్రితం మన దేశానికి తీసుకొచ్చారు. అయితే, కాలక్రమంలో అవి సహజ జలవనరుల్లోకి చేరిపోయి, ఇప్పుడు చేపల జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించాయి. వీటిని తింటే ఫలానా ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పలేం. అయితే, ఆఫ్రికన్ / అమెరికన్ క్యాట్‌ఫిష్‌లు అత్యంత కలుషిత నీటి సరస్సుల్లో కూడా నిక్షేపంగా పెరుగుతాయి. కాబట్టి ఈ చేపలు అత్యంత కలుషితాలతో కూడి ఉంటాయి. ఇవి మన చేపల చెరువుల్లో, సరస్సులు, జలాశయాల్లో జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించినందున వీటి పెరుగుదలను నిశితంగా గమనిస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించాల్సిన అవసరం ఉంది.



– వినయ్ కె నందికూరి, సంచాలకులు, సిఎస్ఐఆర్–సిసిఎంబి, సికింద్రాబాద్
director@ccmb.res.in

నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్


నేల సాగు కన్నా బ్యాగు సేద్యం మిన్న

- ఆరుబయట పొలాల్లో సేంద్రియ కూరగాయల బ్యాగు సేద్యంపై డా. రామానాయుడు ఏకలవ్య కేవీకేలో వినూత్న ప్రయోగాత్మక సాగు
- నేలపైన పాదుల్లో సాగు.. ఎకరానికి 4.48 టన్నుల కాకర దిగుబడి
- పొలంలోనే బ్యాగుల్లో సాగు.. ఎకరానికి 8 టన్నుల కాకర దిగుబడి వచ్చింది
- బ్యాగు సాగులో కాకరతో పాటు అదనంగా ఎకరానికి 3.64 టన్నుల టొమాటోలు, క్యాబేజీలు, పుదీనా దిగుబడి కూడా పొందటం విశేషం

సేంద్రియ కూరగాయ పంటలను పొలంలో సాధారణ పద్ధతిలో నేలలో కన్నా.. ప్రత్యేకమైన బ్యాగుల్లో సాగు చేయటం ద్వారా రెట్టింపు కన్నా ఎక్కువగా దిగుబడి తీయవచ్చని తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా తునికిలోని డా. రామానాయుడు ఏకలవ్య సేంద్రియ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి–జూలై నెలల మధ్య ప్రయోగాత్మక సాగులో రుజువైంది. ఈ పంటల సాగును శాస్త్రవేత్తలు ఆసాంతమూ సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసి, శాస్త్రీయంగా గణాంకాలను నమోదు చేశారు.


తునికి కేవీకే ప్రాంగణంలో గత వేసవిలో బ్యాగుల్లో సాగైన కాకర పంట


ఎకరంలో ఇలా 2,500 బ్యాగుల్లో 5 వేల కూరగాయ మొక్కలు సాగు చేయొచ్చు


బ్యాగుల్లో టొమాటోలతో పాటు పుదీనా

నగరాలు, పట్టణాలకు దగ్గర్లోని భూసారం అంతగా లేని భూముల్లో, రసాయనాలతో కలుషితమైన లేదా చౌడు తదితర సమస్యాత్మక భూముల్లో బ్యాగు సేద్యం ద్వారా పెద్ద ఎత్తున సేంద్రియ కూరగాయల ఉత్పత్తి పొందడానికి, తద్వారా అన్‌సీజన్‌లో రైతులు అధికాదాయం పొందడానికి అవకాశం ఉన్నట్లు ఈ ప్రయోగం ద్వారా వెల్లడైందని కేవీకే అధ్యక్షుడు టి. వినోద్‌రావు తెలిపారు. సేంద్రియ రైతు శాస్త్రవేత్త ఎం.ఎస్. సుబ్రహ్మణ్యం రాజు మార్గదర్శకత్వంలో కేవీకే శాస్త్రవేత్తల బృందం బ్యాగు సాగులో అద్భుత దిగుబడులు రాబడుతోంది.

ఎత్తు బెడ్లపై సేంద్రియ కాకర సాగు

కాకరను వేసవి పంటగా నేలపై ఎత్తు బెడ్లపై ఏక పంటగా సాగు చేయగా.. ఎకరానికి 4,480 కిలోల (4.48 టన్నులు/ఎకరం) సేంద్రియ కాకర కాయల దిగుబడి వచ్చింది. తునికి కేవీకే ప్రాంగణంలోని 12.5 సెంట్ల భూమి (0.125 ఎకరం)లో సాధారణ పందిరి పద్ధతిలో 1,000 కాకర విత్తనాలను ఎత్తయిన బెడ్లపై ఫిబ్రవరి 25న విత్తారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో బిందు సేద్యం ద్వారా పండించారు. పంట కోత ఏప్రిల్ 17 నుంచి జూలై 12 వరకు కాకర కాయలు కోశారు. ఈ వెయ్యి మొక్కల నుంచి 560.5 కిలోల దిగుబడి వచ్చింది. ఒక్కో మొక్క నుంచి 0.56 కిలోల కాకర కాయల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన.. ఎత్తు బెడ్స్ పద్ధతిలో సగటున ఎకరానికి 4,480 కిలోల కాకర దిగుబడి రాగా, సగటున ఎకరానికి రూ. 1,92,000 ఖర్చయినట్లు (కౌలు కాకుండా) శాస్త్రవేత్తలు రికార్డు చేశారు.

బ్యాగుల్లో కాకర సాగు

పక్క పొలంలోనే ప్లాస్టిక్ బ్యాగుల్లో కాకర పంటను పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయగా.. సగటున ఎకరానికి 8,000 కిలోల (8 టన్నులు /ఎకరం) సేంద్రియ కాకర కాయల దిగుబడి వచ్చింది. 25 సెంట్ల భూమిలో 2023 ఫిబ్రవరి 2న 616 బ్యాగుల్లో, ఒక్కో బ్యాగులో రెండు చొప్పున, కాకర విత్తనాలను పెట్టి, మొక్కలను పందిరికి పాకించారు. విత్తిన 70 రోజులకు మొదలై 175 రోజుల (జూలై 25) వరకు కాయలు కోశారు. మొత్తం 2 టన్నుల కాకర కాయల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన.. సగటున ఎకరానికి 8 టన్నుల కాకర దిగుబడి వచ్చింది. బ్యాగుల్లో కాకర సాగుకు సగటున ఎకరానికి (కౌలు కాకుండా) రూ. 2,40,000 ఖర్చయినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

కాకరతో పాటు.. అదే పొలంలో టొమాటో, పుదీనా, క్యాబేజీ కూడా..

ఎత్తు బెడ్ల సాగులో కాకర ఒక్కటే పంట సాగు చేయగా, బ్యాగు సాగులో కాకరతో పాటు మరికొన్ని బ్యాగుల్లో టొమాటో, పుదీనా, క్యాబేజీ పంటలు కూడా సాగు చేశారు. ఈ పంటల ద్వారా 3,640 కిలోల(3.64 టన్నులు/ఎకరం) దిగుబడి అదనంగా రావటం విశేషం. 25 సెంట్ల భూమిలో మొత్తం 1,566 బ్యాగులు పెట్టారు. అందులో 616 బ్యాగుల్లో రెండేసి కాకర మొక్కలు (2 టన్నుల దిగుబడి), 410 బ్యాగుల్లో రెండేసి క్యాబేజీ మొక్కలు (374 కిలోల దిగుబడి), 180 బ్యాగుల్లో రెండేసి టొమాటో మొక్కలు పెట్టారు. మరో 360 బ్యాగుల్లో ఒక్కోటి చొప్పున టొమాటో, పుదీనా మొక్కలు కలిపి నాటారు. మొత్తం 453 కిలోల టొమాటోలు, 83.6 కిలోల పుదీనా దిగుబడి వచ్చింది.

బ్యాగుల్లో సేంద్రియ సాగు ఇలా..

అడుగున్నర ఎత్తు, అడుగు వెడల్పు ఉండే పాలిథిన్ బ్యాగులో 15 కిలోల పశువుల ఎరువు, 15 కిలోల ఎర్రమట్టి, 100 గ్రా. వేపపిండి కలిపిన మిశ్రమాన్ని నింపారు. జీవామృతం ప్రతి 10–15 రోజులకోసారి పాదుల్లో పోశారు. పంచగవ్య, రాజ్మాగింజల ద్రావణం, కొబ్బరి నీరు నాలుగైదు సార్లు పిచికారీ చేశారు. వేసవిలో కురిసిన అకాల వర్షాల వల్ల లీఫ్ బ్లైట్ వంటి తెగుళ్లు సోకినప్పటికీ సేంద్రియ పద్ధతుల్లోనే వాటిని నియంత్రించటం విశేషం. ఈ కేవీకేలో బ్యాగు సేద్యంపై (గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు) రెండు బ్యాచ్‌లలో ప్రయోగాలు పూర్తయ్యాయి.

10న నందిగామలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

సెప్టెంబర్ 10(ఆదివారం)న ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్ రామ్ అవగాహన కల్పిస్తారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. 150 మందికి అవకాశం ఉంటుందని నిర్వాహకులు బాలకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలకు.. 90281 85184, 64091 11427.

వచ్చే నెల 4 నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ

ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని సకశేరుక చీడల యాజమాన్య విభాగం సెప్టెంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వనుంది. తేనెటీగల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు, నిరుద్యోగ యువత ఈ శిక్షణకు అర్హులని ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వి. సునీత తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజన వసతులు కల్పిస్తామన్నారు. వివరాలకు.. 94948 75941.



బిగ్‌బాష్ లీగ్‌కు స్మృతి మంధాన దూరం!

భారత్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ కంటే ఎంతో ముందుగా ఆస్ట్రేలియాలో ప్రారంభమై అలరిస్తోన్న మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) ప్లేయర్ల తుది జాబితా (డ్రాఫ్ట్) సిద్ధమైంది. 2023–24 కొత్త సీజన్ కోసం సెప్టెంబర్ 3న లీగ్ ఫ్రాంచైజీలు ఈ జాబితాలో ఉన్న క్రికెటర్లతో ఒప్పందాలు చేసుకుంటాయి. భారత్ నుంచి 18 మంది క్రికెటర్లు ఈ డ్రాఫ్ట్‌లో ఉన్నారు. అయితే భారత స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తన పేరును ఇందులో నమోదు చేసుకోలేదు. గతంలో డబ్ల్యూబీబీఎల్‌లో స్మృతి బ్రిస్బేన్ హీట్, సిడ్నీ థండర్ జట్లకు ఆడింది.

వచ్చే 10-15 ఏళ్లలో 'క్రీడా భారత్'...

మరో పది, పదిహేనేళ్లలో దేశం 'క్రీడా భారత్'గా ఎదుగుతుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అన్నారు. చెస్‌లో ప్రజ్ఞానంద, బ్యాడ్మింటన్‌లో ప్రణయ్, అథ్లెటిక్స్‌లో నీరజ్ చోప్రా ప్రపంచ క్రీడా వేదికల్లో పతకాలతో మెరిశారు. దీనిపై స్పందించిన గావస్కర్ 'గతంలో కొన్ని క్రీడలే భారత్‌లో వెలుగొందేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర క్రీడలకు కవరేజీ, ప్రేక్షకాదరణ పెరిగాయి' అని అన్నారు.



నా లక్ష్యానికి పరిమితి లేదు

- ఇంకా మెరుగైన ప్రదర్శన ఇవ్వగలను
- ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా వ్యాఖ్య

రూ. 57 లక్షల 84 వేలు

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి నీరజ్ 70 వేల డాలర్ల (రూ. 57 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీ అందుకున్నాడు.



ఒలింపిక్స్ స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణం, ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ చాంపియన్, ఆసియా క్రీడల స్వర్ణం, కామన్వెల్త్ క్రీడల స్వర్ణం, జూనియర్ ప్రపంచ చాంపియన్... భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా అసాధారణ కెరీర్‌లో అందుకున్న అద్భుత విజయాలెన్నో. వాస్తవంగా ఈ ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకుంటే మేజర్ ఈవెంట్లలో అతను సాధించేందుకు ఇక ఏమీ మిగలనట్లే! కానీ నీరజ్ మాత్రం తాను ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉందని చెబుతున్నాడు. జావెలిన్‌ను మరింత బలంగా, మరింత దూరం విసరగలనని అతను చెబుతున్నాడు.

బుడాపెస్ట్ (హంగేరి): ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించిన ప్లేయర్‌గా కొత్త చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని వ్యాఖ్యానించాడు. పసిడి పతకం గెలిచినందుకు నీరజ్ చోప్రాకు 70 వేల డాలర్ల (రూ. 57 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ ఈవెంట్‌లో నీరజ్ పసిడి పతకం గెలిచాక మీడియాతో పంచుకున్న భావాలు అతని మాటల్లోనే...

- త్రోయర్లకు ఎప్పటికీ ఫినిషింగ్ లైన్ అనేదే ఉండదు అంటారు. మా చేతుల్లో జావెలిన్ ఉన్నంత వరకు ఎంత దూరమైన విసరగలం. మా లక్ష్యానికి పరిమితి లేదు. నేను ఎన్ని పతకాలు గెలిచినా ఇంకా ఎక్కువ దూరం బల్లెంను విసరాలనే ప్రేరణ అలాగే ఉంటుంది. ఈ పతకాల వల్ల నేను ఇప్పటికే అన్నీ సాధించానని అనుకోను. మరింత కష్టపడి నా దేశానికి మరిన్ని పతకాలు తీసుకొస్తా. పోడియంపై నా పక్కనే ఎవరైనా భారతీయులు నిలబడగలిగితే అది ఇంకా బాగుంటుంది.
- 90 మీటర్ల దూరం కూడా సాధ్యమే. అయితే సాధారణంగా దృష్టంతా గెలుపుపైనే ఉంటుంది. గత కొంత కాలంగా 90 మీటర్ల దూరంపై చర్చ జరుగుతోంది. ఈ ఏడాది సాధించగలననే అనుకున్నా గాయాల వల్ల కొంత ఇబ్బంది పడ్డా. అయితే ఈ విషయంపై ఒత్తిడి పెంచుకోదల్చుకోలేదు. అయితే ఒక ఈవెంట్‌లో అన్నింటికంటే పతకం గెలవడం ముఖ్యం. ఒక్కసారి 90 మీటర్ల మార్క్ అందుకుంటే అదే నిలకడను కొనసాగించాలని నేను నమ్ముతా. ఒలింపిక్ క్రీడల తర్వాత వరల్డ్ చాంపియన్ ఎలాగైనా గెలవాలని భావించా. ఇప్పుడు ఆ కల నిజమైంది.
- భారత ఆల్‌టైమ్ గ్రేట్ అథ్లెట్ అని నా గురించి నేను ఏనాడూ చెప్పుకోలేదు. భవిష్యత్తులోనూ ఎప్పుడూ చెప్పను. వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణం లేదని ఇప్పటి వరకు కొందరు అన్నారు. ఇప్పుడు దానిని సాధించాను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. దానిపైనే దృష్టి పెడతాను తప్ప ఇలాంటి చర్చల్లోకి రాను. నిజంగా గ్రేటెస్ట్ ఎలా ఉండాలని అడిగితే మాత్రం నేను ఆరాధించే చెక్ రిపబ్లిక్ త్రోయర్ జాన్ జెలెజ్నీలాగా ఉండాలని చెబుతా.
- నా దృష్టిలో ఒలింపిక్స్‌తో పోలిస్తే ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనే గట్టి పోటీ ఉంటుంది. టాప్ అథ్లెట్లంతా దీని కోసమే సన్నద్ధమై వస్తారు. భవిష్యత్తులో భారత అథ్లెట్లు మరిన్ని విజయాలు సాధిస్తారు. పాకిస్తాన్ ఆటగాడు అర్షద్ నదీమ్‌తో పోటీని ప్రత్యేకంగా చూడవద్దు. మా ఆటను భారత్, పాకిస్తాన్ మధ్య పోరుగా కొందరు చిత్రీకరిస్తున్నారు. నా ఫోన్‌లో కూడా అంతా భారత్, పాక్ గురించే మెసేజ్‌లు ఉన్నాయి. మన దేశంలో ఇలాంటి వాతావరణం సహజమే. కానీ దీనిని మా ఇద్దరి మధ్య పోటీగా చూడవద్దు. రెండు దేశాల పేర్లతో ఒత్తిడి పెంచవద్దు. ఈవెంట్‌లో ఇతర ప్రత్యర్థులందరినీ దృష్టిలో ఉంచుకొని సిద్ధం కావాల్సి ఉంటుంది. సరిగా చూస్తే యూరోపియన్లతో పోటీ పడి రెండు దేశాలు విజయాలు సాధించడం మంచి పరిణామం.

18 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పతకాల పట్టికలో భారత్ స్థానం. ఒక్కో స్వర్ణ పతకం గెలిచిన బహ్రెయిన్, బుర్కినా ఫాసో, డొమినికన్ రిపబ్లిక్, వెనిజులా, సెర్బియా దేశాలతో కలిసి భారత్ సంయుక్తంగా 18వ ర్యాంక్‌లో నిలిచింది. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీరజ్ చోప్రా రజత పతకం కారణంగా భారత జట్టు మరో ఐదు దేశాలతో కలసి సంయుక్తంగా 33వ స్థానంలో నిలిచింది.

15 ఇప్పటి వరకు 19 సార్లు ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈసారీ అమెరికా తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ పతకాల పట్టికలో 15వసారి అగ్రస్థానంలో నిలిచింది. అమెరికా 12 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తం 29 పతకాలతో టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.

195 ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న దేశాలు. మొత్తం 2100 మంది అథ్లెట్‌లు పోటీపడ్డారు. 120 దేశాల నుంచి నాలుగు లక్షల మంది ప్రేక్షకులు వచ్చి ఈ మెగా ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

46 తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కనీసం ఒక్క పతకమైనా సాధించిన దేశాలు. జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ రజత పతకంతో ఈ పోటీల చరిత్రలో తొలిసారి పాకిస్తాన్ ఖాతాలో తొలి పతకం చేరింది.

2019 ప్రపంచకప్‌కు ముందులాగే...

ఒత్తిడికి దూరంగా ఉండాలనుకుంటున్నా • భారత కెప్టెన్ రోహిత్ శర్మ



బెంగళూరు: నాలుగేళ్ల క్రితం ఇంగ్లండ్ గడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ హవా సాగింది. ఈ టోర్నీలో 5 సెంచరీలతో 648 పరుగులు సాధించి అతను అగ్రస్థానంలో నిలిచాడు. ఆ సమయంలో తాను మానసికంగా ఎంతో ప్రశాంత స్థితిలో ఉన్నానని, ఇప్పుడు కూడా అదే తరహాలో ఉండాలని కోరుకుంటున్నట్లు రోహిత్ చెప్పాడు. గత టోర్నీతో పోలిస్తే ఈసారి అతను కెప్టెన్ హోదాలో బరిలోకి దిగబోతున్నాడు. 'సానుకూలమైనా, ప్రతికూలమైనా ఎలాంటి బయటి అంశాలు నాపై ప్రభావం చూపించకుండా జాగ్రత్త పడుతున్నా. ఏమీ పట్టించుకోకుండా ప్రశాంతంగా ఉండటం ఎంతో ముఖ్యం. సరిగ్గా చెప్పాలంటే 2019 ప్రపంచకప్‌కు ముందు ఎలా ఉన్నానో అలాంటి మానసిక దృక్పథం ఇప్పుడు కావాలి. ఆటగాడిగా, వ్యక్తిగతంగా కూడా అప్పటి నా పరిస్థితిని గుర్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నా. అలాగే ఉండాలని భావిస్తున్నా. అప్పుడు అన్నీ చక్కగా కుదిరాయి. అంతా కలిసిరావడంతో ఎంతో బాగా సన్నద్ధమయ్యా' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. భారత క్రికెట్‌పై తన ముద్ర ఏమిటనేది తాను చెప్పనని, అది అభిమానులు నిర్ణయిస్తారన్న రోహిత్... జట్టు సెలక్షన్ విషయంలో మాత్రం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని అన్నాడు. 'వరల్డ్ కప్ టీమ్‌లో స్థానం దక్కకపోతే ఎంత బాధగా ఉంటుందో నాకు బాగా తెలుసు. 2011లో చోటు కోల్పోయినప్పుడు యువరాజ్ సింగ్ నన్ను ఓదార్చి ఏం పర్లేదు, భవిష్యత్తు బాగుంటుందని భరోసా ఇచ్చాడు. నిజంగానే ఆ తర్వాత నేను గొప్పగా రాణించాను. ఇప్పుడు కూడా ఎవరినైనా తప్పిస్తే అందుకు బలమైన కారణం ఉంటుందే తప్ప వ్యక్తిగత ఇష్టాయిష్టాలు ఉండవు' అని రోహిత్ స్పష్టం చేశాడు.

భారత మహిళల హాకీ జట్టుకు టైటిల్



సలాలా (ఒమన్): మహిళల హాకీ ఆసియా కప్ ఫైవ్స్ (ఐదుగురు ఆడే) టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. తద్వారా 2024 ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందింది. సోమవారం జరిగిన ఫైనల్లో భారత్ 7–2 గోల్స్ తేడాతో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. భారత్ తరఫున జ్యోతి, మరియానా కుజుర్ రెండు గోల్స్ చొప్పున సాధించగా... కెప్టెన్ నవ్‌జ్యోత్ కౌర్, మోనికా టొప్పో, మహిమా చౌదరీ ఒక్కో గోల్ చేశారు. ఐదుగురు సభ్యులతో కూడిన జట్లు తలపడే తొలి హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ వచ్చే జనవరి 24 నుంచి 27 వరకు మస్కట్‌లో జరుగనుంది.

'ప్రసారం' కోసం ముక్కోణపు పోటీ

క్రికెట్ హక్కుల బరిలో స్టార్, సోనీ, వయాకామ్ • ఈ నెల 31న ఆన్‌లైన్ వేలం

ముంబై: భారత్‌లో జరిగే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల ప్రసార హక్కుల కోసం ఈ నెల 31 బీసీసీఐ ఇ–వేలం నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. బోర్డు ప్రతిపాదిత నియమ నిబంధనల్ని పూర్తిచేసుకున్న మూడు ప్రముఖ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు ఈ ఆన్‌లైన్ వేలానికి అర్హత పొందాయి. డిస్నీ స్టార్, సోనీ స్పోర్ట్స్, వయాకామ్ 18లు టీమిండియా సిరీస్‌ల మీడియా హక్కులు పొందేందుకు పోటీపడుతున్నాయి. దేశీయ బ్రాడ్‌కాస్టర్లు జీ, ఫ్యాన్‌కోడ్ అంతర్జాతీయ కంపెనీలైన గూగుల్, అమెజాన్‌లు కూడా ఈ మీడియా హక్కుల కోసం ప్రాథమికంగా దరఖాస్తు చేసుకున్నాయి. అయితే సోమవారం సాంకేతిక బిడ్‌లు దాఖలు చేసే అర్హతను ఆ నాలుగు సంస్థలు పొందలేకపోయాయి. దీంతో సంప్రదాయ ప్రసారకర్తలు సోనీ, స్టార్‌లతో కొత్త బ్రాడ్‌కాస్టర్ 'వయాకామ్ 18' పోటీకి రెడీ అయ్యింది. గతేడాది ఐపీఎల్ హక్కులతో (పాక్షిక) రిలయన్స్‌కు చెందిన 'వయాకామ్ 18' రేసులోకి వచ్చింది.

సంచలనంతో షురూ

తొలి రౌండ్‌లోనే ఓడిన ఎనిమిదో సీడ్ మరియా సాకరి


సాకరి

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ సంచలన ఫలితంతో మొదలైంది. మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్) తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. ప్రపంచ 71వ ర్యాంకర్ రెబెకా మసరోవా (స్పెయిన్) 6–4, 6–4తో ఎనిమిదో ర్యాంకర్ సాకరిపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. తొమ్మిదోసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న సాకరి 2016 తర్వాత ఈ టోర్నీలో మళ్లీ తొలి రౌండ్‌లో ఓడిపోయింది. మరోవైపు టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) 6–0, 6–1తో రెబెకా (స్వీడన్)పై, మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్) 6–1, 6–2తో ఫియోనా ఫెరో (ఫ్రాన్స్)పై, 15వ సీడ్ బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) 6–2, 6–4తో రఖిమోవా (రష్యా)పై నెగ్గి రెండో రౌండ్‌కు చేరారు.

సినిమా

ఇంటర్వ్యూ

'నిన్ను రోడ్డు మీద చూసినది..' అంటూ కుర్రాళ్లు ఫ్లాట్ అయ్యేంత గ్లామర్... మితి మీరిన ఆత్మవిశ్వాసానికి.. అహంభావానికి చిరునామా... ఓ నీలాంబరి. భక్తులను రక్షించే తల్లి... ఓ అమ్మోరు. నా మాటే శాసనం.. ఓ శివగామి... ఇలా ఏ పాత్ర చేస్తే అందులో ఒదిగిపోయారు రమ్యకృష్ణ. గ్లామరస్ రోల్స్ చేస్తున్నప్పుడే 'నరసింహ'లో నెగటివ్ షేడ్ ఉన్న నీలాంబరి, 'అమ్మోరు'లో అమ్మవారిగా మెప్పించారామె. ఇక 'బాహుబలి'లో శివగామిగా కనబర్చిన నటన అద్భుతం. ఇటీవల రిలీజైన 'జైలర్'లో రజనీకాంత్ భార్యగా నటించారు. అలాగే భర్త కృష్ణవంశీ డైరెక్షన్‌లో 'రంగ మార్తాండ' చేశారు. ఇక 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రమ్యకృష్ణ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

జీవితంలో మార్పు ఒక్కటే స్థిరమైనది - రమ్యకృష్ణ



'పడయప్ప' ('నరసింహ')లో నీలాంబరిగా నరసింహ (రజనీకాంత్ పాత్ర)ని ఎదిరించారు. చాలా ఏళ్ల తర్వాత 'జైలర్'లో రజనీ కాంబినేషన్‌లో సాఫ్ట్ క్యారెక్టర్ చేయడం గురించి..

ఇన్నేళ్ల తర్వాత రజనీగారి కాంబినేషన్‌లో 'జైలర్' చేయడం, అది సూపర్ హిట్ కావడం నా జీవితంలో మరచిపోలేను. 'జైలర్'లో ఎందుకంత సున్నితమైన పాత్ర చేశారని అందరూ అనుకోవచ్చు. అయితే మళ్లీ రజనీగారితో నీలాంబరిలాంటి పాత్ర వస్తేనే చేయాలనుకుని 'జైలర్'లో విజయలాంటి మంచి పాత్రని వదులుకోలేను కదా.

ఈ 24 ఏళ్లలో రజనీగారు, మీరు ఆర్టిస్టులుగా ఎదిగారు.. వ్యక్తులుగా మారారు. ఆయనలో మీరు గమనించిన మార్పు?

'జైలర్' షూటింగ్ మొదటి రోజే 'పడయప్ప' చేసి అప్పుడే 24 ఏళ్లు అయిపోయిందా అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేస్తే.. అవునన్నాను. అప్పటికీ, ఇప్పటికీ ఆయనలో అదే ఉత్సాహం, అదే నిరాడంబరత, అంతే నిశ్శబ్దం.

'జైలర్' తెలుగు–తమిళంలో చాలా పెద్ద హిట్ అయింది. ఈ హిట్ మీ కెరీర్‌కి ఎంతవరకు అడ్వాంటేజ్ అవుతుంది?

యాక్టర్స్ కెరీర్‌కి హిట్ అనేది వంద శాతం అవసరం, తప్పనిసరి. అయితే హిట్ మాత్రమే కెరీర్ కాదు. మంచి పాత్రలు కూడా కావాలి. కొన్నిసార్లు మంచి పాత్రలుంటాయి. అభినందనలు వస్తాయి కానీ వసూళ్లు ఉండవు. అలాగే ఓ కాంబినేషన్ మన కెరీర్‌కి ఎంతవరకు ఉపయోగపడుతుంది? అన్నది ముఖ్యం. వంద శాతం నా కెరీర్‌కి రజనీకాంత్‌గారి కాంబినేషన్, 'జైలర్' హిట్ ఉపయోగపడతాయి.

'రంగ మార్తాండ', 'జైలర్' సినిమాల్లో పాత్ర పరంగా మీకు సంతృప్తి ఇచ్చిన మూవీ ఏది?

'రంగ మార్తాండ' లాంటి నటనకు ఆస్కారం ఉన్న సినిమా హిట్ అయినా, అవకపోయినా మనసుకు సంతృప్తి ఉంటుంది. అయితే 'జైలర్' లాంటి హిట్స్ వస్తే 'రంగ మార్తాండ' లాంటి సినిమాలు చేసే అవకాశాలు మరిన్ని వస్తాయి.. నా కెరీర్ కూడా మరింత విస్తరిస్తుంది. అయితే 'రంగ మార్తాండ' లాంటి సినిమాలు కూడా హిట్ కావాలి. కొన్నిసార్లు అలాంటి సినిమాలకు ఎక్కువ అభినందనలు వస్తాయి.. వసూళ్లు రాకపోవచ్చు. ఆర్టిస్ట్‌లకు అభినందనలూ కావాలి.. కలెక్షన్స్ కూడా కావాలి (నవ్వుతూ).

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో 'క్వీన్' వెబ్ సిరీస్ తర్వాత కొత్త సిరీస్‌లు చేయడం లేదు. ఎందుకు?

'క్వీన్' తర్వాత 'క్వీన్ 2' షూటింగ్ 70 శాతం పూర్తి చేశాం. మిగిలిన 30 శాతం షూటింగ్ కొన్ని కారణాల వల్ల ఆలస్యమవుతోంది. 'క్వీన్' కంటే 'క్వీన్ 2' అద్భుతంగా వచ్చింది. ఇక సినిమాలతో బిజీగా ఉండటంవల్ల వేరేవి ఒప్పుకోలేకపోతున్నాను.

అప్పట్లో మీ తరం వాళ్లకి సినిమాలు తప్ప వేరే ఏమీ లేవు. కానీ, ఈ తరం వాళ్లకి సినిమాలు, సీరియల్స్, వెబ్ సిరీస్, టీవీ షోలు.. ఇలా చాలా ఉన్నాయి. ఈ మార్పు మీకు ఎలా అనిపిస్తోంది?

సోషల్ మీడియాలోని చాలామంది ఇన్‌ఫ్లుయెన్సర్స్‌లో నటీనటులకంటే ఎక్కువ పాపులర్ అవుతున్నవాళ్లు ఉన్నారు. ఇవన్నీ చూస్తుంటే ప్రపంచం ఎంతలా మారింది? అనిపిస్తోంది. మనం కూడా మారుతున్న ప్రపంచంతో పోటీ పడుతూ ముందుకు సాగాలి.

అయితే ఇప్పుడొస్తున్న కథానాయికలకు మీలా 20, 25 ఏళ్ల లాంగ్విటీ ఉండటంలేదు కూడా...

మాకు తప్పులు చేయడానికి, దిద్దుకోవడానికి టైమ్ ఉండేది. ఇప్పుడు ఆ టైమ్ లేదు. వస్తున్నారు.. వెళుతున్నారు.. కానీ మేం అన్ని సంవత్సరాలకు సంపాదించుకున్నది ఇప్పుడు సక్సెస్ అయితే తక్కువ టైమ్‌కే సంపాదించుకుని వెళ్లిపోతున్నారు. టైమ్ ఎలా మారుతుందో దాన్నిబట్టి అన్నీ మారుతున్నాయి. దాంతో పాటు మనం మారాలి. జీవితంలో స్థిరమైనది ఏది అంటే.. అది మార్పు మాత్రమే. ఆ మార్పుకి మనం అడ్జస్ట్ అవ్వాలి. దాంతో పాటు కొనసాగాలి. మనం హ్యాపీగా ఉన్నామనుకోండి అది మారుతుంది. ఒకవేళ దుఃఖంలో ఉన్నాం అనుకోండి అది కూడా మారుతుంది. సో.. ఏదీ నిరంతరంగా ఉండదు.. మార్పు సహజం.

మీ అబ్బాయి రుత్విక్ ఏం చేస్తున్నాడు... హీరో అవుతాడా? తన నాన్న (కృష్ణవంశీ)లా డైరెక్టర్ అవుతాడా?

రుత్విక్‌కి ఇప్పుడు 18 ఏళ్లు. ప్రస్తుతానికి ఫోకస్ అంతా చదువు మీదే. వాడికేం అవ్వాలో వాడికే తెలియదు.. నాకేం తెలుస్తుంది (నవ్వుతూ). తనేం కావాలో రుత్విక్ తెలుసుకుని, మాతో చెబితే మేం సపోర్ట్ చేస్తాం.

ఈ మధ్య రోజాగారు, మీరు కలుసుకున్నారు.. మీ ఇద్దరి అనుబంధం గురించి?

రోజా నాకు ఎప్పట్నుంచో తెలుసు. అప్పట్లో ఎలా ఉండేవాళ్లమో ఇప్పుడూ అలానే ఉన్నాం. చాలా సంవత్సరాల తర్వాత నేను తిరుపతి వెళ్లాను. తనే నాకు దర్శనం ఏర్పాటు చేసింది. అద్భుతమైన దర్శనం దక్కింది. సో.. తనకి థ్యాంక్స్ చెప్పడానికి వెళ్లాను.

ఇద్దరూ సినిమాలు, రాజకీయాల గురించి మాట్లాడుకున్నారా?

రెండింటి గురించి మాట్లాడుకోలేదు. లైఫ్ గురించి మాట్లాడుకున్నాం. నా అబ్బాయి ఏం చేస్తున్నాడు.. తన పిల్లలు ఏం చేస్తున్నారు? అనే విషయాలు మాట్లాడుకున్నాం. ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచి ఇంత బిజీగా ఎలా ఉండ గలుగుతున్నావ్ అని అడిగాను. ఇలాంటివే...

రోజాగారితో మాట్లాడాక మీక్కూడా పాలిటిక్స్ పై ఏమైనా ఆసక్తి కలిగిందా? మీరూ పాలిటిక్స్‌లోకి వచ్చే అవకాశం ఉందా?

పాలిటిక్స్ పై ఇంట్రస్ట్ అనేది ఒకర్ని చూసి వచ్చేది కాదు. ఎవరికి వాళ్లకే ఉండాలి. కొందరికి ఇంట్రస్ట్ ఉంటుంది.. కొందరికి ఉండదు. బట్.. రోజా చాలా హార్డ్ వర్కింగ్ పర్సన్. నేను కళ్లారా చూశాను.

భవిష్యత్తులో ఏదైనా పార్టీ నుంచి మీకు ఆఫర్ వస్తే పాలిటిక్స్‌లోకి ఎంటర్ అవుతారా?

ఏమో.. నాకు తెలియదు. వచ్చినప్పుడు చూద్దాం.

ఈ సినిమా మరో ఎత్తు - విశాల్



''ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేశాను. ప్రేక్షకులు ఆదరిస్తూ వచ్చారు.. వారి ఆదరాభిమానాలతోనే నేనీ స్థాయికి వచ్చాను'' అని హీరో విశాల్ అన్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో విశాల్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మార్క్ ఆంటోని'. ఎస్‌జే సూర్య, సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఎస్. వినోద్ కుమార్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 15న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. కాగా నేడు విశాల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ఈ పుట్టినరోజు నాకెంతో ప్రత్యేకం. ఎందుకంటే 'మార్క్ ఆంటోని' వంటి వైవిధ్యమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలన్నీ ఒక ఎత్తు అయితే ఇది మరో ఎత్తు. ఇందులో రెండు విభిన్నమైన పాత్రలు చేశా. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది'' అన్నారు.

కామెడీ అనుకున్నా.. మాస్‌లా ఉంది - 'దిల్' రాజు


● మన్నారా చోప్రా, శివకుమార్, 'దిల్' రాజు, రవికుమార్, రాజ్ తరుణ్

''తిరగబడర సామీ' కామెడీ సినిమా అనుకున్నా. కానీ, టీజర్ చూస్తుంటే ఫుల్ మాస్ సినిమాలా ఉంది. రాజ్ తరుణ్ యాక్షన్ ఇరగదీసినట్లు కనిపిస్తోంది. రాజ్ తరుణ్, రవి కుమార్‌కి ఇది మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది. టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. రాజ్ తరుణ్ హీరోగా, మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా హీరోయిన్లుగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడర సామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాపై మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని 'దిల్' రాజు విడుదల చేశారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''రవికుమార్ చౌదరిగారు ఈ సినిమాతో నాలో కొత్త కోణం (యాక్షన్) చూపించారు. సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ''కొన్నేళ్ల గ్యాప్ తర్వాత తెలుగులో నాకు మళ్లీ పునర్జన్మ ఇచ్చిన శివకుమార్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు ఏఎస్ రవికుమార్ చౌదరి. ''త్వరలో రిలీజ్ కానున్న మా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు మల్కాపురం శివకుమార్. నిర్మాత బెక్కం వేణుగోపాల్, దర్శకుడు సముద్ర, నటుడు తాగుబోతు రమేష్ తదితరులు మాట్లాడారు.

డైరెక్టర్‌గా హీరో విజయ్ తనయుడు

తమిళ స్టార్ హీరో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ విజయ్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సుభాస్కరన్ మాట్లాడుతూ– ''కొత్త ఆలోచనలతో ఉండే యంగ్ టాలెంటెడ్ పర్సన్స్ ఎప్పుడూ గేమ్ చేంజర్స్ అవుతారని మా నమ్మకం. జాసన్ సంజయ్ విజయ్ చెప్పిన యూనిట్ పాయింట్ మాకు నచ్చింది. సంజయ్ లండన్‌లో స్క్రీన్ రైటింగ్‌లో బీఏ (హానర్స్), టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ ప్రొడక్షన్ డిప్లొమా పూర్తి చేశారు. ఈ చిత్రంలో ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పని చేయబోతున్నారు'' అన్నారు. ''లైకా ప్రొడక్షన్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలో నా ఫస్ట్ మూవీ చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఈ సంస్థకు నా స్క్రిప్ట్ నచ్చటం నాకు హ్యాపీగా ఉంది'' అన్నారు జాసన్ సంజయ్ విజయ్.


● సుభాస్కరన్, జాసన్ సంజయ్

సారా ప్రేమలో టైగర్

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్ (నటి కృతీ సనన్ చెల్లెలు), గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. 'ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2' వంటి వరుస విజయాలు అందుకున్న అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీలో సారా పాత్రలో నటిస్తున్నారు నూపుర్. 'టైగర్ లవ్ సారా' అంటూ సోమవారం నూపుర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''రవితేజ కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. అక్టోబర్ 20న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. అనుపమ్ ఖేర్, రేణూ దేశాయ్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్. మది, సమర్పణ: తేజ్ నారాయణ్ అగర్వాల్, సహనిర్మాత: మయాంక్ సింఘానియా.


● నూపుర్ సనన్

ప్రేమకథ


● నేహా, రవితేజ

రవితేజ నున్న, నేహా జురెల్ జంటగా సత్య రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి –నాయుడు గారి అబ్బాయి'. రామిసెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు నిర్మించారు. సంగీత దర్శకుడు కోటి తనయుడు రోషన్ సాలూరి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఐ లవ్ యు..' అనే లిరికల్ సాంగ్‌ని విడుదల చేశారు. రెహమాన్ సాహిత్యం అందించిన ఈ పాటని యాజిన్ నిజర్, నూతన్ మోహన్ పాడారు. ''అందమైన ప్రేమకథతో రూపొందిన చిత్రం ఇది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులనూ అలరిస్తుంది'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
29-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
110	40
64,997	19,306

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,692	▲	101
డోజోన్స్	34,569	▲	222
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,339	▲	5
డాక్స్	15,792	▲	167
షాంఘై	3,064	▽	18
నికాయ్	32,170	▲	546

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,667
బంగారం (99.5 స్వచ్ఛత)	58,432
వెండి (కిలో)	73,636


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	81.80	83.47
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	102.44	105.82
€	యూరో	ఎకటి	87.80	90.88
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	55.54	57.28
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	52.06	54.35
S$	సింగపూర్ డాలర్	ఎకటి	59.99	61.94
SAR	సౌదీ రియాల్	[illegible]	21.08	22.70
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.60	23.39
¥	చైనా యువాన్	[illegible]	10.21	12.28

జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేస్తోంది..

వినాయక చవితికి షురూ

- బీమాలోకి జియో ఫైనాన్షియల్స్
- సీబీజీ ప్లాంట్ల భారీ విస్తరణ
- 2026 నాటికి బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ
- రిలయన్స్ ఏజీఎంలో చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడి
- బోర్డులోకి వారసుల ఎంట్రీ



"అత్యధిక డిమాండ్ ఉన్నవి, అనేక దశాబ్దాల పాటు ఆరోగ్యకరమైన వృద్ధి సాధించగలిగేవి అయిన వ్యాపారాలను మేము ఎంచుకున్నాం. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలను నిర్మించగలిగాం. మా మూడు వృద్ధి చోదకాలు .. (ఓ2సీ, రిటైల్, జియో డిజిటల్ సర్వీసులు) మరింత విలువ జోడించగలవు. కొత్తగా మా నాలుగో వృద్ధి ఇంజిన్ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా వీటికి తోడుగా చేరింది.
- ముకేశ్ అంబానీ, రిలయన్స్ చైర్మన్

ముంబై: పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీ వృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రణాళికలు ప్రకటించింది. ఇందులో భాగంగా వినాయక చవితి కల్లా జియో ఎయిర్‌ఫైబర్‌ను అందుబాటులోకి తేనుంది. అలాగే, జియో ఫైనాన్షియల్స్ విభాగం ద్వారా బీమా ఉత్పత్తులను ఆవిష్కరించనుంది. వచ్చే అయిదేళ్లలో 100 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 46వ సర్వ సభ్య సమావేశంలో (ఏజీఎం) చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయాలు ప్రకటించారు. అదే క్రమంలో వారసత్వ ప్రణాళికలను కూడా వెల్లడించారు. ఆయన ముగ్గురు సంతానం (ఆకాశ్, ఈషా, అనంత్) కంపెనీ బోర్డులో నియమితులైనట్లు పేర్కొన్నారు. అలాగే, 2024 ఏప్రిల్ 19తో తన పదవీకాలం ముగియనున్నప్పటికీ.. మరో అయిదేళ్ల పాటు చైర్మన్‌గా కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. ఏజీఎంలో మరిన్ని విశేషాలు..

ఎయిర్‌ఫైబర్‌తో వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్..

సెప్టెంబర్ 19న వినాయక చవితి సందర్భంగా జియో ఎయిర్‌ఫైబర్ సర్వీసులు ప్రారంభమవుతాయి. ఇది వైర్లు అవసరం లేని 5జీ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులాంటిది. నెట్ కనెక్టివిటీకి ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు .. 5జీ నెట్‌వర్క్‌ను, అధునాతన వైర్‌లెస్ టెక్నాలజీలను ఉపయోగించుకుని ఇది వరుసలో చిట్టచివర్న ఉన్న వారికి కూడా బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందుబాటులోకి తేగలదని ముకేశ్ అంబానీ తెలిపారు. ఆప్టికల్ ఫైబర్‌తో రోజూ 15,000 ప్రాంగణాలను కనెక్ట్ చేయగలుగుతుంటే, జియోఎయిర్‌ఫైబర్ దీనికి పది రెట్లు అధికంగా కనెక్ట్ చేయగలదు. తద్వారా 20 కోట్ల గృహాలు, ప్రాంగణాలకు జియో మరింత చేరువ కాగలదు. ఈ సందర్భంగా జియో ట్రూ5జీ డెవలపర్ ప్లాట్‌ఫాంను కూడా రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రకటించారు. రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో ఏర్పాటు చేసే తొలి జియో ట్రూ5జీ ల్యాబ్‌లో టెక్నాలజీ భాగస్వాములు, ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లు .. వివిధ పరిశ్రమలకు అవసరమైన సొల్యూషన్స్‌ను రూపొందించవచ్చు. వాటిని పరీక్షించవచ్చు. అటు, కృత్రిమ మేధ (ఏఐ) ప్రయోజనాలను అందరికీ, అన్నిచోట్ల అందుబాటులోకి తెచ్చేందుకు జియో ప్లాట్‌ఫామ్స్ కృషి చేస్తోందని ముకేశ్ అంబానీ చెప్పారు. డిసెంబర్ ఆఖరు నాటికి దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ విస్తరణ పూర్తి చేసే దిశగా పనులు సాగుతున్నాయని తెలిపారు. జియో సినిమా వినోదానికి దేశీయంలోనే అతి పెద్ద డిజిటల్ వేదికగా మారిందని ఆయన పేర్కొన్నారు.

సీబీజీ ప్లాంట్లు.. గిగా ఫ్యాక్టరీలు..

2035 నాటికి కర్బన ఉద్గారాల విషయంలో తటస్థ స్థాయిని సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. జామ్‌నగర్‌లో రెండు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) డెమో యూనిట్లను నెలకొల్పాక, కేవలం 10 నెలల వ్యవధిలోనే ఉత్తర్ ప్రదేశ్‌లోని బారాబంకీలో వాణిజ్యావసరాల కోసం తొలి సీబీజీ ప్లాంటును ఏర్పాటు చేసినట్లు అంబానీ చెప్పారు. వీటిని త్వరితగతిన 25కి, అటుపైన వచ్చే అయిదేళ్లలో 100కు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. 2026 నాటికి బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ నెలకొల్పే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. సోలార్ ప్యానెళ్లు, బ్యాటరీల తయారీ కోసం జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో రూ. 75,000 కోట్లతో నాలుగు గిగాఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బీమాలోకి జేఎఫ్ఎస్...

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (జేఎఫ్ఎస్) బీమా రంగంలోకి విస్తరించనున్నట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. ఇది సరళమైన ఆరోగ్య, జీవిత, సాధారణ బీమా పాలసీలను అందిస్తుందని పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారంలోకి విస్తరించేందుకు బ్లాక్‌రాక్‌తో కలిసి జేఎఫ్ఎస్ జాయింట్ వెంచర్‌ను ప్రకటించింది. టెలికం విభాగం జియోకి ఉన్న 45 కోట్ల మంది మొబైల్ ఫోన్ యూజర్లకు తమ ఉత్పత్తులను విక్రయించే యోచనలో ఉంది.

టాప్ 4లో రిటైల్..



పలు అంతర్జాతీయ దిగ్గజాలు రిలయన్స్ రిటైల్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ముకేశ్ అంబానీ చెప్పారు. ఒకవేళ దీన్ని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసి ఉంటే ప్రస్తుత వేల్యుయేషన్ ప్రకారం టాప్ 4 లిస్టెడ్ సంస్థల్లో రిటైల్ కూడా ఒకటిగా ఉండేదని ఆయన తెలిపారు. "2020 సెప్టెంబర్‌లో నిధులు సమీకరించినప్పుడు రిటైల్ వేల్యుయేషన్ రూ. 4.28 లక్షల కోట్లుగా ఉంది. మూడేళ్ల కన్నా తక్కువ వ్యవధిలోనే ఇది రెట్టింపయింది. రూ. 8.278 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో ఇటీవలే ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) 1 శాతం వాటాను కొనుగోలు చేసింది. నాణ్యత, నవకల్పన, కస్టమరు ప్రధానంగా కార్యకలాపాలు నిర్వహించడం, పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోగలుగుతుండటం వంటి సామర్థ్యాలకు ఇది నిదర్శనం" అని అంబానీ తెలిపారు. అటు రూ. 22 కోట్లకు కొనుగోలు చేసిన సాఫ్ట్‌డ్రింక్ క్యాంపా కోలాను ఆసియా, ఆఫ్రికాతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు కూడా తీసుకెళ్లనున్నట్లు ఈషా అంబానీ తెలిపారు.

వారసత్వ ప్రణాళికలు..



ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన వివిధ వ్యాపార విభాగాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముకేశ్ అంబానీ ముగ్గురు సంతానం తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులో చేరారు. నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వారు ఈ హోదాను 'కష్టపడి సంపాదించుకున్నారని' అంబానీ తెలిపారు. "ఈషా, ఆకాశ్, అనంత్‌లో నేను, మా తండ్రిగారు ధీరుభాయ్ అంబానీ నాకు కనిపిస్తారు. ధీరుభాయ్‌లోని ఆ మెరుపు వారిలో నాకు కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జియో ఇన్ఫోకామ్‌ను ఆకాశ్, రిటైల్ వ్యాపారాన్ని ఆయన కవల సోదరి ఈషా (31), కొత్త ఇంధన వ్యాపార విభాగాన్ని అనంత్ (27) పర్యవేక్షిస్తున్నారు. 2002లో ధీరుభాయ్ మరణానంతరం సోదరుడు అనిల్ అంబానీతో వ్యాపార పంపకాలపరంగా వివాదం తలెత్తిన నేపథ్యంలో ముకేశ్ తాజా వారసత్వ ప్రణాళికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, రిలయన్స్ ఫౌండేషన్ కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టే ఉద్దేశంతో ముకేశ్ సతీమణి నీతా అంబానీ రిలయన్స్ బోర్డు నుంచి తప్పుకున్నారు. అయితే, ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా శాశ్వత ఆహ్వానితురాలు హోదాలో ఆమె బోర్డు సమావేశాలన్నింటికి యథాప్రకారంగా హాజరవుతారు.

టీబీజెడ్‌లో 'మంగళ 2023 కలెక్షన్'



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ టీబీజెడ్ 'మంగళ 2023 కలెక్షన్' ఆవిష్కరించింది. పంజాగుట్ట షోరూంలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతం వేడుకలో సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ ఈ కొత్త కలెక్షన్ విడుదల చేసింది. "భారతదేశ సంస్కృతి స్ఫూర్తితో తీర్చిదిద్దిన ఈ బంగారు వజ్రాభరణాలు ఏ సందర్భంలో ధరించినా ప్రత్యేకత చాటుతాయి. ఆవిష్కరణ కార్యక్రమంలో భాగం కావడం గౌరవంగా ఉంది" అని రకుల్ తెలిపారు. పంజాగుట్ట స్టోర్ పునః ప్రారంభంతో భాగ్యనగరంలో తమ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని టీబీజెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ అభిషేక్ మాలూ ఆశించారు.

రెండు రోజుల తర్వాత లాభాలు

- కలిసొచ్చిన ప్రపంచ సానుకూలతలు
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ర్యాలీ
- 65 వేల స్థాయి చేరువలో సెన్సెక్స్
- 19,300 పైకి నిఫ్టీ



ముంబై: రెండు రోజుల వరుస నష్టాల తర్వాత సోమవారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు(1%)రాణించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 110 పాయింట్లు పెరిగి 64,997 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 40 పాయింట్లు బలపడి 19,306 వద్ద నిలిచింది. ఉదయం అతి స్వల్ప లాభంతో మొదలైన సెన్సెక్స్ ట్రేడింగ్‌లో 327 పాయింట్లు ఎగసి 65,213 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, ఆటో, రియల్టీ, ఇన్ఫ్రా, క్యాపిటల్ గూడ్స్, టెలికం, విద్యుత్ రంగాల షేర్లు లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విష్ణు ప్రకాశ్ ఆర్ పుంగ్లియా ఐపీఓ చివరి రోజు నాటికి 87.81 రెట్లు అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.19 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయగా మొత్తం 192 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారులు 171.69 రెట్లు, సంస్థాగతేతర పెట్టుబడిదారులు 111.02 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు 32 రెట్లు సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.
- టెలికం, రిటైల్ వ్యాపార విభాగాల ఐపీఓల నిర్వహణపై యాజమాన్యం నుంచి సరైన స్పష్టత కొరవడడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆర్ఐఎల్ ఒకశాతం షేర నష్టపోయి 2442 వద్ద, జియో ఫైనాన్స్ షేరు 0.30% పతనమై రూ.212 వద్ద నిలిచాయి.
- ఆర్థిక సంవత్సరం 2023 గానూ ప్రతి షేరుపై రూ.2 డివిడెండ్‌ను ప్రకటించడంతో ప్రభుత్వ రైల్వే సంస్థ ఐఆర్‌సీటీసీ షేరు 3% లాభపడి రూ.678 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతం లాభపడి రూ.684 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఎన్ఎస్ఈ కరెన్సీ డెరివేటివ్స్ మంగళవారం నాటికి 15 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఇప్పటి వరకు రూ.609 లక్షల కోట్ల విలువైన 2,000 కోట్ల కాంట్రాక్టుల లావాదేవీలు నమోదయ్యాయి.

గల్ఫ్ ఆయిల్ చేతికి టైరెక్స్

డీల్ విలువ రూ. 103 కోట్లు



ముంబై: ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) చార్జర్ల తయారీ కంపెనీ టైరెక్స్ ట్రాన్స్‌మిషన్‌లో నియంత్రణ వాటాను కొనుగోలు చేయనున్నట్లు హిందుజా గ్రూప్ కంపెనీ గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా తాజాగా పేర్కొంది. ఇందుకు రూ.103 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొంది. తద్వారా ఈవీ విభాగంలో కంపెనీ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నట్లు అంచనా వేసింది. ఈవీ చార్జింగ్ మార్కెట్ ప్రస్తుత అంచనా విలువ 20 బిలియన్ డాలర్లుకాగా.. 2030కల్లా భారీగా 200 బిలియన్ డాలర్లను తాకగలదన్న అంచనాలున్నట్లు తెలిపింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, కాకినాడలో 825 పోస్టులు

కాకినాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 825
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-275, డేటాఎంట్రీ ఆపరేటర్-275, హెల్పర్-275.

అర్హత

» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ(అగ్రికల్చర్/మైక్రో బయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటా ఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్: అర్హత:** 8, 10 వతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు(టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సప్లైస్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, కాకినాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.09.2023.
» **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

హెచ్‌పీసీఎల్, ముంబైలో 276 పోస్టులు

ముంబైలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 276
» **పోస్టుల వివరాలు:** మెకానికల్ ఇంజనీర్-57, ఎలక్ట్రికల్ ఇంజనీర్-16, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్-36, సివిల్ ఇంజనీర్-18, కెమికల్ ఇంజనీర్-43, సీనియర్ ఆఫీసర్-సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్(సీజీడీ)ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్-10, సీనియర్ ఆఫీసర్-ఎల్ఎన్‌జీ బిజినెస్-02, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్-బయో ఫ్యూయల్ ప్లాంట్ ఆపరేషన్స్-01, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్-జీబీజీ ప్లాంట్ ఆపరేషన్స్-01, సీనియర్ ఆఫీసర్-సేల్స్(రిటైల్/లూబ్స్/డైరెక్ట్ సేల్స్/ఎల్‌పీజీ)-05, సీనియర్ ఆఫీసర్-ఈవీ ఛార్జింగ్ స్టేషన్ బిజినెస్-04, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్-ముంబై రిఫైనరీ-02, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్-విశాఖ రిఫైనరీ-02, క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) ఆఫీసర్-06, చార్టర్డ్ అకౌంటెంట్స్-24, లా ఆఫీసర్లు-09, లా ఆఫీసర్లు-హెచ్‌ఆర్-05, మెడికల్ ఆఫీసర్-04, జనరల్ మేనేజర్(ఆఫీస్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ) -01, వెల్ఫేర్ ఆఫీసర్-ముంబై రిఫైనరీ-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, సీఏ, ఎంబీఏ, పీజీడీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ, మూట్ కోర్ట్(లా ఆఫీసర్లు/లా ఆఫీసర్లకు మాత్రమే) తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2023
» **వెబ్‌సైట్:**www.hindustanpetroleum.com

టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ తెలంగాణ గిరిజన గురుకుల లా కళాశాల సంగారెడ్డిలో యూజీ(లా సబ్జెక్టు) స్థాయిలో బోధించుటకు తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. సెట్/నెట్/పీహెచ్‌డీ ఉండాలి. పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా
» **దరఖాస్తు ప్రారంభతేది:** 20.08.2023.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.09.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ttwrdcs.ac.in https://tgtwgurukulam.telangana.gov.in.

ఇండియన్ బ్యాంక్‌లో 11 స్పోర్ట్స్ కోటా పోస్టులు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ స్పోర్ట్స్ పర్సన్స్ కోటాలో క్లర్క్/ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **స్పోర్ట్స్:**బాస్కెట్ బాల్,క్రికెట్,హాకీ, వాలీబాల్.
» **అర్హత:**12వ తరగతి/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి
» **వయసు:** 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,900 నుంచి రూ.63,840 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.09.2023.
» **వెబ్‌సైట్:** www.indianbank.in

సైంటిస్ట్‌లకు ఐసీఏఆర్ స్వాగతం

» ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్టులు
» ఏఎస్ఆర్‌బీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ
» ఎంపికైతే.. ఉజ్వల భవిష్యత్తు ఖాయం

ఐసీఏఆర్.. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్! దేశవ్యాప్తంగా పలు పరిశోధన శాలలు ఉన్న ఐసీఏఆర్.. పీహెచ్‌డీ ఉత్తీర్ణులకు స్వాగతం పలుకుతోంది. మొత్తం 368 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చరల్ సైంటిస్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఏఎస్ఆర్‌బీ) ఆధ్వర్యంలో.. నియామకాలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఏఎస్ఆర్‌బీ నోటిఫికేషన్ వివరాలు, పోస్ట్‌లు, ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. సంక్షిప్తంగా ఏఎస్ఆర్‌బీ. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ విభాగం ఏర్పాటు చేసిన సంస్థ. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్), ఇతర వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో సైంటిస్ట్ పోస్ట్‌లకు ఎంపిక ప్రక్రియను ఏఎస్ఆర్‌బీ చేపడుతుంది. ఈ సంస్థ సైంటిస్ట్ పోస్ట్‌ల భర్తీకి నిరంతరం నోటిఫికేషన్లు విడుదల చేస్తుంటుంది. తాజాగా ఐసీఏఆర్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న పరిశోధనశాలల్లో సైంటిస్ట్స్ పోస్ట్‌ల భర్తీకి దరఖాస్తు ప్రకియ ప్రారంభించింది.

మొత్తం పోస్టులు 368

తాజా నోటిఫికేషన్ ద్వారా ఏఎస్ఆర్‌బీ.. ప్రిన్సిపల్ సైంటిస్ట్స్, సీనియర్ సైంటిస్ట్ హోదాలో మొత్తం 368 పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ప్రిన్సిపల్ సైంటిస్ట్ హోదాలో 80 పోస్ట్‌లు, సీనియర్ సైంటిస్ట్ హోదాలో 288 పోస్ట్‌లు ఉన్నాయి.

అగ్రికల్చర్ నుంచి ఎకానమీ వరకు

పలు స్పెషలైజేషన్లలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌లు, సీనియర్ సైంటిస్ట్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. అగ్రికల్చర్, అనుబంధ విభాగాలతోపాటు ఎకానమీ, బిజినెస్ పాలసీ, హ్యూమన్ రిసోర్సెస్ వంటి స్పెషలైజేషన్లలోనూ ఈ పోస్ట్‌ల నియామకం చేపట్టనున్నారు.

పీహెచ్‌డీ అర్హతగా

ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ రెండు పోస్ట్‌లకు పీహెచ్‌డీని అర్హతగా నిర్దేశించారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకుంటున్న స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. తమ అర్హతలకు సరితూగే అన్ని పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఆయా పోస్ట్‌లకు సంబంధించి ప్రాథమ్యత క్రమాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

అనుభవం తప్పనిసరి

- ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే వారికి పని అనుభవం తప్పనిసరి. ▪ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పోస్ట్‌లకు సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ తర్వాత పదేళ్ల అనుభవం ఉండాలి.
- సీనియర్ సైంటిస్ట్ పోస్ట్‌లకు సంబంధిత విభాగంలో ఎనిమిదేళ్ల పని అనుభవం తప్పనిసరి.

వయసు

- ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు గరిష్ఠంగా 52 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు గరిష్ఠంగా 47 ఏళ్లు ఉండాలి.

వేతన శ్రేణి

- ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్ట్‌లకు వేతన శ్రేణి కూడా భారీగా ఉంటోంది.
- ప్రిన్సిపల్ సైంటిస్ట్స్‌కు వేతన శ్రేణి రూ.1,44,200 -రూ.2,18,200, సీనియర్ సైంటిస్ట్‌లకు వేతన శ్రేణి రూ.1,31,400-2,17,100గా పేర్కొన్నారు.



ఇంటర్వ్యూలో ప్రతిభ

ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్ పోస్ట్‌లకు పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. ఆయా స్పెషలైజేషన్లలో వచ్చిన దరఖాస్తులు, పోస్ట్‌ల సంఖ్య, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 8, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://asrb.org.in/noticeboard

ఫుల్‌స్టాక్ డెవలపర్స్‌కు ఫుల్ డిమాండ్!

ఐటీ రంగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వెబ్3 మొదలైన టెక్నాలజీల ప్రవేశంతో.. డిజిటల్ నైపుణ్యాల పరిధి వేగంగా మారుతోంది. ఫుల్‌స్టాక్ డెవలపర్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఐటీ కంపెనీలు లక్షల వేతనాలతో వీరికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు ఫుల్‌స్టాక్ డెవలపర్‌గా కెరీర్ ప్రారంభించాలంటే.. ఏయే నైపుణ్యాలు అవసరం, అర్హతలేంటి? ఫుల్‌స్టాక్ డెవలపర్లు ఐటీ సంస్థల్లో నిర్వర్తించే విధులు తదితర వివరాలు..


ఒక అప్లికేషన్ లేదా వెబ్‌సైట్.. ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ అభివృద్ధిని ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ అంటారు. ఫుల్‌స్టాక్ డెవలపర్లు అప్లికేషన్‌కు సంబంధించిన ప్రోగ్రామింగ్, డిజైన్, డేటా బేసెస్, డీబగ్గింగ్ వంటి విధుల్లో కీలకంగా వ్యవహరిస్తారు. అలాగే యూజర్ ఎక్స్‌పీరియెన్స్, బిజినెస్ లాజిక్, అప్లికేషన్ లుక్, ఫంక్షనింగ్‌ల్లో నిష్ణాతులుగా ఉంటారు.

అందుకే అధిక డిమాండ్

సాంకేతిక రంగంలో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ కీలక మైలురాయిగా నిలుస్తోంది. నైపుణ్యాల బృందంగా ఫుల్‌స్టాక్ డెవలపర్లను అభివర్ణిస్తున్నారు. వీరు ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ ఇంజనీరింగ్‌కు వారధిగా నిలుస్తూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. విభిన్న అప్లికేషన్స్‌కు సంబంధించి అన్ని దశల్లో ఫుల్‌స్టాక్ డెవలపర్లు పనిచేయగలరు. ఒక దశకు మరొక దశకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించగలరు. ఆయా డొమైన్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ నాలెడ్జ్‌తో పాటు టీమ్‌లో ఏ పనినైనా వీరు చేయగలరు. ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ ఇంజనీరింగ్‌పై అవగాహన, పని చేయగలిగే సామర్థ్యాలు ఫుల్‌స్టాక్ డెవలపర్ల సొంతం. అందుకే ప్రస్తుతం ఫుల్‌స్టాక్ డెవలపర్లకు జాబ్ మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది.

నేర్చుకోవాల్సిన టూల్స్

- అప్లికేషన్స్‌కు సంబంధించిన అన్ని స్థాయిల్లో పని చేయగలిగే ఫుల్‌స్టాక్ డెవలపర్‌గా మారేందుకు బేసిక్ టూల్స్‌పై అవగాహనతోపాటు ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ బ్రౌజర్, టెక్స్ట్ ఎడిటర్, ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ టూల్స్, ప్యాకేజ్ మేనేజర్స్, డేటా బేసెస్‌పై పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ సర్టిఫికేషన్స్, శిక్షణ ద్వారా ఈ విభాగంలో కెరీర్‌ను ప్రారంభించొచ్చు.
- ఫుల్ స్టాక్ డెవలపర్‌లు సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, లాంగ్వేజెస్, డేటాబేస్‌కు సంబంధించిన టెక్నికల్ నైపుణ్యాలు నేర్చుకోవాలి. ఫ్రంట్, బ్యాక్ ఎండ్ వెబ్ డెవలపర్‌లకు ఒకే విధమైన సాఫ్ట్ స్కిల్స్ అవసరం అయినప్పటికీ.. సాంకేతిక సామర్థ్యాలు భిన్నంగా ఉంటాయి. ఫుల్‌స్టాక్ వెబ్ డెవలపర్ విభిన్న ఫ్రేమ్‌వర్క్ రకాలపై పని చేయడానికి నిర్దిష్ట నైపుణ్యాలను కలిగి ఉండాలి.
- బ్యాక్‌బోన్.జేఎస్, కోడ్‌పెన్, విజువల్ స్టూడియో కోడ్, టైప్ స్క్రిప్ట్, వెబ్‌స్టోమ్, గిట్‌హబ్, స్లాక్, ఎలక్ట్రాన్ వంటి టూల్స్ నేర్చుకోవాలి. ఫుల్‌స్టాక్ డెవలపర్లు వెబ్‌సైట్‌కు సంబంధించిన సమాచారాన్ని డేటాబేసెస్‌ల్లో నిక్షిప్తం చేసి.. అవసరమైనప్పుడు వినియోగించుకుంటారు. దాంతో ఫుల్‌స్టాక్ డెవలపర్లకు డేటాబేసెస్, ఒరాకిల్, రెడిస్, మ్యాంగోడీబీ, ఎస్‌క్యూఎల్ సర్వర్ వంటి నైపుణ్యాలు అవసరమవుతాయి.



ముఖ్యమైన విధులు

❖ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన వాటిని సమకూర్చుకోవడం. ❖డేటాబేసెస్, సర్వర్ల ఏర్పాటు సంబంధిత విషయాలు. ❖అప్లికేషన్ టెస్టింగ్. ❖ వేర్వేరు వేదికల్లో(పరికరాలు)ప్రొడక్ట్‌ను పరీక్షించడం. ❖ఎడిటింగ్ అండ్ మాడిఫయింగ్ కోడ్స్ మొదలైనవి.

కంపెనీల మొగ్గు

ఫుల్‌స్టాక్ డెవలపర్లను నియమించుకుంటే.. ఆయా టాస్కులకు ప్రత్యేక స్పెషలిస్టుల అవసరం ఉండదు. అందుకే కంపెనీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకొనే క్రమంలో ఫుల్‌స్టాక్ డెవలపర్ల వైపు సంస్థలు మొగ్గుచూపుతున్నాయి. ఐటీ రంగంలో సాంకేతికత ఎప్పటికప్పుడు మారుతోంది. ఫుల్‌స్టాక్ డెవలపర్లు కొత్త టెక్నాలజీని వేగంగా నేర్చుకోవడంలో ముందుంటున్నారు. దాంతో ఫుల్‌స్టాక్ డెవలపర్లు కలిగిన కంపెనీలకు రిక్రూట్‌మెంట్, శిక్షణల పరంగా అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. అందుకే ప్రస్తుతం కంపెనీల తొలి చాయిస్ ఫుల్‌స్టాక్ డెవలపర్లు అవుతున్నారు.

స్టార్టప్స్ ఎంపిక

ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు, అప్లికేషన్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన అన్ని నైపుణ్యాలను ఫుల్‌స్టాక్ డెవలపర్లు కలిగి ఉంటారు. దాంతో స్టార్టప్‌లు సైతం నియామకాల్లో ఫుల్‌స్టాక్ డెవలపర్లకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. తద్వారా మొత్తం ఉద్యోగులపై చేసే వ్యయాన్ని తగ్గించుకుంటున్నాయి.

క్లుప్తంగా...

నోటరీ స్థలాల క్రమబద్ధీకరణపై విస్తృతంగా ప్రచారం

అధికారులకు సీఎస్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: నోటరీ స్థలాల క్రమబద్ధీకరణపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన విచారించి క్రమబద్ధీకరణ చేయాలని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలు, తెలంగాణకు హరితహారం, దశాబ్ది సంపద వనాలు, గొర్రెల పంపిణీ, బీసీ, మైనారిటీలకు రూ.లక్ష ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, దళిత బంధు, భూ పట్టాల పంపిణీ, సామాజిక భద్రతా పింఛన్లు, కారుణ్య నియామకాలు, నోటరీ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. కోటి మొక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కలెక్టర్లను అభినందించారు. హరితహారం కింద చేపట్టాల్సిన ప్లాంటేషన్‌ను సెప్టెంబర్ రెండవ వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ అక్రమాలపై టోల్ ఫ్రీ నంబర్

సాక్షి, హైదరాబాద్: ఔషధాలను అక్రమంగా, అధిక ధరకు అమ్మడం, నకిలీ మందుల విక్రయం, నాణ్యతలో లోపాలు తదితర అంశాలపై ఫిర్యాదు చేయాలని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి కోరారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు సెంట్రలైజ్డ్ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-6969ను ఏర్పాటు చేసినట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని పేర్కొన్నారు.

మూల్యాంకన మార్పుల ప్రక్రియ ముందుకు..

ఉన్నత విద్య పాలక మండలి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య పరీక్షల మూల్యాంకనంలో సమగ్ర మార్పులు తెచ్చే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ దిశగా అన్ని స్థాయిల్లోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పలు విశ్వవిద్యాలయాల వీసీలకు సూచించారు. మండలి పాలక వర్గ సమావేశం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) నేతృత్వంలో మూల్యాంకన విధానంలో మార్పులపై జరిగిన అధ్యయన నివేదికపై మండలి చర్చించింది. దీని అమలుకు ఓ నివేదికను రూపొందించాలని మండలి నిర్ణయించింది. ఇంజనీరింగ్ సమానమైన కోర్సులను డిగ్రీలో ప్రవేశపెట్టడం, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆనర్స్ కోర్సులను తీసుకొచ్చిన నేపథ్యంలో, వాటి పురోగతిని పరిశీలించారు.

హైబ్రిడ్ వర్కే సో బెటరూ!

73 శాతం మంది ఉద్యోగుల మనోగతం

మూడేళ్ల క్రితం యావత్ ప్రపంచం కరోనా కోరల్లో చిక్కి అన్నిరంగాలు ప్రభావితమయ్యాక వర్క్ ఫ్రం హోం విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఇంటి నుంచి పనిచేసే పద్ధతికి పలు రంగాల ఉద్యోగులు అలవాటు పడ్డారు. కొంతకాలంగా పరిస్థితులు సద్దుమణగడంతో ఐటీతో సహా పలు కంపెనీలు, సంస్థలు ఉద్యోగులు ఆఫీసుల నుంచి పనిచేయడం తప్పనిసరి చేస్తున్నాయి. దీనిపై ఉద్యోగుల మనోగతం ఎలా ఉందో తెలుసుకునేందుకు 'సీఐఈఎల్ హెచ్‌ఆర్' సంస్థ నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.



- వర్క్ ఫ్రం హోం లేదా హైబ్రిడ్ విధానం అనుమతించకపోతే కంపెనీ మారేందుకూ సిద్ధం
- ఆఫీసు నుంచి పనిచేయడంపై 26 % అసంతృప్తి
- వర్క్ ఫ్రం ఆఫీస్‌పై ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు
- తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వర్క్ ఫ్రం హోం, ఆఫీసులకు తిరిగి వెళ్లడంపై ఉద్యోగుల్లో పెద్ద చర్చే సాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో హైబ్రిడ్ పనివిధానమే (ఆన్‌లైన్+ఆఫ్‌లైన్) మేలని అధికశాతం టెకీలు, ఇతర రంగాల ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. కంపెనీలు తప్పనిసరిగా ఆఫీసుల నుంచే పనిచేయాలని పట్టుబట్టకుండా వర్క్ ఫ్రం హోం లేదా వారానికి ఒకరోజు ఆఫీసుకు రావడం లాంటి పద్ధతులను అనుమతించాలనే డిమాండ్ పెరుగుతోంది. వర్క్ ఫ్రం హోం లేదా హైబ్రిడ్ విధానానికి అనుమతించకపోతే వేరే కంపెనీల్లోకి మారేందుకూ సిద్ధమని 73 శాతం టెకీలు, ఇతర ఉద్యోగులు చెప్పినట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. అయితే, 35 శాతం మంది మాత్రం ఆఫీసుల నుంచి పనిచేసే రోజుల సంఖ్యను పెంచడాన్ని స్వాగతించారు. 26 శాతం మంది ఆఫీసు నుంచి పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఐటీ, ఇతర రంగాల్లో పనిచేస్తున్న 3,800 ఉద్యోగుల అభిప్రాయాలతో ఈ సర్వే నివేదిక రూపొందించారు.

ఇప్పటికే టీసీఎస్, మెటా, గోల్డ్‌మ్యాన్ సాక్స్, జేపీ మోర్గాన్ తదితర కంపెనీలు కొంత వ్యతిరేకత వ్యక్తమవుతున్నా తమ ఉద్యోగులను ఆఫీసుల నుంచి పనిచేసేలా ప్రోత్సహిస్తున్నాయి. గతంలో వర్క్ ఫ్రం హోంను పూర్తి స్థాయిలో ప్రోత్సహించిన 'జూమ్' సంస్థ కూడా తమ ఆఫీసులకు 50 మైళ్ల పరిధిలో ఉన్న వారు వారానికి రెండురోజులు ఆఫీసుకు రావాలని చెబుతోంది. రెండువందలకు పైగా కంపెనీల్లో డెలాయిట్ ఇండియా బెనిఫిట్స్ ట్రెండ్స్ 2023 నిర్వహించిన సర్వేలో... 88 శాతం ఉద్యోగులు ఏదో ఒక రూపంలో తమకు అనుకూలమైన పని పద్ధతులను మార్చుకున్నట్లు వెల్లడైంది. ఐటీసీ సంస్థ వర్క్ ఫ్రం ఆఫీస్‌ను పునఃప్రారంభించడంతోపాటు కొందరు ఎంపిక చేసిన ఉద్యోగులను వారానికి రెండు రోజులు ఇంటి నుంచి పనిచేసేందుకు అనుమతిస్తోంది. డీబీఎస్ బ్యాంక్ ఇండియా నిర్వహించిన సర్వేలో హైబ్రిడ్ విధానానికి అత్యధికులు మొగ్గుచూపుతున్నట్టు తేలింది. దీనికి అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన హైబ్రిడ్ వర్క్‌మోడల్/ ఫ్లెక్సిబుల్ వర్క్ వసతులను రూపొందించినట్టు డీబీఎస్ బ్యాంక్ ఇండియా హెచ్‌ఆర్ కంట్రీ హెడ్ కిషోర్ పోడూరి తెలిపారు. హైబ్రిడ్ విధానంతో వ్యక్తిగత, వృత్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడంతోపాటు ట్రాఫిక్‌రద్దీ, వాహన కాలుష్యం నుంచి ఉపశమనం దొరుకుతుందని ఉద్యోగులు భావిస్తున్నట్లు చెప్పారు.

వర్క్ ఫ్రం ఆఫీసుకు కంపెనీల మొగ్గు

అనుకూలమైన పని గంటలు

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఉండే సంప్రదాయ ఆఫీసు పనివేళల విధానం కాకుండా నిర్దేశిత లక్ష్యాల సాధనకు ఉద్యోగులు తమకు అనుకూలమైన పని సమయాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీనివల్ల ఉత్పాదకత కూడా పెరుగుతోంది. దీంతో వారు వ్యక్తిగత, కుటుంబ బాధ్యతలను కూడా సరైన పద్ధతుల్లో నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

-నీలేశ్ గుప్తా, డైరెక్టర్, డెలాయిట్ ఇండియా

వర్క్‌ఫోర్స్ ఉండేలా...

ఉద్యోగుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని పని ప్రదేశంలో చేపట్టాల్సిన చర్యలు, తీసుకురావాల్సిన మార్పులపై కంపెనీలు దృష్టి పెట్టాల్సిన అవసరముంది. వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఉత్పాదకతను పెంచే వర్క్‌ఫోర్స్, నైపుణ్య ఉద్యోగులు ఉండేలా చూసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది..

-ఆదిత్య నారాయణ్ మిశ్రా, సీఈవో, సీఐఈఎల్ హెచ్‌ఆర్

హైబ్రిడ్ వర్కింగ్ మోడల్ అంటే...

ఆఫీసు, ఇంటి నుంచి పనిచేయడాన్ని సమ్మిళితం చేస్తే హైబ్రిడ్ పనివిధానం అవుతుంది. ఇందులో వారంలో కొద్ది రోజులు ఆఫీసు నుంచి, కొద్దిరోజులు ఇంటి నుంచి పనిచేస్తారు. యాజమాన్యం, ఉద్యోగులకు అనుకూలంగా ఉండే పని విధానాన్ని, ఆఫీసు వేళలను నిర్ణయిస్తారు. ఇందులో భాగంగానే ఉద్యోగుల ఇళ్లకు దగ్గర్లోని లేదా ఉద్యోగులకు అనుకూలంగా ఉండే కో వర్కింగ్ ప్లేస్‌ల నుంచి పనిచేసే వీలు కూడా కల్పిస్తారు. దీంతో యాజమాన్యాలు, ఉద్యోగులకు అనువైన విధానాలను ఎంపిక చేసుకునే సౌలభ్యం అందుబాటులోకి వస్తుంది.

597 పోస్టుల భర్తీ

గ్రూప్-1, గ్రూప్-2

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గ్రూప్-1లో 89, గ్రూప్-2లో 508 ఉద్యోగాలకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్

ఏపీపీఎస్సీ ద్వారా నేరుగా భర్తీ ● వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖలకు ఆర్థికశాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది. వివిధ శాఖల్లో 89 గ్రూప్-1, 508 గ్రూప్-2 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి(హెచ్ఆర్) చిరంజీవి చౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీ ఎస్సీ) ద్వారా ఈ పోస్టులను నేరుగా భర్తీ చేయ నున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వ్యవసాయ, సహకార, బీసీ సంక్షేమం, ఆర్థిక, హోం, మున్సిపల్ పరిపాలన, రెవెన్యూ, సాంఘిక సంక్షేమం, రవాణా, రహదారులు- భవనాల శాఖల్లో గ్రూప్-1 పోస్టులు భర్తీ చేయను న్నారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్థిక, సాధారణ పరిపాలన, న్యాయ, లెజిస్లేచర్ తదితర శాఖల్లోనూ గ్రూప్-2 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్-1లో అత్యధికంగా హోం శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్-కేటగిరీ-2లో 25 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్-2 కేటగిరీలో రాష్ట్ర సచివాలయంలో అత్యధికంగా 161 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. సంబంధిత శాఖలు ఆయా పోస్టుల వివరాలతో పాటు జోన్, జిల్లాల వారీగా ఖాళీలతో పాటు రోస్టర్ పాయింట్స్, విద్యార్హత వివరాలను వెంటనే ఏపీపీఎస్సీకి సమర్పించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ లైబ్రరీని ప్రారంభించి పరిశీలిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లా నాగేశ్వర్‌రావు, కల్యాణ్‌రావు, బైరెడ్డి శ్రీనివాస్ తదితరులు. ఇదే కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ చాంబర్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్, క్లయింట్ చాంబర్‌ను జస్టిస్ పీ.శామ్ కోషి, క్లయింట్ డిస్కషన్ చాంబర్-2ను జస్టిస్ వినోద్‌కుమార్ ప్రారంభించారు.

వినాయక చవితి సెప్టెంబర్ 18నే

తెలంగాణ రాష్ట్ర విద్వత్సభ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఈ సంవత్సరం వినాయక చవితి పర్వదినాన్ని సెప్టెంబర్ 18 సోమవారం రోజునే నిర్వహించుకోవాలని తెలంగాణ విద్వత్సభ ప్రకటించింది. శోభకృత్‌నామ సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్థి రోజునే మధ్యాహ్నం వరకు చవితి తిథి ఉన్నందున అదే రోజున వినాయక చవితిగా నిర్వహించుకోవాలని నిర్ధారించినట్టు తెలంగాణ విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతిలు ఓ ప్రకటనలో తెలిపారు. చవితి తిథి 18న ఉదయం 9.58కి ఆరంభమై 19వ తేదీ ఉదయం 10.28కి ముగుస్తుందని తెలిపారు. దీని ప్రకారం చవితి తిథి మధ్యాహ్నం సమయానికి 18నే ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్ కార్యాలయాలకు, ప్రభుత్వ సలహాదారులకు తెలిపినట్టు వెల్లడించారు. జూలై 22, 23 తేదీల్లో వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో జరిగిన షష్ఠమ విద్వత్సమ్మేళనంలో వందమంది సిద్ధాంతుల సమక్షంలో పండుగల తేదీలను ఖరారు చేసినట్టు పేర్కొన్నారు.

విద్యలో తెలంగాణ వెనుకబాటు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం. చిత్రంలో శాంతాసిన్హా తదితరులు

- కమీషన్ల కోసమే ప్రాజెక్టులపై ఖర్చు: కోదండరాం
- నాణ్యమైన విద్యను అందించకపోవడం హక్కుల ఉల్లంఘనే: శాంతాసిన్హా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): విద్య విషయంలో ఇతర అన్ని రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ వెనుకబడి ఉందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక, మదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాసామర్థ్యాలు అందించడం ప్రభుత్వ చట్టబద్ధత బాధ్యతగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, విద్యకు తెలంగాణ రాష్ట్రం బడ్జెట్‌లో అత్యంత తక్కువ ఖర్చు చేస్తోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పెట్టిన ఖర్చును విద్యపై పెడితే తెలంగాణలో ఉన్న స్కూల్స్ అన్నీ బాగుపడేవని చెప్పారు. కాంట్రాక్టర్లు కమీషన్లు ఇస్తారు కాబట్టే విద్యపై కాకుండా ప్రాజెక్టులపై ఖర్చు చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని, సరిపడా టీచర్లు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ కమిషన్ ఫర్ చైల్డ్ రైట్స్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో దిగజారిన విద్యా ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో డ్రాపౌట్లు పెరిగిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్య అందించకపోవడం రాజ్యాంగం కల్పించిన హక్కుల ఉల్లంఘనగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ జి.వేణుగోపాల్, మదర్స్ అసోసియేషన్ కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులు ప్రసంగించారు.

14 ఏళ్లుగా తప్పించుకు తిరిగి.. సీఐడీకి చిక్కి

సాక్షి, హైదరాబాద్: నగరంలోని కూకట్‌పల్లిలో కన్యకాపరమేశ్వరి కో-ఆపరేటివ్‌బ్యాంక్‌లో ఖాతాదారులను మోసగించిన కేసులో ఇద్దరు నిందితులను సీఐడీ పోలీసులు 14 ఏళ్ల తర్వాత అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ-15గా ఉన్న సదరు బ్యాంకు ఉద్యోగి విశాఖపట్టణానికి చెందిన కాకర్లపూడి కృష్ణ వర్మ, అతడి భార్య కాకర్లపూడి పద్మ అలియాస్ రూప 14 ఏళ్లుగా పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నారు. 2016లో వీరిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. నిందితుల పక్కా సమాచారాన్ని సేకరించిన డీఎస్పీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ శివరావు, ఏఎస్సై ఖలీల్, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిల బృందం ఇద్దరు నిందితులను ఆదివారం కూకట్‌పల్లిలో అరెస్టు చేసింది. కన్యకాపరమేశ్వరి కో-ఆపరేటివ్‌బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, కొందరు ఉద్యోగులు కలిసి ఖాతాదారులను రూ.2.86 కోట్ల మేర మోసగించినట్లు 2009లో సీఐడీ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఐపీసీ సెక్షన్ 409, 420, 477-ఏల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐడీ అధికారులకు సదరు మోసంపై పలు ఆధారాలు లభించాయి. వీరి అరెస్టులో కీలకంగా పనిచేసిన అధికారులను సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు.

సింగరేణి జూనియర్ అసిస్టెంట్ పోస్టుల పరీక్ష రద్దు

హైకోర్టు ఉత్తర్వులు

సూపర్‌బజార్ (కొత్తగూడెం): సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణిలో 177 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి 2022 సెప్టెంబర్ 4వ తేదీన రాతపరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణలో లోపాలను లేవనెత్తుతూ అభిలాష్ అనే యువకుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి ఫలితాల నిలిపివేత కోసం ఉత్తర్వులు తీసుకొచ్చాడు. కానీ సింగరేణి యాజమాన్యం ఇంత కాలంగా ఫలితాలను ప్రకటించకుండా నిలిపివేసింది. కాగా, పరీక్షలను రద్దు చేస్తూ హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.